# నౌకాభంగం

రమేశుడు లా పరీక్షలో ఉత్తీర్ణుడు కావటం గురించి ఎవరూ సంశయించలేదు. సరస్వతీ కటాక్షం అతని కెప్పుడూ ఉంటూనే ఉన్నది. కలకత్తా విశ్వవిద్యాలయంలో అతనికి పతకాలూ, స్కాలర్ షిప్పులూ లభించాయి.

పరీక్ష లైపోయాయి. అతను ఇంటికి బయలుదేరవలసి ఉంది. కాని అతను ప్రయాణ ప్రయత్నంలో ఉన్నవాడిలాగా పెట్టేబేడా సర్దుకోలేదు. ఇంటికి వచ్చేయ్య మని అతనికి తండ్రి జాబు రాశాడు. పరీక్షా ఫలితాలు తెలుసుకుని మరీ వస్తానని రమేశుడు జవాబు రాశాడు.

కలకత్తాలో రమేశు డున్న ఇంటి పక్క ఇంట్లో మరిద్దరు విద్యార్థు లుంటున్నారు. వారు అన్నా చెల్లెళ్లు. జోగేంద్రుడు రమేశుడి లాగే లా చదువుతున్నాడు, అతని చెల్లెలు హేమనళిని ఆర్ట్సు చదువు తున్నది. వారి తండ్రి అన్నదబాబు బ్రహ్మసామాజికుడు. రమేశుడు తరచు వారింటికి టీ సేవించటానికి వెళుతూండే వాడు. అయితే అక్కడ అతని కున్న ఆకర్షణ టీమాత్రమే అనటానికి లేదు; ఎందుచేత నంటే, ఇతర సమయాలలో కూడా అత నక్కడ ప్రత్యక్ష మవుతూండే వాడు.

హేమనళిని తలకు పోసుకుని, తమ ఇంటిడాబా పైకి వెళ్ళి, పుస్తకం చదువుకుంటూ అటూ ఇటూ పచార్లు చేస్తూ, జుట్టు అర బెట్టుకునేది. అదే సమయంలో రమేశుడు తా నున్న ఇంటి డాబా పైకి వెళ్ళి, మెట్లవద్ద పుస్తకం పట్టుకుని కూర్చునే వాడు. అయితే అతని దృష్టి కేవలమూ తాను చదివే పుస్తకం పైనే ఉండేది కాదు.

హేమనళిని వివాహం గురించిన మాట లేవీ ఇంకా జరగలేదు. అయితే తాను హేమనళినికి మానసికంగా బద్ధుడైపోయినట్టు రమేశుడు భావించుకున్నాడు. అతను ఆమె తండ్రితో ఇంకా ఏమీ అనలేదు. అన్నదబాబు మరొక యువకుడిపై కన్ను వేసి ఉంచాడు. ఆ యువకుడు ఇంగ్లండు వెళ్ళి ఉన్నాడు; అతను అన్నదబాబు మిత్రుడి కొడుకు.

ఒకనాటి అపరాహ్ణం విద్యార్థులు టీ తాగుతూ, ఉత్సాహంతో ఏదో చర్చిస్తూ ఉండగా రమేశుడి తండ్రి వచ్చినట్టు కబురు వచ్చింది.

"రమేశ్‌బాబు తండ్రిగారిని పిలుచుకురా, ఆయనకూడా ఒక కప్పు టీ తీసుకుంటాడు," అన్నది హేమనళిని జోగేంద్రుడితో.

"ఎందుకులే? నేనే ఆయనవద్దకు పోతాను," అంటూ రమేశుడు లేచాడు.

అక్షయు డనే విద్యార్థి కిప్పుడు హేమనళినిదృష్టిలో బాగా పడే అవకాశం దొరికింది. "ముసలాయన ఇక్కడ ఏమీ తాకడు," అన్నా డతను.

రమేశుడు తండ్రి బ్రజమోహనుడు హిందూ ధర్మావలంబి. అన్నదబాబు బ్రహ్మసామాజికుడు.

రమేశుడు వెళ్ళిపోయాక టీ పార్టీ యథాప్రకారం సాగింది.

రమేశుడు తన ఇంటికి వెళ్లాడు. తండ్రి కొడులమధ్య కుశల ప్రశ్న లయాక బ్రజమోహనుడు, "రేపుదయం బండికి నా వెంట ఇంటికి వచ్చేస్తున్నావు," అన్నాడు కొడుకుతో.

"ఏమంత తొందర?" అన్నాడు రమేశుడు.

"ఏమీలేదు," అన్నాడు తండ్రి.

ఆ సాయంకాలం తండ్రి ఇంటలేనప్పుడు రమేశుడు తన తండ్రికి ఒక ఉత్తరం రాసి, తాను హేమనళినిని ప్రేమిస్తున్నట్టు వ్యక్తం చేదా మనుకున్నాడు. ఎన్నికాగితాలు చెడినా అతని ఆ ఉత్తరం కుదరనే లేదు.

రాత్రి భోజనం కాగానే బ్రజమోహనుడు పడుకున్నాడు. రమేశుడు పైకి వెళ్ళి కాలుకాలిన పిల్లిలాగా పచార్లు చేశాడు. రాత్రి తొమ్మిది చాయల అక్షయుడు పక్క ఇంటినుంచి వెళ్ళిపోయాడు. అన్నదుడి ఇంటి దీపాలు పదికల్లా ఆరిపోయాయి.

మర్నా డుదయం రమేశుడు తండ్రితోసహా రైలెక్కాడు. ఆ రైలు తప్పిపోకుండా బ్రజమోహనుడు చాలా జాగ్రత్త పడ్డాడు.

---

రవీంద్రనాథ్ ఠాకూర్ రచన

---

రమేశుడు తమ ఇంటికి పోతూనే, తనకొక కన్య నిశ్చయమయిందనీ, ముహూర్తం ఏర్పాటయిందనీ, పెళ్ళి ప్రయత్నాలు జరుగుతున్నాయనీ తెలుసుకున్నాడు.

బ్రిజమోహనుడికి ఈశానచంద్రుడనే బాల్యమిత్రు డుండేవాడు. చిన్నతనంలో బ్రిజమోహనుడికి ఎంతో సహాయం చేశాడు. అతను న్యాయవాదవృత్తి చేసుకుంటూ అకాలమరణం చెందాడు. అతని భార్య పుత్రికలకు ఎంతో డబ్బు మిగలలేదు. దానితోనే వారు ఏదో విధంగా కాలక్షేపం చేస్తూవచ్చారు. ఆ పిల్లనే ఇప్పుడు బ్రిజమోహనుడు తన కొడుక్కు నిశ్చయించాడు.

ఆ పిల్ల అందగత్తె కాదని కొందరన్నారు.

"అందం దేనికి? మనకు కావలసింది గుణవతి; ఇంటి పనులు నిర్వహించగలది. సంసారం సుఖంగా వెళ్ళాలని కోరేవాడెవడూ అందగత్తె అయిన భార్య కావాలనడు." అని బ్రిజమోహనుడు సమాధానం చెప్పాడు.

రమేశుడీ పెళ్ళి గురించి చాలా బాధపడ్డాడు. దీన్నుంచి తప్పించుకునేటందుకెన్నో ఉపాయాలాలోచించాడు, కాని ఒక్కటీ సరిగాలేదు. చివరకతను తెగబడి తండ్రితో, "నేనీ పెళ్ళి చేసుకోలేను. ఇదివరకే మరొకరికి మాట ఇచ్చాను," అన్నాడు.

బ్రిజమోహను డాశ్చర్యంతో, "నిశ్చితార్థ మయిపోయిందా ఏమిటి?" అని అడిగాడు.

"లేదు, కాని—"

"కనీసం పిల్లతరపు వాళ్ళతో మాట్లాడావా?"

"అలా లాంఛనప్రాయంగా మాట్లాడలేదు. అయినా—"

"ఇంతవరకే మాటలూ జరక్కపోతే, అంతటితో వదిలెయ్యి."

"అదికాదు. నేను మరొక పిల్లను పెళ్ళాడెయ్యటం అన్యాయం."

"నేను నిశ్చయించిన పిల్లను పెళ్ళాడకపోవటం మరింత అన్యాయం."

రమేశుడేమీ అనలేదు. అతనికి ఒక్కటే ఆశ: తన పెళ్ళికి పెట్టిన ముహూర్తం ఏ కారణం చేతనైనా తప్పిపోతే మళ్ళీ సంవత్సరం దాకా ముహూర్తాలు లేవుట. ముహూర్తం తప్పి తనకు వ్యవధి చిక్కుతుందని అతనాశించాడు.

కాని అలా జరగలేదు. ఇంకా ముహూర్తానికి వారం రోజులుందనగానే బ్రిజమోహనుడు పెళ్ళికూతురి వారి ఊరైన కామపురానికి ప్రయాణం కట్టాడు. పడవమీద రెండు రోజుల ప్రయాణం. తనకెంతో సహాయం చేసిన బాల్యమిత్రుడి భార్యను తన ఇంటికి తెచ్చి ఆదుకోవాలన్న కోరిక బ్రిజమోహనుడికి ఎంతో కాలంగా ఉన్నది. అయితే అది ఎలా సాధ్యమవుతుంది. ఆమె కూతుర్ని తన కొడుక్కు చేసుకోవటమే అందుకు మార్గం.

పెళ్ళి నిశ్చయమయింది గనక ఆయన ఇప్పుడు తన కాబోయే వియ్యపురాలిని, పిల్లతోసహా వచ్చి తన యింట ఉండమని కోరాడు. "మీకు మాత్రం ఈ కూతురుగాక ఇంకెవరున్నారు? మీరు వచ్చి, తల్లిలేని మీ అల్లుడికి తల్లిగాకూడా ఉండవచ్చు." అన్నాడాయన.

ఆమె సరే నన్నది.

వివాహం జరిగింది. రమేశుడు పురోహితు లనమన్న మంత్రాలను మనస్ఫూర్తిగా అనలేదు. పెళ్ళికూతురి కేసి చూడనైనా చూడలేదు. అందుకని ముత్తయిదువులు పరిహాసాలాడితే తలవంచుకుని భరించాడు. రాత్రి మంచంమీద తన భార్యకు వీపుపెట్టి పడుకుని, చీకటి విడకముందే లేచి బయటికి వెళ్ళిపోయాడు.

పెళ్ళి అయిపోయింది. తిరుగు ప్రయాణానికి నాలుగు పడవలు మాట్లాడారు. ఒక పడవనిండా ఆడవాళ్ళెక్కారు. మరొక దానిలో మగపెద్దలెక్కారు. పెళ్ళికొడుకూ, అతని యీడువారూ మరొక పడవలో ఎక్కారు. బాజాభజంత్రీలు నాలుగో పడవలో ఎక్కి వాద్య సంగీతం సాగించి, అందరికీ ఆనందం చేకూర్చారు.

ఉన్నట్టుండి భయంకరంగా గాలి వీచింది, ప్రళయంగా వర్షం కురవసాగింది. నది అల్లకల్లోల మయింది. పడవలనుంచి హాహాకారాలు బయలుదేరాయి. ఆ గాలికి పడవలు తలా ఒక విధంగానూ కొట్టుకుపోయి, ఎక్కడెక్కడో మునిగిపోయాయి.

## 2

రమేశుడికి స్పృహ వచ్చేసరికి ఆకాశం నిర్మలంగా ఉన్నది. వెన్నెలలో ఇసుక కణాలు రత్నాలలాగా ప్రకాశిస్తున్నాయి. అతను చుట్టూ కలయజూసి, తాను నది ఒడ్డున ఇసుకలో పడి ఉన్నట్టు తెలుసుకున్నాడు. నదిమీద పడవజాడ అన్నది లేదు. పీడకలలాగా జరిగిన ఘటనలన్నీ అతనికి జ్ఞాపకం రాసాగాయి.

అతను చేరినది పద్మానదిమధ్యగల ఒక లంకలాటి ఇసుకతిన్నె. అతను దాన్ని ఒక చివరనుంచి రెండవ చివరదాకా దాటి రెండో వైపునుంచి వెనక్కు వస్తూ, అంతదూరాన ఎర్రగా పడి ఉన్నదాన్ని చూశాడు. సమీపించి చూడగా ఒక స్త్రీ కనిపించింది. ఆమె పెళ్ళికూతురులా గున్నది.

నీటిలోపడి మునిగిన వారికి చేసే ప్రాథమిక చికిత్స అతనికి తెలుసు. అతని ప్రయత్నాల ఫలితంగా ఆమెకు శ్వాస తిరిగి వచ్చింది; ఆమె కళ్ళుతెరిచి చూసి, మళ్ళీ మూసుకున్నది. ఆమెకు శ్వాస ఆడుతూండటం అతనికి ధైర్య మిచ్చింది. వెన్నెలలో ఆమె ముఖాన్ని చాలాసేపు చూశాడు.

"ఈమెను పెళ్ళిలో చూడకపోవటం మంచిదే అయింది. ఈ విధంగా మా మధ్య ఏర్పడిన బంధంతో పోలిస్తే మంత్రాలతో ఏర్పడిన బంధం ఏపాటిది?" అనుకున్నా డతను.

కొంతసేపటికి పెళ్ళికూతురికి పూర్తిగా స్పృహ వచ్చింది. ఆమె లేచి కూర్చుని, చీరెకొంగు నెత్తిపైకి లాక్కుంది.

"మీ పడవ ఏమయింది? అందులో వారంతా ఏమయారు?" అని అత నామె నడిగాడు.

"తెలీదు."

అతను లంక అంతా వెతికివస్తానని ఆమెతో అన్నాడుగాని, ఆమె ఒంటరిగా ఉండటానికి భయపడ్డట్టు కనబడింది. అందుచేత అతను లేచినిలబడి అంతటా చూశాడు. అంతటా శూన్యం. అతను తన వారిని పేర్లుపెట్టి గట్టిగా పిలిచాడు. జవాబు లేదు.

పాప మాపిల్ల దుఃఖాన్ని ఆపుకోవటానికి ఎంత ప్రయత్నించినా అది ఆగక పైకి వచ్చేస్తున్నది. రమేశుడామె పక్కన కూర్చుని. వీపుమీద చెయ్యివేసి నిమిరాడు. ఆమె గట్టిగా ఏడ్చేసింది. రమేశుడు కూడా కన్నీరు కార్చాడు. కొంత ఏడ్చిన మీదట ఆమె గుండె బరువు తగ్గింది. ఆమె కళ్ళుతెరిచి చూసింది.

రమేశుడు ప్రేమగా ఆమెను దగ్గరికి తీసుకున్నాడు. ఆమె భయంతో గడగడలాడింది, కాని అతన్ని ప్రతిఘటించలేదు. అతని బాహూ బంధంలోనే ఆమెకు మనశ్శాంతి లభించింది. అరుణోదయం వేళ రమేశుడు ఇసుకలో పడుకుని నిద్రపోయాడు, అతని చెయ్యి తలగడగా పెట్టుకుని ఆమెకూడా నిద్రించింది.

సూర్యకిరణాలు కళ్ళలో పొడుస్తుంటే ఇద్దరూ నిద్ర లేచారు. ఆ సమయానికే నదిపై తెప్పపడవల సంచారం కూడా ఆరంభమయింది. రమేశుడొక పడవను మాట్లాడి, అందులో ఎక్కి, దగ్గిరలో ఉన్న గ్రామానికి వెళ్ళి, పడవల ప్రమాదం గురించి అక్కడి పోలీసులకు చెప్పి, మునిగిపోయిన వారి కోసం వెతికించమని కోరి, పెళ్ళి కూతురితోసహా ఇల్లు చేరుకున్నాడు.

పెళ్ళివారి పడవలు నదిలో మునిగాయనీ, కొద్దిమంది పడవవాళ్ళు తప్ప అంతా మరణించారనీ, అప్పటికే ఊళ్ళో తెలిసిపోయింది. రమేశుడింట అడుగు పెట్టగానే ముసలి దాసీది పెద్దపెట్టున శోకాలు పెట్టింది. నూతన వధువు వస్తే జరగవలిసిన మర్యాద లేవీ జరగకపోగా, ఆమెను చూడటానికి బంధువులెవరూ రాలేదు.

తండ్రికి ఉత్తర క్రియలు చేసి తన నివాసం మరొక చోటికి మార్చుదామని రమేశుడనుకున్నాడు. కాని అతనికి తండ్రివ్యవహారాలతోనే సరిపోయింది. తన భార్యను గురించి ఆలోచించటానికి కూడా అతనికి వ్యవధిలేదు. ఆమెతో దాంపత్యం కొనసాగించే విషయమై అతను కలలు కంటూ ఉండిపోయినాడు. అతని బంధువులు, ఆమె అనుకున్నంత చిన్నది కాదనీ, రమేశుడామెకన్న మరీ చిన్నవాడనీ ఆక్షేపించారు. కాని అతను మాత్రం ఆమెనే తన ప్రియురాలుగా, తన ధర్మపత్నిగా, తన పిల్లలకు తల్లిగా మనసులో ప్రతిష్ఠించుకున్నాడు.

వ్యవహారాలన్నీ చక్కబడటానికి మూడు నెలలు పట్టింది. అతను అప్పుడప్పుడూ సాయంకాలం వేళ మేడపైన కూర్చుని ఆమెతో కబుర్లు చెప్పేవాడు. ఆమె ఒంటరిగా ఉంటే వెనకనుంచి



వచ్చి కళ్ళు మూసేవాడు, ఆమెను తన చేతుల్లోకి తీసుకుని, ఆమె తలను తన వక్షానికి చేర్చుకునేవాడు.

ఒకనాడతను ఆమె జుట్టు సవరిస్తూ, "సుశీలా, ఇవాళ జుట్టు సరిగా ముడుచుకోలేదేం?" అని అడిగాడు.

"నన్ను సుశీలా, సుశీలా అని ఎందుకు పిలుస్తున్నారు? పేరు మార్చిన మాత్రాన గీత మారుతుందా? నేను పుట్టు దౌర్భాగ్యురాలిని, బతికినంత కాలమూ దౌర్భాగ్యురాలుగానే బతకాలి," అన్నదామె.

"ఏమిటి నీ దౌర్భాగ్యం?" అని అతను ఆశ్చర్యంతో అడిగాడు.

"నేను పుట్టకమునుపే మా నాన్న పోయాడు. నన్ను కన్న ఆరు నెలలకల్లా మా అమ్మ పోయింది. అనాధనై మేనమామ పోషణలో పెరిగాను. అతికష్టంగా కాలం గడుపుతూన్న నన్ను ఒకనాడు మీరు చూడవచ్చారు. నన్ను పెళ్ళాడ నిశ్చయించుకున్నారు. రెండు రోజులకల్లా మన పెళ్ళి జరిగిపోయింది. ఆ తరవాత ఏం జరిగిందీ మీకే తెలుసు," అన్నాదామె

రమేశుడికి తల తిరిగిపోయింది. ఆమె తాను పెళ్ళాడిన పిల్లకాదు.

## 3

ఆమె ఎవరి భార్య? ఎలా తెలుసుకోవటం? తాను పరపురుషుడన్న భావం ఆమెకు కలగకుండా ఆమెను గురించి తెలుసుకోవటానికి రమేశుడు ప్రయత్నించాడు.

ఒకనాడతనామెతో, "పెళ్ళికిముందు నన్ను చూసినప్పుడు నీకే మనిపించింది?" అని అడిగిచూశాడు.

"తలవంచు కూర్చున్నాను. మిమ్మల్ని చూడనే లేదు."

"నా పేరైనా వినలేదా ?"

"అవకాశ మేది ? పెళ్ళి అన్నారు, మర్నాడే పెళ్ళి చేసేశారు. నన్నెలా వదిలించుకుందామని తప్ప మా అవ్వకు మరో ఆలోచన లేకపోయింది. మీ పే రెవరు చెబుతారు ?"

"నీ దస్తూరీ చూద్దాం, నీ పేరురాసి చూపు."

ఆమె తన పేరు "శ్రీమతి కమలాదేవి" అని రాసింది. తన మారుపేరు "తారిణీ చరణుడు" అనీ, తన స్వగ్రామం "ధర్మపుష్కరం" అనీ రాసింది.

ఇటువంటి ఉపాయాలతో కమలను గురించి రమేశుడు కొన్ని వివరాలు సంపాదించాడు. ఇంకా తెలియనివి చాలా ఉన్నాయి. ఆమెను గురించి తన కర్తవ్యం క్లిష్టంగా కనబడింది. ఆమెను మేనమామ దగ్గిరికి పంపటం భావ్యం కాదు. ఆమె భర్త నదిలో మరణించి ఉండాలి. ఒకవేళ అతను బతికే ఉన్నా, కొంతకాలం తన యింట ఉన్నదాన్ని అతను ఏలుకోక పోవచ్చు. ఆమెను తనవద్ద ఉంచుకోదలిస్తే భార్యగానే ఉంచుకోవాలి. ఇంకొకడి భార్యను అలా ఉంచుకోవటం కూడని పని. ఆమెను మరెక్కడికన్నా పంపుదామంటే ఎక్కడికి పంపేటట్టు ?

ఈ సమస్యను కలకత్తా వెళ్ళి పరిష్కరించే ఉద్దేశంతో రమేశుడు కమలాదేవితోసహా కలకత్తా చేరి, పూర్వం తానుండిన ప్రాంతానికి కొంత దూరంలో ఒక ఇల్లు తీసుకున్నాడు. కమలకు కలకత్తా చూస్తే చాలా సరదా వేసింది.

వారికి పనిమనిషి ఏర్పడింది గాని అది రాత్రిపూట ఇంటికి పోతుంది. ఇంట్లో రమేశుడూ, కమలా మాత్రమే ఉంటారు. అప్పుడు వేరు వేరు పక్కలు వేసుకుని పడుకోవటానికి వంక దొరకటం కష్టం.

మొదటి రాత్రి అతను చదువుకుంటూ కూర్చునే మిషమీద కమలను ముందుగా నిద్ర పోనిచ్చాడు. ఆ రాత్రి గడిచిపోయింది. మరుసటి రాత్రికూడా ఏదో వంకచెప్పి అతను కమలను వేరుగా పడుకోనిచ్చి, ఉక్క జాస్తిగా ఉండటంవల్ల గది అవతల వరండాలో చాప పరిచి పడుకుని నిద్రపోయాడు. రాత్రి రెండు గంటలవేళ అతనికి నిద్రా భంగమయే సరికి, కమల అతని పక్కన కూర్చుని విసురుతూ కనిపించింది. అతనామె చెయ్యి పట్టుకుని విసరటం ఆపి, "నువు వెళ్ళి మంచం మీద పడుకో. నాకు గాలి అక్కర్లేదు." అన్నాడు. అతను వెంటనే నిద్రపోయి తెల్లవారు జామున లేచి చూసే సరికి ఆమె అతని మెడచుట్టూ చెయ్యి వేసి నిశ్చింతగా నిద్రపోతున్నది.

ఆమె తనపట్ల పత్నీ ధర్మం ఎలా నిర్వర్తిస్తున్నదీ ఆలోచించి అతనొక నిట్టూర్పు విడిచి, ఆమెను బోర్డింగ్ హౌసులో చేర్ప నిశ్చయించాడు.

"చదువుకోవాలని ఉందా ?" అని అతనామె నడిగాడు.

"మీకు చదివించాలని ఉంటే చదివించండి." అన్నదామె.

అతనామెను గుర్రపుబండీలో ఒక బోర్డింగ్ హౌసుకు తీసుకుపోయి, ఆమె నందులో చేర్పించి, తాను బయలు దేరాడు. ఆమె కూడా అతనితో బయలుదేరింది.

"నువ్వెక్కడికి ? నీ చదువూ, ఉండటమూ అంతా ఇక్కడే." అన్నాడు రమేశుడు.

"మీరు నా దగ్గిర ఉండరా ?"

"ఇక్కడ నన్నుండ నివ్వరు."

"అయితే నేనూ ఉండను. నన్ను మీ వెంటనే ఉండ నివ్వండి."

"పిచ్చిదానా, ఎందుకు భయం ?"

కమల కొయ్యబారి నిలిచిపోయింది. ఆమె దీనవదనాన్ని మనస్సులో ముద్ర వేసుకుని అతను వెళ్ళిపోయాడు.

రమేశుడు న్యాయవాది వృత్తి అవలంబించి కోర్టులో ప్రాక్టీసు చేయటానికి నిశ్చయించాడు కాని అతని మనస్థితి అందు కనుకూలంగా లేదు. అతను మనస్థిమితం కోసం గంగ ఒడ్డునా, ఉద్యానవనాల్లోనూ, ఇతర చోట్లా తిరుగుతూ కాలం వెళ్ళబుచ్చుతున్నాడు.

ఒకనాడు అన్నదబాబు వద్దనుంచి అతని కొక ఆప్యాయమైన ఉత్తరం వచ్చింది. "పరీక్ష పాసయావని తెలిసింది. కాని నీ ద్వారా ఆ మాట తెలియనందుకు విచారించాం. నీ క్షేమ సమాచారం తెలియటం లేదు. కలకత్తా కెప్పుడు వస్తావు ? జవాబు కోసం ఆత్రంగా ఎదురుచూస్తున్నాం." అని ఆయన రాశాడు.

సంగతేమి టంటే అన్నదబాబు ఇంగ్లండులో బారిష్టరీ చదివే ఒక యువకుడిపై కన్నువేసి ఉంచాడు. ఆయన మిత్రుడి కొడుకైన ఆ యువకుడు చదువు పూర్తిచేసి తిరిగి వచ్చి, బాగా డబ్బున్న ఒక జమీందారు కూతుర్ని చేసుకోవటానికి నిశ్చయించి, ముహూర్తం కూడా పెట్టుకున్నాడు.

అన్నదబాబు ఉత్తరానికి రమేశుడు సమాధానం రాస్తూ, కారణాంతరాలచేత తాను రాలేకపోయాననీ, ఉత్తరం కూడా రాయలేకపోయాననీ అన్నాడు. తనుండే చోటుకూడా తెలియజేయలేదు.

మర్నాడు తడను కోర్టు దగ్గిర బండికోసం చూస్తూ నిలబడి ఉండగా, ఒక బండి అతని పక్కన ఆగింది. అందులో అన్నదబాబూ, హేమనళినీ ఉన్నారు. వాళ్ళతన్ని టీకి ఆహ్వానించారు. అతను కూడా బండిలో ఎక్కాడు.

"పరీక్ష పాసయినట్టు రాశారు కారేం ?" అన్నది హేమనళిని.

"నువు పాసయినట్టు తెలిసి చాలా సంతోషించాము," అన్నాడు రమేశుడు.

"ఇప్పు డెక్కడ ఉంటున్నావు ?" అని అన్నదబాబడిగాడు.

రమేశుడు చెప్పాడు.

"మీ పాత ఇల్లు బాగాలేదా ?"

"మా బంధు వొకాయన జబ్బుగా ఉంటే ఆయనకు దగ్గిరగా ఉంటున్నా. పాత ఇంటికి రావాలనే ఉంది. జోగేంద్రబా బెలా ఉన్నాడు ?"

"లా తప్పాడు. మనళ్యాంతి కోసం పడమటి తీరానికి వెళ్లాడు." అన్నాడు అన్నదబాబు.

వెనకటి లాగే కూర్చుని టీ తాగుతుంటే రమేశుడికి అదోలా అనిపించింది.

"ఈసారి మీ ఊళ్ళో చాలా రోజు లున్నావు. ఏమిటి విశేషం?" అని అన్నదబా బడిగాడు.

"మా నాన్నగారు పోయారు."

"అరెరే, ఎంతదారుణం! జబ్బు చేసిందా ?"

"లేదు. పద్మానదిలో పడవతోబాటు మునిగిపోయారు. పడవలో ఉండినవా రంతా పోయారు."

అంతదాకా హేమనళిని హృదయంలో ఆవరించిన ఉన్న సంశయా లన్నీ పటాపంచలై, ఆమెకు రమేశుడిపై తిరిగి పూర్తి ప్రేమ నెలకొన్నది.

అంతలో అక్షయకుమారుడు వచ్చి, రమేశుణ్ణి చూసి, తనకు మళ్ళీ సైంధవుడు దాపురించా డనుకున్నాడు.

"మీ నాన్నగారు మిమ్మల్ని హఠాత్తుగా లాక్కుపోవటం చూసి మీకు పెళ్ళి చేసిగాని పంపరనుకున్నాం. శుభకార్యం నిర్విఘ్నంగా జరిగిందా ?" అని అతను రమేశు ణ్ణడిగాడు.

"రమేశుడి తండ్రిగారు పోయారట," అన్నాడు అన్నదబాబు.

హేమనళిని ఆ రాత్రి రమేశుణ్ణి తమ ఇంట భోంచెయ్యమని కోరింది. అతను తన పాతభాగంలోకి సోమవారం నాడు వస్తా నని మాట ఇచ్చాడు.

"తప్పక రండి. బి. ఎ. ఫిలాసఫీ చదవటానికి సహాయం చేద్దురుగాని," అన్నది హేమనళిని.

రమేశుడు పక్క ఇంటి పాత వాటాలోకి తిరిగి చేరాడు. అతనికీ, హేమనళినికీ మధ్య నానాటికీ చనువు బాగా పెరిగి పోయింది. రమేశుడు హేమనళిని దగ్గిర హార్మోనియం వాయించటం కూడా నేర్చుకోసాగాడు. ఆమె ఎంత శ్రమపడినా అతను తప్పుగానే వాయించేవాడు. మనిషిమీది మమతకొద్దీ అతని చాతగానితనం ఆమె కెంతో ఆనందాన్ని చేకూర్చేది.

## 4

అన్నదబాబు ప్రతి ఏడూ దేవీ నవరాత్రులకు జబల్పూరు వెళ్ళి అక్కడ తన బావమరిది ఇంట గడుపుతాడు. ఈయేడు దసరా దగ్గిర పడుతున్నది. తమవెంట జబల్పూరు రమ్మని అన్నదబాబు రమేశుణ్ణి అడిగాడు. హేమనళిని తనకు పది రోజులపాటు దూరమవుతుందని దిగులు పడుతున్న రమేశు డిందుకు సంతోషంగా ఒప్పుకున్నాడు.



అతను సంతోషాతిరేకంతో హార్మోనియం వాయించుకుం టూండగా అక్షయకుమారుడు వచ్చాడు.

"రమేశ్ బాబూ, హేమనళిని మంచిగోరి నేను మిమ్మల్నొక మాట అడగాలి. నేను అన్నదబాబుగారి ఆత్మీయులలో ఒకణ్ణి గనక నాకు అడిగే హక్కుకూడా ఉన్నది. హేమనళిని మీరు నిజంగా వివాహమాడే ఉద్దేశంతోనే ఉన్నారా ?" అని అక్షయు డడిగాడు.

"మీ కా సందేహం ఎందు కొచ్చింది ?"

"మీ తండ్రిగారు సనాతనవాది. అన్నదబాబు బ్రహ్మసమాజం వాడు. సనాతనుల పిల్లను మీకు చెయ్యాలనే గద ఆయన మిమ్మల్ని తీసుకుపోయింది ? ఆయన పోయా రనుకోండి ఇప్పుడు మీకు మీ ఇష్టం వచ్చినట్టు చేసే ఉద్దేశం ఉన్నదా ?"

"నా కేదన్నా బోధించదలిస్తే బోధించండి. కాని మా తండ్రి గారి ప్రస్తావన తేకండి, అక్షయబాబూ."

"సరే పోనివ్వండి, మీకు నిజంగా హేమనళినిని పెళ్లాడే ఉద్దేశం ఉందో, లేదో అదైనా చెప్పండి."

"మీరు వారికి ఆత్మీయులు కావచ్చు, నాకు కారు. దయచేసి ఈ విషయం నన్నేమీ అడక్కండి," అన్నాడు రమేశుడు చురుకుగా.

అక్షయుడు వెళ్ళిపోయాడు.

హేమనళినీ తానూ కలిసి జబల్పూరులో చదవటానికి పుస్తకాలు ఎన్నుకుందా మనుకున్నారు. ఆ మాట మరిచి రమేశుడు అయిదు గంటలకు టీకి వెళ్ళాడు. పెందలాడే రాకపోగా అతను మామూలు కన్న ఆలస్యంగా వచ్చినందుకు హేమనళిని చాలా బాధపడ్డది.

రమేశుడు అన్నదబాబుతో, "మీరు నన్ను మీ కుటుంబంలో వాణ్ణిగా చూస్తున్నందు కెంతో సంతోషిస్తున్నాను," అన్నాడు ఊపోద్ఘాతంగా.

''అందులో విశేష మేమున్నది? నువ్వునూ జోగేంద్రుడిలాంటి వాడివే గద,'' అన్నాడు అన్నదబాబు. ''నిన్నూ, మా హేమనళినినీ గురించి లోకులు రకరకాలుగా మాట్లాడుకుంటున్నా నేను లక్ష్య పెట్టలేదు. నీతో ఎవరన్నా ఈమాట ఎత్తినప్పుడు, 'రమేశబాబు చాలా పెద్దమనిషి, అనుచితంగా ప్రవర్తించడు.' అని చెబు తున్నాను. కాని సాధ్యమైనంత త్వరలో ఈ అపవాదులను అంతం చేస్తే మంచిది. నీ ఉద్దేశ మేమిటి?''

''మీ ఇష్టం. ముందు హేమనళిని ఉద్దేశం తెలుసుకోవాలేమో?''

''నిజమే కాని మా అమ్మాయి ఉద్దేశం నాకు తెలుసు నను కుంటాను. అయినా రేపు అడిగి తెలుసుకుంటాను. మనం జబ ల్పూరు పోవటాని కింకా పదిరోజుల వ్యవధి ఉంది. ఈ లోపుగా మీ ఇద్దరికీ వివాహం జరిగితే బాగుండునని నా ఉద్దేశం.''

## 5

దసరా శలవుల్లో బోర్డింగ్‌హౌస్ విద్యార్థినులు ఇళ్ళకు వెళ్ళి పోతారు. కమలను శలవుల్లోకూడా బోర్డింగ్‌హౌసులోనే ఉండనివ్వ మని రమేశుడు ప్రిన్సిపాల్‌తో అన్నాడు. ఆమె సరేనన్నది.

అన్నదబాబుతో మాట్లాడిన మర్నాడుదయం పెందలాడే బయలుదేరి పెద్ద మైదానానికి షికారువెళ్ళి, పెళ్ళికిముందే హేమ నళినితో కమల విషయం యావత్తూ చెప్పేద్దామనీ, కమల హేమను ఆప్తురాలుగా చూసుకుంటూ తమవెంటే ఉంటుందనీ అనుకున్నాడు.

కలకత్తాకు వచ్చినప్పటినుంచీ అతను కమల భర్తకోసం అన్వే షిస్తూనే ఉన్నాడు. ధర్మపుష్కరంలో ఉండే కమల మేనమామ తారిణీచరణుడికికూడా ఉత్తరం రాశాడు. తన మేనగోడలి భర్త పేరు నళినాక్షుడనీ, అతను రంగాపూరులో వైద్యవృత్తి చేస్తుండే వాడనీ, అతని జాడ తెలియరాలేదనీ తారిణీచరణుడు జవాబు రాశాడు. కమలభర్త నిశ్చయంగా చనిపోయే ఉంటాడని రమేశు డనుకున్నాడు.

అయితే కొత్త కష్టాలు వచ్చిపడ్డాయి. కొద్ది రోజు లనంతరం రమేశుడు పక్కఇంట టీ తాగుతుండగా అక్షయుడువచ్చి అదీ ఇదీ మాట్లాడుతూ, 'మా చెల్లెలు బోర్డింగ్‌స్కూల్లో చదువుతున్నది, తెలుసుగా? అది నాతో, "మీ రమేశబాబు చాలా చెడ్డవాడు. అతని భార్య మా స్కూల్లో చదువుతున్నది. శలవుల కందరూ వెళ్ళి పోతుంటే ఆమె మాత్రం అక్కడే ఉండాలిట. పాపం, కళ్ళు వాచేలా ఏడుస్తున్నది,' అన్నది," అన్నాడు.

అన్నదబాబు నవ్వి, "నీకే మన్నా పిచ్చా, అక్షయ్? రమేశు డనే పేరుగల వాళ్ళెందరు లేరు?" అన్నాడు. రమేశుడు మాత్రం వెలవెల పోతూ లేచి వెళ్ళిపోయాడు.

"రమేష్‌బాబూ! కోపం వచ్చిందా? నేను మిమ్మల్ని గురించి అంటున్నాననుకున్నారా?" అన్నాడు అక్షయుడు.

హేమనళిని ఏడవసాగింది.

"ఏమి టది, హేమా? ఏడుస్తున్నా వేమిటి? అక్షయుడు హాస్యాని కన్నాడు," అన్నాడు తండ్రి.

"నా కలాటి హాస్య మంటే మంట!" అంటూ హేమనళిని గబగబా మెట్లెక్కి పైకి వెళ్ళిపోయింది.

మర్నాడు టపాలో ప్రిన్సిపాలువద్ద నుండి రమేశుడికి ఉత్తరం వచ్చింది. శలవుల్లో కమల స్కూల్లో ఉండటానికి ఏ మాత్రమూ ఇష్టపడకుండా ఉన్న దనీ, ఆమె బాధ్యత తాము వహించమనీ, శనివారం స్కూలు మూయగానే ఆమె నింటికి పంపేస్తున్నా మనీ ప్రిన్సిపాలు రాసింది.

శనివారంనాడు కమల ఇంటికి వచ్చేస్తున్నది. ఆదివారం నాడే తన పెళ్ళి! అతను పక్క ఇంటికి వెళ్ళే సరికి అన్నదబాబు పత్రిక చూస్తూ కునికిపాట్లు పడుతున్నాడు.

"నాకు తొందర పనులు తగిలాయి. పెళ్ళి కొద్ది రోజులు వాయిదా వెయ్యండి," అన్నా డతను.

అన్నదబా బతన్ని తేరిపారజూస్తూ, "అదేమిటి?" ఆహ్వానాలు కూడా వెళ్ళిపోయాయి," అన్నాడు.

"పై వచ్చే ఆదివారానికి పెళ్ళిముహూర్తం మార్చామని అంద రికీ రాయండి," అన్నాడు రమేశుడు.

"అలా చేయటం భావ్యంగా ఉంటుందా? ఇదేమన్నా కోర్టు విచారణా, చిత్తం వచ్చినట్టు వాయిదా వెయ్యటానికి? ఇంతకూ నీకు తగిలిన తొందరపను లేవి?"

"చాలా తొందరపనులు, ఆగేవి కావు."

అన్నదబాబు కుర్చీలో వెనక్కు చేరగిలబడి, "ఆగేపనులు కావుట! సరే, ఇకనేం? పిలిచినవారికేం సంజాయిషీ యివ్వాలో అది నువే ఇచ్చుకో. ఎవరన్నా నన్నడిగితే, పెళ్ళికొడుక్కు పెళ్ళాడేతీరిక ఎప్పుడు దొరికేది అతనే తరవాత చెప్పుకుంటాడు అనేస్తాను. ఇంతకూ ఈమాట హేమనళినికి చెప్పావా?" అన్నాడు.

"లేదు. ఇంకా లేదు."

"అది ముఖ్యం. ఇది అచ్చగా నీ పెళ్ళేకాదు, దానిపెళ్ళికూడానూ. హేమా, హేమా!"

హేమనళిని వచ్చి, "ఏమిటి, నాన్నా?" అన్నది.

"రమేశుడి కేదో తొందరపనులు తగిలాయట. ప్రస్తుతం పెళ్ళాడటానికి తీరికలేదుట." అన్నాడు అన్నదబాబు

హేమనళిని తెల్లబోయి రమేశుడికేసి చూసింది. ఈ మాట ఆమె హృదయంలో శూలంలాగా గుచ్చుకున్నదని రమేశు డూహించగలిగాడు. ఈవార్త ఆమెకింత కటువుగా చెవులబడటం జరుగుతుందని అత ననుకోలేదు.

హేమనళిని అక్కడినుంచి వెళ్ళిపోయింది.

రమేశుడు వెళ్ళిపోయేటప్పుడు సావడిలో హేమను చూశాడు. ఆమె కిటికీవద్ద నిలబడి, నవరాత్రుల సన్నాహంలో ఉత్సాహంగా వీధిలో తిరిగే జనాన్ని చూస్తున్నది. శీతకాలపుఎండలో ఆమె ఎంతో మనోహరంగా ఉన్నది.

వాకిలివద్ద ఆగిపోయిన రమేశుడు మెల్లిగా ఆమెను సమీపించాడు. ఆమె అతనికేసి తిరగక వీధిలోని జనాన్ని మరింత ఆసక్తితో గమనిస్తున్నది. అతను గద్గదకంఠంతో. "నిన్నొక్కటి వేడుకుంటున్నాను," అన్నాడు.

అతని గొంతులో బాధ ఆలకించి హేమ అతనికేసి తిరిగింది.

''నాలో నమ్మకంఉంచు. నన్ను శంకించనని మాటఇయ్యి.''

అతనికళ్ళలో నీరుతిరిగింది. ఆమెకూడా ఒక్కసారిగా ద్రవించి కన్నీరు కార్చసాగింది. ఇద్దరిచూపులూ కలిశాయి. పైనేమీ అనకుండానే ఇద్దరూ పరస్పర విశ్వాసంతో శాంతి సుఖం పొందారు.

రమేశుడు తృప్తిగా నిట్టూర్చి, "మన పెళ్ళి వాయిదా పడటానికి కారణం చెప్పమంటావా?" అన్నాడు.

హేమనళిని తల అడ్డంగా తిప్పింది.

"మన పెళ్ళి అయాక కథఅంతా చెబుతాను," అన్నా డతను.

హేమచెక్కిళ్ళు కొద్దిగా జేగురించాయి. "మానాన్న చాలా చిరాకుగా ఉన్నాడు. ఆయనను శాంతపరచండి," అన్నది.

"రమేశుడు అన్నదబాబువద్ద ఆహూతుల జాబితా తీసుకున్నాడు.

కార్యక్రమంలో మార్పు లన్నీ నువే చూసుకో. ఇప్పటికే చాలా ఖర్చు పెట్టాను. అందులో హెచ్చుభాగం దుర్వ్యయమే. పారెయ్యటానికి నా దగ్గిర డబ్బు లేదు. పెళ్ళయాక ప్రాక్టీ సెక్కడ పెట్టేదీ నిర్ణయించుకున్నావా?" అని అన్నదబా బడిగాడు.

"పడమటగా ఏదైనా తగినచోటు చూసుకుందా మనుకుంటున్నాను," అన్నాడు రమేశుడు.

"అదే మంచిది. ఇటావా లాటి చోటైతే చాలా ఆరోగ్యకరంగా ఉంటుంది. అజీర్తి ఉండదు. ఒకసారి అక్కడ ఒక నెల రోజులున్నాను. ఇక్కడి కన్న రెట్టింపు తినేవాణ్ణి. చూడు బాబూ, నాకు ఒక్కతే కూతురు. దానికి దూరంగా ఉండలేను అందుకనే ఆరోగ్యకరమైన చోటు చూడమంటున్నాను."

"సరే లెండి. ఇటావా కోర్టులోనే ప్రాక్టీసు పెడతాను," అంటూ రమేశుడు ఆహ్వానితుల పట్టిక తీసుకుని వెళ్ళాడు. అందరికీ ఉత్తరాలు పోస్టు చేసే సరికి చాలా పొద్దుపోయింది.

## 6

శనివారం నాడు కమల వస్తున్నది. పాత ఇల్లింకా రమేశుడి అధీనంలోనే ఉన్నది. అతను పెందలాడే బయలుదేరి ఆ ఇంటికి వెళ్ళి, ఇల్లంతా కడిగించి, శుభ్రం చేయించాడు, వెచ్చాలు తెప్పించి సామానుగదిలో పెట్టించాడు. అతను కమల కోసం ఎదురుచూస్తూ ఇటావాలో తానూ, హేమనళినీ గడపబోయే జీవితం గురించి



"హరిశ్చంద్ర చరిత్ర ఎవరు వ్రాశారు?.........?........."

"నే చెప్తా......అప్పు ఎగవెయ్యకుండా చక్రవడ్డీకి అప్పు లిచ్చే వడ్డీవ్యాపారస్తుడు వ్రాశాడు; లేదా వ్రాయించి ఉంటాడు సార్!"

ఊహించుకుపోసాగాడు. ఆ దూరప్రాంతంలో బంగళాలో ఒంటరిగా ఉంటే హేమ కేమీ తోచదు. కమల తోడుంటే ఆమెకు ఉల్లాసంగా ఉంటుంది.

పెళ్ళి అయినదాకా అతను కమలక్కూడా ఏమీ చెప్పదలచ లేదు. ఆమె హేమనళినిద్వారా విషయా లన్నీ తెలుసుకుని, పరిస్థితి అర్థం చేసుకుని, ఆ ఇంట తన వాస్తవ స్థితికి సమాధాన పడిపోయింది.

అతని ఊహలు భగ్నమయాయి. స్కూలుబస్సువచ్చి ఆగిన చప్పుడయింది. కమల కెలా స్వాగతం చెప్పాలి? ఆమెతో ఏ విషయాలు ముచ్చటించాలి? తన నామె ఎలాచూస్తుంది?

అతని నౌక ర్లిద్దరూ కమల ట్రంకుపెట్టెనుతెచ్చి వరండాలో పెట్టిన చప్పుడు వినిపించింది. వారి వెనకగా వచ్చిన కమల వాకిలివద్ద ఆగిపోయింది.

"లోపలికి రా, కమలా,'' అన్నాడు రమేశుడు.

కమల గదిలోకి వచ్చింది. కాని అతనికేసి చూడలేదు. తనను శలవుల్లోకూడా స్కూలులోనే ఉంచటానికి అతను ప్రయత్నించిన మాట ఆమె మరవలేదు. అదీగాక, చాలా రోజులకి తిరిగిచూడటం వల్ల అతను అపరిచితుడులాగే ఉన్నాడు. ఆమె కిటికీవద్దకు వెళ్ళి సాయంకాలపుఎండలో నిలబడి ఉన్నది. ఆమె తలపై ముసుగు లేదు. దీర్ఘమైన ఆమె కేశాలు వీపుమీదుగా వేళ్లాడుతున్నాయి, వాటికొక ఎర్ర రిబ్బను కట్టివున్నది.

రమేశుడు కొన్ని క్షణాలపాటు ఆమెకేసి మౌనంగా చూశాడు. కొద్ది నెలలలోనే ఆమె బాగా పెరిగింది. ఆమె సౌందర్యం అతని మనసులో అస్ఫుటంగా ఉంటూవచ్చింది. కాని ఇప్పు డది ప్రస్ఫుటంగా ఉన్నది.

"కూర్చో, కమలా స్కూ లెలాఉంది?''

ఆమె కూర్చుని, ''బాగానే ఉంది,'' అన్నది ముక్తసరిగా.

ఏం మాట్లాడాలా అని రమేశుడు తలపగలగొట్టుకున్నాడు.

''భోజనం సిద్ధంగా ఉంది. తెప్పించమన్నావా ?''

''వద్దులెండి, వచ్చేటప్పుడేదో తిన్నాను."

''ఏమీ తినవా ? కావాలిస్తే పళ్లున్నాయి — ఆపిల్‌పళ్ళు, దానిమ్మపళ్ళు, సీతాఫలాలు."

కమల తల అడ్డంగా తిప్పి, తన ఇంగ్లీషు రీడరు తెరిచి, అందులోని బొమ్మలు పరిశీలించ సాగింది. ఆమె అలా కూర్చుని ఉంటే ఆమె అందాన్ని అతను తదేకదృష్టితో చూశాడు. తరవాత అతను లేచి వెళ్ళి, ఒక ప్లేటులో పళ్ళుపెట్టి తెచ్చి, "కమలా, నీ కేమీ ఆకలి లేదల్లే ఉంది. నాకు మాత్రం దహించుకు పోతుంది. నే నింక తట్టుకో లేను," అన్నాడు.

తలవని తలంపుగా కమల నవ్వింది. ఆ నవ్వుతో వారిద్దరి మధ్యా ఉండిన సంశయ మేఘాలు తొలగిపోయాయి.

రమేశు డొక ఆపిల్‌ను ముక్కలు కొయ్యసాగాడు, అతని తొందరా, చాతగాని తనమూ చూసి కమల విరగబడి నవ్వింది.

"చెక్కు తియ్యటం నాకు చేత కాలేదని నవ్వుతున్న ట్టున్నావు. నువ్వేం పొడిచెయ్యగలవో చూపించు." అన్నా డతను. ఆమె నవ్వు అతనికి చాలా అహ్లాద కరంగా ఉన్నది.

కమల తన పాదరక్షలు వదిలేసి, కింద చతికిలబడి, ఆపిల్ పండు తొక్క చక్కగా తీసేసి, ముక్కలు తరిగింది. రమేశు డామె ఎదురుగా కూర్చుని, ముక్కలను ఒక పళ్లెంలో తీసుకున్నాడు.

"నువుకూడా కొంచెం తీసుకో."

"వద్దు లెండి."

"అయితే నాకూ వద్దు."

కమల అతని కేసి చూసి, "అయితే ముందు మీరు తినండి, తరవాత నేను తింటాను," అన్నది.

"తరవాత తలాయిస్తావేమో ?"

"లేదు, లేదు. తింటాను."

రమేశుడు పళ్లెంలోనుంచి ఒక ఆపిల్‌ముక్క తీసుకుని తింటూ వాకిలికేసి చూసేసరికి జోగేంద్రుడూ, అక్షయుడూ కనిపించారు.

అక్షయుడు, "క్షమించాలి రమేశ్‌బాబూ, మీరు ఒంటరిగా ఉంటారనుకున్నాను. జోగేన్, ముందు చెప్పకుండా ఇలా రావటం మనదేతప్పు. కిందకువెళ్ళి కూచుందాం పద," అన్నాడు.

కమల చివాలున లేచి నిలబడింది.

వచ్చినవారిద్దరి పక్కగా ఆమె మరొక గదిలోకి వెళ్ళిపోయింది.

''రమేశ్. ఎవరాఅమ్మాయి?" అని జోగేంద్రు డడిగాడు,

"మా బంధువు."

''ఎలాటి బధుత్వం? మీ బంధువులందరి గురించీ నాకుచెప్పావు. ఈమెమాట ఎన్నడూ చెప్పలేదే?" అన్నాడు జోగేంద్రుడు.

''కాస్త తమాయించు, జోగేన్. మనిషికి రహస్యాలంటూ ఉండవా — స్నేహితులక్కూడా చెప్పరానివి?" అని అక్షయు డడ్డు తగిలాడు.

"ఎం, రమేశ్? ఇది అంత రహస్యమా ఏమిటి?" అని జోగేంద్రు డడిగాడు.

రమేశుడిముఖం జేవురించింది. "అవును, రహస్యమే. ఈమెను గురించి నీతో మాట్లాడటం నాకిష్టంలేదు," అన్నా డతను.

''కాని, దురదృష్ట వశాన, నా కామెనుగురించే మాట్లాడాలని ఉన్నది. నేను తిరిగిరాగానే అక్షయు డీ విషయం చెప్పటం మేల యింది. నువు హేమనళినికి ప్రధానం కాకపోతే అది వేరేవిషయం!" అన్నాడు జోగేంద్రుడు.

"ఇది మటుకు చెప్పగలను, నేను హేమనళినిని పెళ్ళాడటానికి చిత్తశుద్ధిగా అభ్యంతరమేమీలేదు." అన్నాడు రమేశుడు.

"నీదృష్టిలో లేకపోవచ్చు గాక, హేమనళిని ఆప్తులైన వాని దృష్టిలో అభ్యంతరం ఉండవచ్చుగా? ఈమె నిక్కడ ఎందుకని దాచి ఉంచుతున్నావు?"

"అందుకు కారణం చెప్పినట్టయితే రహస్యమే బయట పడుతుంది. కారణా లడక్కుండా నామాట విశ్వసించలేవా?'' అన్నాడు రమేశుడు.

"ఈమెపేరు కమలే కదూ ?"

''అవును.''

"ఈమె నీభార్య అని చెప్పుకుంటున్నావా?"

"చెప్పుకుంటున్నాను.''

"అయితే మరి, మమ్మల్నేమనుకున్నావు? ఈమె నీ భార్య అని అందరికీ చెప్పి, మమ్మల్ని మటుకు నీ భార్య కాదనుకోమంటావా? ఏదినిజమో మాకెలా తెలుస్తుంది?"

అక్షయుడు మళ్ళీ అడ్డొచ్చి, ''అరే, జోగేన్, పరిస్థితులు అసాధారణ మైనప్పుడు రెండురకాలవాళ్ళకు రెండురకాల కథలు చెప్పవలసి రావచ్చు. అందులో ఏదోఒకటి నిజమై ఉంటుంది. అతను నీకుచెప్పినదే నిజమేమో!'' అన్నాడు.

"నేను మీతో ఏమీ చెప్పబోను. హేమనళినిని పెళ్ళాడటంలో నే నామెకు చేస్తున్న ద్రోహమేమీ లేదు. కమల విషయాలు మీతో మాట్లాడక పోవటానికి బలమైన కారణమే ఉన్నది. నా సుఖానికీ, నా పరువు మర్యాదలకూ సంబంధించిన విషయమే అయినట్టయితే నేను మీ దగ్గిర ఏమీ దాచిఉంచను. కాని ఇది మరొకరి భవిష్యత్తుకు సంబంధించిన విషయం. అందుచేత మీకు ఏమీ చెప్పను." అన్నాడు రమేశుడు.

"హేమనళిని కంతా చెప్పావా ?" అని జోగేంద్రు డడిగాడు.

"లేదు. పెళ్ళయాక చెబుతాను. ఆమె కోరితే ఇప్పుడే చెబుతాను."

"కమలను కొన్ని ప్రశ్న లడగనా ?" అన్నాడు జోగేంద్రుడు.

"ఎంత మాత్రమూ వీల్లేదు. కమల కేవలమూ నిర్దోషి. నీ వామెను పరీక్షించటానికి నేను ఒప్పుకోను."

"సరే — నేను తెలుసుకో గోరిన దంతా తెలిసే పోయింది. తగిన సాక్ష్య మంతా నువే ఇచ్చావు. ఇదుగో, చెబుతున్నాను. నువు మా ఇంట అడుగు పెట్టా వంటే బయటికి గెంటేస్తాం. ఇంకా నేను చెప్పవలిసింది కొంచెం ఉంది. నువు రహస్యంగా గాని, బహిరంగంగా గాని హేమనళినికి ఉత్తరాలు రాయకు. రాశావో, నీ గుట్టు అందరికీ బట్టబయలు చేస్తాను. మీ ఇద్దరికీ పెళ్ళి జరక్క పోవటానికి కారణ మేమి టని ఎవరన్నా అడిగితే నేనే అనుమతించ లేదని చెబుతాను. కాని నువు జాగర్తగా మసలుకోలేకపోయావో నీ బండారమంతా బయటపడుతుంది. నీ మీద నా కేమీ సాను భూతిలేదు, కాని నా చెల్లెలు కారణంగా నిన్ను తేలికలో విడిచి పెడుతున్నాను. ఆఖరు మాట — హేమనళినితో నీ కేపాటి పరి చయంగాని ఉన్నట్టుగా ప్రవర్తించకు. ఇంత వంఛన చేసిన తరవాత నీ వాగ్దానాలను విశ్వసించటంలో అర్థం లేదనుకో. కాని నీలో సిగ్గన్నది ఏకోశాన అయినా ఉండే పక్షంలో నా హెచ్చరిక మరిచి పోకు," జోగేంద్రుడు వెనక్కు తిరిగాడు.

అక్షయుడు, "నిజంగా, జోగేన్, రమేశుడిపైన నీకు ఏమా త్రమూ జాలిలేదా ? అతను, పాపం, అన్నిమాటలూ విలాపడి ఊరు కున్నాడో ! మనం పోదాం. ఏమీ అనుకోకు, రమేశ్ మేం పోతు న్నాంలే," అన్నాడు.

వాళ్ళిద్దరూ గదినుంచి బయటికి వెళ్ళిపోయారు. రమేశుడు కొయ్యబారిపోయాడు. అతని మనసుకు చైతన్యం తిరిగి రాగానే బయటికివెళ్ళి ఈ పరిస్థితిని గురించి ఆలోచించా లనిపించింది. కాని కమల ఈ కొత్తచోట ఒంటరిగా ఉండవలసి వస్తుందని అతనికి గుర్తొచ్చింది.

అతను అవతలి గదిలోకివెళ్ళి, కమల కిటికీలోనుంచి వీధిలోకి చూస్తూ ఉండటం గమనించాడు.

"ఎవరు వాళ్ళు ? ఇవాళ ఉదయం వాళ్ళు మా స్కూలుకు కూడా వచ్చారు. వాళ్ళు మీతో ఏమంటున్నారు ?" అన్న దామె.

"మనిద్దరికీ చుట్టరిక మేమిటని అడిగారు. ఏమీ లేదనిచెప్పాను."

కమల ఈ మాటకు సిగ్గుపడి, "ఇంకా నయం !" అన్నది. ఆమె చప్పునలేచి, అయ్యో పండును కాకితినేస్తున్నది," అన్నది. ఆమె అవతలి గదిలోకివెళ్ళి ప్లేటుతోసహా తిరిగివచ్చింది.

ఆమె కంతా చెప్పేస్తే తన మనసు ఎంతో తేలికపడుతుంది. గదా అనుకున్నా డతను.

"పండు తినరా ?'' అంటూ పళ్ళెం అతనిముందుంచింది కమల.

ఆమె చూపిన శ్రద్ధకు రమేశుడు ముగ్ధుడవుతూ, ''నువుకూడా తీసుకోవా, కమలా ?" అని అడిగాడు.



''కిందటి దీపావళికే కొంటానంటివే — తూగుడు గుర్రం. ఏదీ మరి ?!... నాన్నా ఇహ నీ మాటలు నమ్మేది లేదు — ఛల్ ఛల్...... ఛలో !''

"మీరు ముందు తీసుకోండి.'' ఆమె హిందూపత్నీధర్మం పాటించి ఆ మాట అన్నది. భర్త తినటం పూర్తి అయాకనే భార్య తినాలి. ఇది స్వల్ప విషయమే అయినా, ఆమె అమాయకత్వం చూసి రమేశుడి కళ్ళనీరు తిరిగింది. అతను తినటం మొదలు పెట్టాడు.

తన కర్తవ్యమేమిటో అతనికి తెలియలేదు. జోగేంద్రుడీపాటికి హేమనళినికి ఏం చెప్పి ఉంటాడు ? అతను చెప్పినమాటలకు ఆమె ఏమనుకుని ఉంటుంది ? తనకూ హేమనళినికీ శాశ్వతంగా ఎడబాటు కావలసిందేనా ? కమల తన భార్య అని చెప్పుకోవటం తన అవివేకమే — కాని తాను అంతకంటె చేయదగిన దేమిటి ?

"ఏమిటి విచారిస్తున్నారు ? నేను శలవుల్లో స్కూలులో ఉండ నన్నానని కోపం వచ్చిందా ? నిజం చెప్పండి,'' అన్నది కమల.

"నాకు కోపం వచ్చినమాట నిజమేగాని, అది నీమీద కాదు, నామీదే."

అతను తన నిరాశ నిస్పృహలను పక్కకునెట్టి ఆమె చదువు గురించి ప్రశ్నించాడు. కమల శలవుల్లో మొదటి సాయంకాలం భూగోళశాస్త్రంతో గడిచిపోయింది.

## 7

జోగేంద్రుడూ, అక్షయుడూ తిరిగి రాగానే అన్నదబాబు, "రమేశుడు కనిపించాడా ?'' అని ఆత్రంగా అడిగాడు.

''ఆహా. కనిపించాడు. అతన్ని ఇంటిదగ్గిరే పట్టుకున్నాం. అతని భార్యనుకూడా చూశాం," అన్నాడు జోగేంద్రుడు.

"భార్యేమిటి? నాకేమీ అర్థం కావటంలేదు," అన్నాడు అన్నద బాబు నిర్ఘాంతపోయి.

''రమేశుడి భార్య! అప్పుడింటికి వెళ్ళి అతను పెళ్ళి చేసుకున్నాడు.'' అన్నాడు జోగేంద్రుడు.

"అతనితండ్రి పోవడంతో అదేమీ జరగలేదనుకున్నానే.'' అన్నాడు అన్నదబాబు, నెత్తిన చెయ్యి పెట్టుకుని.

"తండ్రి జలగండానికి ముందే పెళ్ళి జరిగింది."

"అలా అయితే అతను మన హేమను పెళ్ళాడలేదు," అన్నాడు అన్నదబాబు.

''అందుకని మా ఉద్దేశమేమంటే..." అని జోగేంద్రుడు ప్రారంభించాడు.

"మీరేం చెప్పి ఏంలాభం? పై ఆదివారం పెళ్ళి జరగటానికి ప్రయత్నాలన్నీ పూర్తి అయాయి. ఇప్పుడు, పెళ్ళి మానేసుకున్నామని అందరికీ రాయాలికాబోలు."

''ఎందుకు మానెయ్యటం? కార్యక్రమంలో ఒక చిన్నమార్పు చేసేసి అనుకున్న రోజుకు పెళ్ళి జరిపింతాం!" అన్నాడు జోగేంద్రుడు అక్షయుడికేసి చూస్తూ.

"మార్పా? ఏంమార్పు చేస్తావు?" అన్నా డన్నదబాబు అయోమయంగా.

"తెలియటంలేదూ? పెళ్ళికొడుకును మార్చేసి అనుకున్న రోజుకే పెళ్ళి జరిపిస్తాం. లేకుంటే నలుగురిలో తలెత్తుకు తిరగగలమా?"

అక్షయుడు నమ్రంగా నేలకేసి చూస్తున్నాడు.

''ఈ కాస్త వ్యవధిలో మనకు మరొక వరుడెక్కడ దొరుకుతాడు ?" అని ముసలాయన అడిగాడు.

"అదంతా నాకు వదిలెయ్యి !''

"అయినా హేమనళిని ఒప్పుకోవాలిగా ?''

"రమేశుడు చేసినపని వింటే హేమ తప్పక ఒప్పుకుంటుంది," అన్నాడు జోగేంద్రుడు.

అన్న దబాబొక నిట్టూర్పువిడిచి, ''ఎలాచేస్తే మంచిదనితోస్తే అలాచెయ్యి. కాని ఇలా కావటం అన్యాయం. రమేశుడు సంపన్నుడు, తెలివి తేటలుగలవాడు, బాగా చదువుకున్నవాడు. పెళ్ళి అయాక ఇటావాలో అతను ప్రాక్టీసుపెట్టేటట్టు నిన్ననే అనుకున్నాం - ఇంతలోనే ఎలా జరిగిపోయిందో చూడు !'' అన్నాడు.

"పోనీ, నాన్నా. నువ్వింక విచారించి లాభంలేదు. కావలిస్తే రమేశుణ్ణి ఇటావా పోనీ. హేమను పిలుచుకొస్తాను, వ్యవధిలేదు." అంటూ జోగేంద్రుడు వెళ్ళి తన చెల్లెలితోసహా తిరిగి వచ్చాడు, అయుక్షుడు మూలనున్న పుస్తకాల అలమారుచాటున నక్కాడు.

"కూర్చో హేమా, నీతో మాట్లాడాలి,'' అన్నాడు జోగేంద్రుడు చాలా సౌమ్యంగా.

హేమనళిని మౌనంగా కూర్చుని, అతవికేసి చూసింది.

"ఇటీవల రమేశుడి ప్రవర్తన నీకేమైనా అనుమానాస్పదంగా తోచిందా ? " అని అతనడిగాడు.

హేమనళిని తల అడ్డంగా తిప్పింది.

"అతను పెళ్ళిని ఒకవారం వాయిదా వేసిందెందుకో తెలుసా'"

"ఏదో కారణం ఉండి ఉంటుంది," అన్నదామె తల ఎత్తకుండానే.

హేమనళినికి రమేశుడి పైగల నమ్మకంచూసి జోగేంద్రుడికి చిరాకు కలిగింది. అతను కుండపగలేసి ఉన్నమాట చెప్ప నిశ్చయించాడు.

"రమేశుడు తండ్రితోకలిసి వెళ్ళిపోవటం జ్ఞాపకం ఉందికదూ ? ఎంతకాలమూ అతనినుంచి ఉత్తరాలు రాలేదని మనం ఆశ్చర్యపడ్డాం కూడా. కాని అతను తిరిగివచ్చాక వెనకటి ధోరణిలోనే నువ్వతన్ని ఆహ్వానించావు - అతనంతకాలం ఏమయాడా అని నీకు అనిపించలేదా ?"

హేమనళిని మాట్లాడలేదు.

"ఒకరిని శంకించటం నీ స్వభావానికి పడకపోవచ్చు. అయినా నేనిప్పుడు చెప్పబోయేది నమ్మగలవనుకుంటాను, రమేశుడికొక భార్య ఉన్నదనీ, ఆమె ఒకస్కూలులోనే బసచేసి చదువుతున్నదనీ నేను తెలుసుకున్నాను. ఇవాళే స్కూలు మూశారు. ఆమె దర్జీపారాలో ఉన్న అతని ఇంటికి తిరిగి వచ్చేసింది. నేనక్కడికి వెళ్ళి స్వయంగా కమలను చూశాను. ఆమె ఆపిల్ కోస్తున్నది, రమేశుడామె ఎదురుగా కూర్చుని ముక్క లందుకుంటున్నాడు. ఇదంతా ఏమిటని రమేశుణ్ణి అడిగాను. అతను నాకేమీ చెప్పననేశాడు. అలాటివాణ్ణి ఎలా నమ్మటమని అడుగుతున్నాను."

జోగేంద్రుడు చెల్లెలి సమాధానం కోసం ఆమె ముఖంలోకి చూశాడు. ఆమె ఒక్కసారిగా పాలిపోయి, తాను కూర్చున్న కుర్చీ చేతులు గట్టిగా పట్టుకున్నది. మరుక్షణం ఆమె తల ముందుకు వాలిపోయింది, ఆమె స్పృహతప్పి నేలపైన ఒరిగిపోయింది.

ఇదంతా చూసి అన్నదబాబు చెందిన ఆందోళన వర్ణనాతీతం. ఆయనే నేలమీద మోకరించి కూర్చుని, హేమనళినితల తన రొమ్ముకానించి పట్టుకుని, "ఇదేమిటి, తల్లీ ? వాళ్ళ మాటలు నమ్మక, అన్నీ వట్టి అబద్ధాలు !" అన్నాడు.

జోగేంద్రు డామెనెత్తి సోఫాపైన పడుకోబెట్టి, ఆమె ముఖంపైన నీరు చిలకరించాడు. అక్షయుడు చిన్న విసనకర్రతో ఆమెకు విసర నారంభించాడు.

హేమనళిని కళ్ళుతెరిచి, లేచి కూర్చుంటూ గట్టిగా, "నాన్నా, నాన్నా, అక్షయబాబును వెళ్ళిపొమ్మను," అని అరిచింది.

అక్షయుడు విసనకర్ర పెట్టేసి గదినుంచి వెళ్ళిపోయాడు.

హేమనళిని కన్నీరు కార్చుతూ తన తల్లిదండ్రికి చేరబెట్టింది. "దిగులుపడకమ్మా, రమేశుడు మనని ఒక్కనాటికి వంచించడు, జోగేన్ ఏదో పొరపాటుపడి ఉంటాడు," అని ఆయన చిన్నగా అన్నాడు.

"ఆమెకు లేనిపోని ఆశలుపెట్టకు నాన్నా. చివరకు అందువల్ల మరింత చేటవుతుంది," అన్నాడు జోగేంద్రుడు.

హేమనళిని లేచికూర్చుని, "అతనినోట వింటేగాని నే నేమాట నమ్మను," అనేసింది. ఆమెను తండ్రి పైకి తీసుకుపోయి పడుకో బెట్టాడు. తనను కొంతసేపు ఒంటరిగా వదిలెయ్యమని ఆమె తండ్రిని కోరింది.

## 8

రమేశుడు కమలను తన స్వగ్రామం తీసుకుపోదామని రాత్రి బండి పట్టుకున్నాడు. అత నామెకోసం రైలుపెట్టెలో కింద "బర్తు" తయారుచేసి. "నీకు నిద్రవేళ మించిపోయింది. నిద్రపో" అన్నాడు.

రైలు కదిలే సమయంలో రమేశుడికి ప్లాట్‌ఫాం మీద పరిగెత్తి వచ్చి, అక్షయుడు వెనక పెట్టెలో ఎక్కటం కనబడింది. అక్షయుడికి దూర ప్రాంతాల్లో ఎవరూ లేరు; అతని బంధువులందరూ కలకత్తా వాసులే. ఈ రైలే పట్టుకోవటాని కతనెందుకంత ఆత్రపడి ఉంటాడు? చూడగా, అక్షయుడు తననూ, కమలనూ వెన్నాడి వస్తున్నట్టు రమేశుడికి తోచింది. అతను తన గ్రామానికి వచ్చి తన విషయాలన్నీ ఆరాతీస్తాడేమో. అది రమేశుడి కేమాత్రమూ ఇష్టంలేదు. అక్షయుడు మధ్య స్టేషనులో దేనిలోనైనా దిగిపోతాడేమో నని రమేశుడు చూశాడు. కాని ఆలాంటిదేమీ జరగలేదు. చివరకు రమేశుడు చాలా పొద్దుపోయి నిద్రకు పడ్డాడు.

తెల్లవారుజామున రైలు గోయాలంద స్టేషను చేరింది. తూర్పు బెంగాలుకు వెళ్ళే నదీ ప్రయాణీకులు దిగవలసిన స్టేష నదే. రైలువచ్చిన సందడిలో అక్షయుడు తలకొక శాలువా చుట్టుకుని స్టీమర్ల రేవుకేసి గబగబా పోతూండటం రమేశుడు చూశాడు.

రమేశుడి గ్రామానికి వెళ్ళే బోటు బయలుదేరటానికింకా కొన్ని గంటలు వ్యవధి ఉన్నది. అయితే రేవులో మరొకబోటు వెంటనే బయలుదేరటానికి సిద్ధంగా ఉండి కూత వేస్తున్నది.

"ఇ దెక్కడిదాకా పోతుంది?" అని రమేశు డడిగితే, నదిలో తగినంత నీరుంటే కాశీదాకా పోతుందని చెప్పారు. రమేశుడు కమలని స్టీమరులో కెక్కించి, ఒడ్డుకు తిరిగివెళ్ళి, బియ్యమూ, పప్పూ, పాలూ, అరటిపళ్లూ తెచ్చాడు. అతను తిరిగివచ్చిన కొద్దిసేపటికే స్టీమరు కదిలింది.

ఈ లోపుగా అక్షయుడు రమేశుడి గ్రామానికివెళ్లే స్టీమరు గురించి విచారించాడు. రమేశుడూ, కమలా భోజనానికి ఏదో హోటలుకు వెళ్ళి ఉంటారని అత ననుకున్నాడు. తరవాత చాలాసేపటికి ఆ బోటు కూత వేసింది. రమేశుడింకా రాలేదు.

తీరా బోటు కదిలేసరికి అక్షయుడు, "నేను దిగిపోవాలి!" అని కేకపెట్టి, బయటికి దూకేశాడు. ఒడ్డునకూడా కమలా రమేశుల



"హుఁ...హుఁ...నువ్వే నువ్వు పశువ్వే!......"

"అందుకే మా నాన్న నా పెళ్ళి గురించి తొందరపడేవాడు కాదు, తగిన సంబంధం దానంతటదే కుదరాలి అనేవాడు!..."

జాడలేదు. అక్షయుడు చూస్తుండగానే కలకత్తా రైలుకూడా బయలుదేరి వెళ్ళిపోయింది.

"ఇక రమేశుడు చిక్కడు, తప్పించుకుపోయాడు. వాళ్ళు కలకత్తాలాటి మహానగరంలో దాగితే పట్టటం సాధ్యమా?" అనుకున్నా డక్షయుడు.

రమేశుడెక్కిన బోటులో అతనూ, కమలాతప్ప పెద్ద తరగతుల ప్రయాణీకులు లేరు. అతను తమ సామాన్లు ఒక గదిలో పెట్టించాడు. నదీ ప్రవాహాన్నీ, నదివెంబడి కదిలే దృశ్యాలనూ తిలకిస్తూ కమల గదిగుమ్మం వద్ద కూర్చున్నది.

"మన మెక్కడికి పోతున్నామో తెలుసునా, కమలా?" అని రమేశు డడిగాడు.

"ఇంటికి,"

"కాదు. అక్కడికి వెళ్ళటం నీ కిష్టంలేదు. అందుచేత మనం వెళ్ళటం లేదు."

"నాకోసం మానేశారా?"

రమేశుడు చిన్నగా నవ్వుతూ, "అవును, అందుకే మానేశాను. అయితే నాక్కూడా ఇంటి కెళ్ళాలని లేదు," అన్నాడు.

"అయితే ఎక్కడికి పోతున్నాం?"

"పడమట పోతున్నాం."

కమల ఈ మాటవిని కళ్ళు పెద్దవిచేసింది. ఇంటిపట్టు వదలని వారికి "పడమట" అనగానే విచిత్ర స్థలాలూ, పవిత్ర స్థలాలూ, దేవాలయాలూ, ప్రాచీనరాజుల వైభవాలూ, ప్రాచీన పురాణాలూ, వీరగాథలూ స్ఫురిస్తాయి.

కమల ఆనందంతో చలించిపోతూ, "మనం ఏయే స్థలాలకు పోతాం?" అని అడిగింది.

"ఇంకా ఏమీ అనుకోలేదు. మనకు పాట్నా, దినాపూర్, ఘాజీపూర్, కాశీలు తగులుతాయి—వాటిలో ఎక్కడో ఒక చోట దిగిపోదాం. ఈ లోపుగా మన తిండిమాటేమిటి ?'' అన్నాడు రమేశుడు.

"నేను వంటచేస్తానుగా!'' అన్నది కమల.

"నీకు వంట వచ్చునా ?" అని రమేశు డడిగాడు.

కమల గట్టిగానవ్వి, "నన్నుగురించి ఏమి టనుకుంటున్నారు?'' నాకు వంట వచ్చునా? మా మేనమామగారింట వంటంతా నేనేగా చేసింది." అన్నది.

రమేశుడు క్షమాపణ పూర్వకంగా, "నే నామాట అడిగి ఉండ కూడదు అయితే ఏదన్నా వండుకుందామా?" అన్నాడు.

అతనువెళ్ళి ఎక్కడినుంచో ఒక ఇనపకుంపటి అరువుతెచ్చాడు. కమలకు సహాయంగా ఉండటానికి ఉమేశుడనే కుర్రవాణ్ణికూడా మాట్లాడాడు. కాశీ ప్రయాణపు ఖర్చు భరించి, రోజుకు కొంచెం డబ్బులిస్తే పనిచేస్తానన్నాడు ఉమేశుడు.

''పొద్దుటి భోజనానికి వంటకాలేమిటి, కమలా?" అని రమేశు డడిగాడు.

''పప్పూ, బియ్యమూ మాత్రమే తెస్తిరి. ఏం చెయ్యగలను ? ఈ పూటకు పులగం తిందాం."

ఆమె రమేశుణ్ణి పంపించి మూడోతరగతి ప్రయాణీకులవద్దనుంచి మసాలాదినుసులు తెప్పించింది. వాటిని దంచటాని కల్వమూ, రాయికూడా తెప్పించింది. ఉత్త మసాలాదినుసులు తెచ్చినందు కతన్నిచూసి నవ్వుకున్నది.

రమేశుడు స్నానంచేసి వచ్చేసరికి వంటఅయితే తయారయింది గాని, భోజనం చెయ్యటానికి పళ్లాలు లేకపోవటం సమస్యఅయింది. మహమ్మదీయ ప్రయాణీకులనుంచి పింగాణీ పళ్ళాలు అరువు తెస్తానన్నాడు రమేశుడు. అలాటి పనిచేస్తే హిందూమతం మంటకలిసి పోతుందని కమల అడ్డుచెప్పింది.

ఆమె వంటపాత్రపైన పెట్టే మూతను తను కడిగి శుభ్రంచేసి రమేశుడికిచ్చి. "ఇప్పటి కిందులో తినండి. తరవాతసంగతి చూసుకుందాం.'' అన్నది.

రమేశుడు నీళ్ళు తెచ్చుకుని, కాస్త చోటు శుద్ధిచేసుకుని భోజనానికి కూర్చునాడు. అతను పులగం (కిచిడీ) కొంచెం నోట పెట్టుకుని, "అరె, నీ వంట ఎంత బాగుంది!" అన్నాడు.

కమల సిగ్గుపడుతూ, "చాలు వేళాకోళం!" అన్నది.

"వేళాకోళం కాదు. నువు తినేటప్పుడు నీకే తెలుస్తుంది".

రమేశుడు వడ్డించినదంతా తినేసి మారువడ్డన కోరాడు. కమల అతనికి రెండో మారు కాస్త జాస్తిగా వడ్డించింది.

"ఉండుండు! నీ కేమన్నా మిగిలిందా లేదా?"

''కావలిసినంత ఉంది." అన్నది కమల. అతను తన వంట మెచ్చుకోవటం ఎంతో ఆనందమయింది.

"నువ్వెందులో తినబోతున్నావు?"

"ఆ మూతలోనే" అన్న దామె, భార్య భర్త పళ్ళెంలోనే భోజనం చెయటం సర్వసాధారణ విషయంగా భావించి.

"ఛీ! ఛీ! అలా చెయ్యగూడదు." అన్నాడు రమేశు డాందోళనగా.

"అలాగే చేస్తాను. నీ మాటేమిటి, ఉమేశ్?" అన్నది కమల.

"కింది భాగంలో ఒకతను మిఠాయి అమ్ముతున్నాడు. అతని దగ్గిర మద్దిఆకులు తెచ్చి, వాటిలో తింటాను." అన్నాడు ఉమేశుడు.

"నువ్వా మూతలోనే తింటాననేట్టుంటే దాన్ని నాకియ్యి, కడిగి తెస్తాను." అన్నాడు రమేశుడు.

"కాస్తదాని కెందుకంత గలభా చేస్తున్నారు ?'

అతనికి భోజనానంతరం చుట్ట ఇవ్వటానికి ఆకులు లేవని జ్ఞాపకం వచ్చి ఆమె, "ఆకులు తెచ్చారు కారు." అన్నది.

"కింద ఎవడో కిల్లీ లమ్ముతున్నాడు." అంటూ రమేశుడు ఉమేశుణ్ణి పంపాడు.

ఆరోజు సాయంకాలంవేళ బోటు ఇసుకలో కూరుకుపోయింది. కమల ఉమేశుణ్ణి ఒడ్డుకుపంపి పూరీలు తెప్పించింది. రాత్రి భోజనాని కవి పనికివచ్చాయి. ఎవరో తననిలా కనిపెట్టి ఉండటం రమేశుడికి సంతోషంగా ఉన్నదేగాని, తాము భార్యాభర్తలకున్న ఆలోచన ఆమె మెదడులో లేకుండాచెయ్యట మెలాగ అని అతను మధనపడ్డాడు.

కమల స్కూలులో చదివేటప్పు డామెపై ఖర్చు నిమిత్తం ఇచ్చిన డబ్బులో మిగిలినదంతా పడవ ప్రయాణంలో ఖర్చయి పోగానే ఆమె ఉమేశుడితో, ''వెచ్చాలకు నా దగ్గిర డబ్బేమీలేదని మీ బాబుగారితో చెప్పు." అన్నది.

ఉమేశుడు బిడియస్తుడు, కాని తెలివిగలవాడు. రమేశుడు భోజనం చేస్తుండగా, అతను వినేలాగా వాడు, "రేపు వెచ్చాలు కొనటానికి డబ్బులమ్మా ?" అన్నాడు.

డబ్బు వెచ్చిస్తేగాని కడుపునిండదన్న సంగతి రమేశుడికి చప్పున తెలిసివచ్చింది. ''అవునవును. కమలా, నీ దగ్గిర డబ్బు లేదుకదూ?" భోజనంచేసి అతను కమలకొక డబ్బులపెట్టె ఇచ్చాడు. ఇప్పుడు కమలకు ఇంటిపెత్తనం వచ్చినట్టు అతనికి తోచింది.

తరవాత అతను స్టీమరుఅడ్డకమ్మీచెంత కూర్చుని, తనకూ హేమనళినికీ కలిగిన ఎడబాటుగురించి చింతించాడు. ఆమెకూడా వెంటఉంటే పరిస్థితి ఎంత తేలికగ పడేది! ఎలాగైనా కమలకు వాస్తవం చెప్పితీరాలని అత ననుకున్నాడు.

అతని వెనకగా కూర్చుని ఉమేశుడు తన యజమానురాలికి తన సంగతంతా చెబుతున్నాడు. వాడు సవతితల్లిపెట్టే బాధలు

సహించలేక ఇంటినుంచి పారిపోయి వచ్చాడు. అతనితల్లి తాలూకు బంధువులు కాశీలో ఉంటున్నారు. వారిని చేరుకోవాలని వాడిఉద్దేశం. తన యజమానురాలు కాశీకే వెళుతున్నదని వా డనుకున్నాడు.

"మీరు నన్ను వెంట ఉండనిచ్చారంటే అన్నిపనులు చేస్తా నమ్మా," అంటున్నాడు వాడు.

వాడు తనను 'అమ్మా' అని పిలవటంతో కమలలో మాతృ వాత్సల్యం పొంగింది. "సరేలేరా, ఉమేశ్. మావెంటరా," అన్నదామె.

నక్షత్రాల ఆకాశంకింద కూర్చుని, ప్రశాంతంగా ఉన్న నదిని గమనిస్తూ, తాను కమలనో, హేమనళినో వదులుకోక తప్పదని తెలుసుకున్నాడు. కమల బాధ్యత తనపై ఉన్నది. హేమనళినికేం? స్వతంత్రురాలు, ఎవరిని కోరుకుంటే వారిని పెళ్ళాడగలదు; కాని కమల నీ స్థితిలో వదిలెయ్యటం సాధ్యంకాదు.

తలుపుపైన తాళపుచెవులగుత్తి కొట్టిన చప్పుడై అతనువెనక్కు తిరిగిచూస్తే గదినుంచి బయటికివస్తూ కమల కనిపించింది.

"నన్ను పిలిచే పద్ధతి అదన్నమాటా?" అన్నాడు రమేశుడు.

"నాకింకో దారి కనిపించలేదు," అన్నది కమల.


"నాతో ఏమైనా పని పడితే 'రమేశ్‌బాబు' అని కేకపెట్టరాదూ?"

చీకట్లో కమల చెక్కిళ్ళు ఎర్రబడాయి. హిందూ సతీమణి తన భర్తను పేరు పెట్టి పిలవటమే?

"మీ రనేది నాకేమీ అర్థంకాలేదు." అన్నదామె.

రమేశు డామెను తన చెంత కూర్చోబెట్టుకుని ఒక కథ చెప్పాడు. మద్రదేశపు రాజైన రణజితసింహుడు కాంచీనగర రాజకుమార్తె చంద్రకళ అపురూపసుందరి అని విని, ఆమెను తనకిచ్చి చెయ్యమని దూతలద్వారా కబురు చేశాడు. అందుకు కాంచీనగర రాజు ఒప్పుకున్నాడు. రణజిత సింహుడు తనవంశాచార ప్రకారం తన పరివారాన్నీ, కత్తినీ ఇచ్చి కాంచీపురానికి పంపాడు. వివాహం శాస్త్రోక్తంగా జరిగింది. మద్రదేశంవారు వధువును వెంటబెట్టుకుని మద్రదేశానికి బయలు దేరారు. అది నెలరోజుల ప్రయాణం. ఒకనాటి మజిలీలో మద్రదేశీయులకు మరొక పెళ్ళి జట్టు వచ్చి కలిసింది. వారుకూడా కత్తిని పెళ్ళాడిన వధువుతోనే ప్రయాణిస్తున్నారు. అయితే ఆ పెళ్ళికొడుకు చైతసింహుడనే చిన్న జాగీరుదారు. చైతసింహుడి పరివారం మద్రపరివారం యొక్క రక్షణ కోరి, వారి అనుమతితో వారి వెంట ప్రయాణం సాగించారు.

ఒక అమావాస్య రాత్రి ఉభయ పరివారాలూ దేరాలువేసి విడిసి ఉన్న సమయంలో దొంగలు వారిపైనపడి దోచుకుని, కొన్ని దేరాలకు నిప్పుపెట్టి, తమను ప్రతిఘటించిన వారిని కత్తికి బలిచేసి, నానా బీభత్సమూ చేశారు.




"వీడికి గుడ్డండి; నాకు బొమ్మ చెవుడండి! అంచేత ఇద్దరికీ కలిపి ఒక టిక్కట్టు తీసుకున్నామండి!"

"ఏడిశారు! నీకు మాత్రం బొమ్మ కనిపిస్తాదా?, వాడికి మాత్రం వినపడతదా ఏంటి? మా హాల్లో సంగతి మీకు తెలీదల్లే ఉంది, పోండి చెరో టిక్కట్ పట్రండి!"

---

ఈ బీభత్సం ఆరంభమైన వెంటనే చంద్రకళ తన గుడారం నుంచి వెలుపలికి వచ్చి, కొందరు సైనికులు పారిపోతూండటం గమనించి, వారు తన భర్త పరివారమే అనుకుని వారితో చేరింది. మద్రదేశీయులు దొంగల బెడద ఎలాగో వదిలించుకుని వధువు కోసం ఎంత వెతికినా ఆమె జాడలేకపోయింది.

చైతసింహుడి మనుషులు చంద్రకళను తమ కళింగదేశానికి తీసుకుపోయి, అతని ముందుంచి "ఇదుగో మీ వధువు!" అన్నారు. అంతటి అపూర్వ సుందరి తన భార్య అయినందుకు చైతసింహుడూ, అతని తల్లీ, ఇతర స్త్రీలూ ఎంతో సంతోషం చెందారు. ఆమెకూడా, తన భర్తపేరు విని ఉండనందున, చైతసింహుడే తన భర్త అనుకుని అతనికి భార్యగా ఉండిపోవ నిశ్చయించుకున్నది. ఇంతలో చైతసింహుడికి చంద్రకళ తన భార్య కాదనీ, మరొకరి భార్య అనీ తెలిసిపోయింది—

కథ ఇంతదాకా విని కమల, "తరవాత ఏం జరిగింది?" అని అడిగింది.

"అది నాకూ తెలీదు. నాకు తెలిసిన కథ ఇంతవరకే," అన్నాడు రమేశుడు.

కథ పూర్తిగా చెప్పితీరాలని కమల పట్టుపట్టింది.

"నేను దీన్ని ఏదోపుస్తకంలో చదివాను. అందులో పైకథలేదు. దాన్ని ఎప్పుడు ప్రకటిస్తారో నాకుమాత్రం ఏంతెలుసు? తనభార్య కాదని తెలుసుకున్న తరవాత చైతసింహుడు చంద్రకళతో ఎలా ప్రవర్తించాలంటావు?" అన్నాడు రమేశుడు.

కమల కొంచెంసేపు ఆలోచించి, "ఏమో నాకు తెలీదు," అన్నది.

"మాటవరసకు నేనే చైతసింహుణ్ణి, నువే చంద్రకళవూ అనుకో!"

"ఇటువంటి మాట లెన్నడూ అనకండి. నాకు కొంచెంకూడా బాగుండదు,'' అంటూ కమల కోపంతో లేచివెళ్ళిపోయి ఉమేశుడిచేత దయ్యాలకథలు చెప్పించుకుని విన్నది.

రమేశుడు చాలా సేపు తన ఆలోచనలలోనే ఉండిపోయి తలఎత్తి చూసేసరికి కమల అతనిఎదట నిలబడిఉన్నది. ''ఏమిటి కమలా? నువ్వింకా నిద్రపోలేదా? చాలా పొద్దుపోయిందే!" అన్నాడు.

"మీరు నిద్రపోరా?" అన్నది కమల.

"ఇదుగో నా గదిలోకి పోతున్నాను. నువ్వు వెళ్ళి పడుకో. నీకేమీ భయంలేదులే. మన గదుల మధ్య తలుపు తెరిచే ఉంచుతాను."

"నాకెందుకు భయం?''

రమేశుడు తన గదిలోకివెళ్ళి పడుకుని దీపం ఆర్పేశాడు. అతను హేమనళిని పై ఆశ వదిలేసుకోవటానికి నిశ్చయించుకున్నాడు.

## 9

కమల చాలా ఆలస్యంగా నిద్రలేచింది. ఆమె కిటికీలోనుంచి నదీతీర దృశ్యాలుచూస్తూ, ఏదో అర్థంకాని ఆవేదనకు గురి అయింది. తనకేదో లోటయినట్టుగా ఆమెకు అసంతృప్తి కలిగింది.

స్టీమరు నదీతీరంనుంచి లోతుకుపోవటం చూడటానికి పిల్లలు ఒడ్డునచేరి కోలాహలం చేస్తుంటే రమేశుడికి మెలకువ వచ్చింది. అతను కమల ఏంచేస్తున్నదో చూడటాని కామెగది దగ్గిరికివెళ్ళి, "ఇంకా ముఖం కడుక్కోలేదా, కమలా ?" అని అడిగాడు.

కమల కోపంగా ముఖం తిప్పేసుకుని, "లేదు," అంటూ, బట్టలు తీసుకుని స్నానాలగదికి వెళ్ళిపోయింది. ఆమె స్నానం చేసి వచ్చి ఒక మూటవిప్పి, అందులోఉన్న డబ్బులపెట్టెను చూసింది. ఆ పెట్టె తనచేతికి నిన్న వచ్చినప్పుడు తనకొక కొత్తపదవి లభించినట్టు సంతోషించిన కమలకిప్పుడు ఆ పెట్టెను తన వద్ద ఉంచుకునే అధికారం తనకు లేదనిపించింది. ఆమె దాన్ని తీసుకుపోయి రమేశునికిచ్చి, ''మీరే ఉంచుకోండి,'' అన్నది.

"నే నేం చేసుకోను ?" అన్నాడతను.

"అవసరమైన వస్తువులు తెప్పించి వాటిని నాకిస్తే చాలు."

"నే నా కథ పూర్తిగా చెప్పలేదని నీకు కోపం వచ్చింది."

''మీ వస్తువు మీ కివ్వటం కోపమెం దుకవుతుందీ ?''

"నీ కిచ్చాక అది నాదికాదు. ఇచ్చిన వస్తువు తీసుకుంటే బ్రహ్మరాక్షసు డౌతానేమో !''

ఈ మాటకు కమలకు నవ్వొచ్చింది. ఆమె అతనితో ఆప్యాయంగా మాట్లాడసాగింది.

స్టీమరు నదీతీరంనుంచి కొద్దిదూరం ఎడంగా వెళ్ళే సమయానికి ఉమేశుడు ఒడ్డున ప్రత్యక్షమై, స్టీమరు ఆపమని కేకలు పెడుతూ చెయ్యెత్తాడు. స్టీమరువాళ్ళు వినిపించుకోలేదు. వాడు రమేశుణ్ణి కేక పెట్టాడు. రమేశుడు స్టీమరు నావికుడి చెయ్యి తడిచేసిన మీదట స్టీమరు ఆగి ఉమేశుణ్ణి ఎక్కించుకున్నది.

రమేశుడిచేత తిట్లుతింటూ వాడు తన నెత్తిమీదఉన్న బుట్ట కమల ముందుంచి, నవ్వసాగాడు. ''పైగా నవ్వుతావేం? స్టీమరందకపోతే ఏమయేది?" అని కమల అన్నది. ఉమేశుడామాట కూడా పట్టించుకోక ఉన్న అరటికాయలూ, వంకాయిలూ మొదలైన కూరలు తీసి కిందపెట్టాడు.

"ఇవన్నీ ఎక్కడివి?" అని కమల అడిగింది.

నిన్న సాయంకాలం వాడు పెరుగుకోసం ఊళ్ళోకి వెళ్ళినప్పుడు దారిలో తోటల్లో ఈ కూరలు కనిపించాయి. స్టీమరింకా ఒడ్డున ఉండగానే ఈ ఉదయం వాడాతోటలకు వెళ్ళి ఈ కూరలు తెచ్చాడు.

''దొంగిలించి తెచ్చావురా?" అన్నాడు రమేశుడు కోపంగా.

''ఇందులో దొంగతన మేముంది ? ఆ తోటలనిండా ఎన్నో కూరలున్నాయి. ఈ కాసినితెస్తే వాళ్ళకేమీ నష్టంరాదు," అన్నాడు ఉమేశుడు.

వాటిని తన ఎదటనుంచి తీసుకుపొమ్మనీ, లేకపోతే నదిలో పారేస్తాననీ రమేశుడా కుర్రవెధవమీద ఎగిరిపడ్డాడు, వాణ్ణి చేరనియ్యవద్దని కమలతో అన్నాడు.

ఉమేశుడు కూరలన్నిటినీ బుట్టలోకిఎత్తి తీసుకుపోయి వంట చేసేచోట ఉంచాడు. కమలవెళ్ళి వాటిని తిరిగి వందేసింది. ఆమె కూడా వాణ్ణి దొంగతనం చేశాడని కోప్పడింది గాని వాడిపైగల వాత్సల్యం పోలేదు.

"ఉమేశ్, పాలుతేకపోతే బాబుగారికి అన్నం అమరటం లేదు," అన్న దామె.

"డబ్బులేందే పాలు రావే!" అన్నాడు ఉమేశుడు.

"నీ కేమైనా మతిపోయిందా ఏమిటి ? డబ్బు ల్లేకుండా నిన్నే వస్తువైనా తెమ్మన్నానా ?" అన్నది కమల.

కమల రమేశుణ్ణి డబ్బడగదని వాడి నమ్మకం. డబ్బు ల్లేకపోయినా కూరలు దొరుకుతాయి గాని, పాలు దొరకవే అని వాడి భయం. "అమ్మా, బాబుగారి నడిగి నాలుగైదణాలు తీసుకుని నా కిచ్చారంటే నేను పాలు తెస్తాను," అన్నాడు.

స్టీమరు దిగువభాగంలో ఆవుపాలు దొరుకుతాయని తెలిసి కమల ఉమేశుడి చేతిలో రూపాయి ఇచ్చింది. వాడా రూపాయి ఇచ్చేసి నాలుగు సేర్ల పాలు తెచ్చాడు.

ఆ మధ్యాహ్నం భోజనం దివ్యంగా ఉన్నది. రమేశుడు భోజనమయాక, ఉమేశుడికి పెట్టి, ఆ తరవాత తాను తిన్నది. ఆమెకు పగలంతా సరదాగా గడిచింది. పొద్దున లేచినప్పు డుండిన కలత యావత్తూ తుడిచిపెట్టుకుపోయింది.

అస్తమయ మయేసరికి స్టీమరు మరొక రేవు చేరింది. నదికి రెండు పక్కలా పచ్చని పైరు లున్నాయి. పొలాల మధ్యగా కాలి




"ఎత్తు, ఛాతీ, ఇంకా అపాదమస్తకం ఎన్నో కొలతలు తీసి తగినట్టుగా ఉందీ లేందీ బాగాచూసి మరీ చిత్రాలకి పాత్రధారుల్ని బుక్ చేసుకుంటాం........."

"అలాంటివన్నీ చేసి మేము విలువైన కాలాన్ని వృధాగా తగలెయ్యం! ఏకంగా తూకం వేస్తాము; బరువు బాగా ఉంటే వెంటనే బుక్ చేశేస్తాం!"

---

బాట లున్నాయి. స్త్రీలు ఆ బాటలవెంబడి వచ్చి నీరు తీసుకు పోతున్నారు.

మధ్యాహ్నం చేసిన కూరలున్నాయి, రాత్రి వంట తేలికగా చెయ్యవచ్చు ననుకున్నది కమల. కాని రమేశుడు, మధ్యాహ్నం జాస్తిగా తిన్నా ననీ, తనకు రాత్రికి భోజనం వద్దనీ పాలుకూడా తాగననీ చెప్పేశాడు. కమల కూడా భోజనం మానేసి, మిగిలి పోయిన కూరలన్నీ ఉమేశుకి ముందు పెట్టి తినమన్నది.

"మీ రేమీ ఉంచుకోరా?" అన్నాడు ఉమేశుడు.

"నా భోజనం అయింది," అన్నది కమల.

రాత్రి అయింది. వెన్నెల కాస్తున్నది. నది ఒడ్డున ఒక గుడిసె ఉన్నది. అది పడవల ఆఫీసు, అందులో బక్క చిక్కిన వృద్ధు డొకడు కూర్చుని ఏదో రాసుకుంటున్నాడు. ఆయన్ని స్టీమరులో నుంచి చూసి రమేశుడు తన కలాటి ఉద్యోగం ఉన్నా జీవితం సుఖంగా ఉండు ననుకున్నాడు. అతను చూస్తుండగానే ఆ వృద్ధుడు దీపం ఆర్పేసి, గుడిసెకు తాళం వేసి, నెత్తిన మంచు పడకుండా బట్టకప్పుకుని పొలాల మధ్యగా వెళ్ళే ఒక కాలి బాట పట్టుకుని ఇంటికి వెళ్ళి పోయాడు.

చీకటి పడ్డాక రమేశుడు వచ్చి తనతో కబుర్లు చెబుతాడను కున్నది కమల. ఆమె పనులన్నీ ముగిసినా అతను రాలేదు. ఆమె గదిలో నుంచి బయటికి వచ్చి స్టీమరు ఊచల పక్కన అతను నిలబడి ఉండటం చూసి అతనికి కొంతదూరాన వెళ్ళి నిలబడింది. అతన్ని సమీపించటం ఆమెకు సాధ్యంకాలేదు.

రమేశుడు తన గదిలోకి వెళ్ళి, ముఖాన్ని రెండు చేతులతోను మూసుకుని కుర్చీలో కూర్చున్నాడు. కమల చప్పుడు చెయ్యకుండా వెళ్ళి ద్వారం దగ్గిర నిలబడింది. ఆమె గదిలోకి తొంగిచూసి వెనక్కి వచ్చేటప్పుడు ఆమె చీరెచెంగుతగిలి గొడుగొకటి కిందపడి చప్పుడయింది. రమేశు డదిరిపడి తలఎత్తిచూసి, "ఏం, కమలా? నిద్రపోయా వనుకున్నానే? భయం వెయ్యటంలేదుగద? నే నీ గది నుంచి ఎక్కడికీ పోనులే. మధ్యతలుపు తెరిచే ఉంచుతాను" అన్నాడు.

కమల పట్టరాని కోపంతో, "నాకేమీ భయంలేదు," అంటూ చీకటికోణంలా ఉన్న తన గదిలోకివెళ్ళి, మధ్యఉండే తలుపు మూసేసింది. ప్రపంచంలో తన కెవ్వరూలేరన్న భావం ఆమెకు కలిగి జీవితం దుఃఖమయంగా తోచింది. ఆమె గదిలో ఉండలేక బయటికి వచ్చి స్టీమరు అడ్డకమ్మీల నానుకుని నిలబడింది. చంద్రు

దస్తమిస్తున్నాడు. పొలాలమధ్య కాలిబాటలు కనిపిస్తూ ఉన్నాయి. ఆ బాటవెంట వచ్చి నీళ్ళు తీసుకుపోయే ఆడవాళ్ళందరూ తమతమ ఇళ్ళకు పోతారు. తనకే ఎక్కడా ఇల్లన్నదిలేదు.

తన సమీపంలో ఎవరో ఉన్నట్టు తెలుసుకుని కమల ఉలిక్కి పడింది.

''నేను ఉమేశుణమ్మా! ఇంత పొద్దుపోయి మీరింకా మేలుకునే ఉన్నారా?''

తన యజమానురాలు ఏడుస్తున్నదని తెలుసుకున్న ఉమేశుడికి, ఆమె నెలా ఓదార్చాలో తెలియలేదు. ''మీరు నాకిచ్చిన రూపాయిలో అయిదణాలు మిగిలిందమ్మా!'' అన్నాడు వాడు.

కమలకు ఆ మాటతో ఉపశాంతి కలిగింది. ''సరే, అవి నీ వద్దనే ఉండనీ, నువువెళ్ళి పడుకో. పో,'' అన్నదామె.

తరవాత కమలకూడా పడుకుని నిద్రపోయింది.

## 10

ఆరోజుకారోజు కమల చిరాకు హెచ్చిపోతున్నది. ఆమె నిత్యకృత్యాలు చేసుకుపోతున్నదే గానీ ఆమెలో ఉల్లాస మేమీలేదు. ఒంట్లో బాగాలేదా అని రమేశు డడిగితే ఆమె తల పక్కకు విసిరి జవాబు చెప్పలేదు.

వాస్తవమంతా హేమనళినికి రాసేస్తేగాని తన భవిష్యత్తు తేల దనుకుని రమేశు డామెకొక ఉత్తరం రాశాడు. వెనకనుంచి ఎవరో, "తమ పేరేమిటి బాబూ?" అనగానే అతను అదిరిపడి తల ఎత్తిచూశాడు. ఒక మధ్య వయసు మనిషి అతని వెనక నిలబడి ఉన్నాడు.

"మీ పేరు రమేశబాబని నాకు తెలుసులెండి. అయినా అలా పేరూ, ఊరిపేరూ అడగటం మర్యాద. కావలిస్తే మీరు నా పేరూ, నా తండ్రి పేరూ, నా తాత పేరూ అడగండి, సంతోషంగా చెబు తాను," అన్నా డాయన.

రమేశుడు నవ్వి. "పరిచయానికది అనవసరమే గద. మీ నామ ధేయం చెప్పారంటే నేను చాలా సంతోషిస్తాను," అన్నాడు.

"అయ్యా, నా పేరు త్రిలోకనాథ చక్రవర్తి అంటారు. ఇటు వాయువ్యప్రాంతంలో నన్నెరగనివారు లేరు. భరతవర్షమంతటా భరతుడు చక్రవర్తిగా ఎలాగైతే ఖ్యాతి ఆర్జించాడో, అలాగే నేను వాయువ్యప్రాంతంలో కీర్తి గడించుకున్నాను. ఇంతకూ మీ ప్రయాణం ఎక్కడి దాకా?"

"ఇంకా నిశ్చయించుకోలేదు."

"మీరు చెప్పండి, మానండి—స్టీమరు పైరేవు చేరబోతున్నది."

''నేనింకా ఏమీ అనుకోలేదు. మొన్న గోయాలందలో రైలు దిగివచ్చే సరికి స్టీమరు బయలుదేరటానికి సిద్ధంగా ఉన్నది. ఎక్కడికి పోదామా అని ఆలోచించే వ్యవధిలేదు. ఎక్కేశాను.''

''అలా ఉండాలి. నేను మీకు పూర్తిగా విరుద్ధం. పిరికివాణ్ణి. ఎక్కడికి పోవాలో తేల్చుకుని, మూటా ముల్లే సర్దుకుని మరీ ఓడ ఎక్కుతాను. మీర్లు ఫలానాచోటికి వెళ్లాలనుకోకుండానే ఎక్కేశారు. అసాధారణ విషయం కాదా? మీరు సపరివారంగానే ప్రయాణి స్తున్నారా?"

రమేశుడు కాస్త సంకోచిస్తూ ఔనన్నాడు.

"క్షమించండి. మీరు సకుటుంబంగా ప్రయాణిస్తున్న సంగతి కూడా నాకు తెలుసు. మీ ఆవిడ పక్కగదిలో వంటచేస్తున్నది. నేను వంటవాసన తగిలి అలా వెళ్ళాను. 'అమ్మా, నువ్వు సాక్షాత్తూ అన్న పూర్ణాదేవివే. వంట చేసేటప్పుడుమాత్రం నన్ను పిలు, మరిచిపో వద్దు' అన్నాను. ఆమె నవ్వింది. అన్నపూర్ణ ప్రసన్నురాలయింది. గదా అనుకున్నాను. ఇప్పుడు నా మనస్సుకు తృప్తిగాఉంది. చూడండీ, ప్రతిసారీ పంచాంగంచూసి మరీ ప్రయాణమవుతూనే ఉంటాను. కాని ఈసారి కలిగిన అదృష్టం నా కదివరలో ఎన్నడూ కలగలేదు. మీరేదో పనిలో ఉన్నట్టున్నారు. మీసెలవైతే అన్న పూర్ణాదేవికి వంటసహాయం చేస్తా! నే నుండగా ఆమే పను లన్నీ చేసుకోవడం దేనికి?'' అని చక్రవర్తి వంటగదికేసి వెళ్లాడు.

ఆయన కమలతో, "అమ్మా, నువు వంట చేస్తుండు. నేనీ లోగా చింతపండు పచ్చడి చేసేస్తాను," అంటూ తనవెంటవున్నచిక్కంలోని వస్తువులనుంచి చింతపండు తీసి. "నేను పచ్చడి చాలాబాగా చేస్తాను. చెప్పటం దేనికి? నాలుకపైన వేసుకుంటే నీకే తెలు స్తుంది. వెళ్ళి స్నానంచేసిరా, వంట,పై పనంతా నేనుచూస్తా. నాకు వంట అలవాటే. ఆడవాళ్ళు ఎప్పుడూ ఏదో రోగంతో తీసుకుని మూలుగుతూంటారాయే. వాళ్ళకు చవిగా చింతపండు పచ్చడీ, మసాలా కూరలూ చేసి, చేసి, వంటలో ఆరితేరాను. నవ్వ కమ్మాయి. నేను నిజమే చెబుతున్నా.'' అన్నాడు.

"అయితే మీదగ్గిర పచ్చడి చెయ్యటం నేర్చుకుంటా,'' అన్నది కమల నవ్వుతూ.

"ఆహా! అదంతా సులువుగా దొరికే విద్యా? మూడు, నాలుగు రోజులు నాకు శుశ్రూష చెయ్యాలి. శుశ్రూషంటే మరేమీలేదు. నాకుకాస్త తమలపాకులు నమిలే వ్యసనం ఉన్నది – ఒరే, నీ పేరేమిట్రా అబ్బాయ్?" అన్నాడు చక్రవర్తి.

ఉమేశుడు పలకలేదు. వాడికి ముసలాయనంటే అసలే మంటగా ఉంది. ఆయన కమలతో చనువుగా ఉంటూ తనను వెనక్కు నెట్టే స్తున్నాడని వాడిదిగులు!

"వాడిపేరు ఉమేశుడు,'' అన్నది కమల.

"భేష్, బుద్ధిమంతుడల్లేనే ఉన్నాడు. మాకిద్దరికీ పొత్తు కలు స్తుంది. కూరసంగతి నేను చూస్తానుగాని, నువువెళ్ళి స్నానం చేసిరా," అన్నాడు చక్రవర్తి.

తనకెవరూ లేరనుకుని బాధపడుతున్న కమలకు ఆ భావం పోయ్యేలాగా చక్రవర్తి దొరికాడు. రమేశుడి మనస్సుకూడా కొంత తేలికపడింది.

చక్రవర్తి ఇద్దరికీ ఆత్మీయుడయాడు. వాళ్లు ఎక్కడ దిగేదీ వాళ్ళకే తెలియదు. రమేశు డాయన్ని సలహా అడిగితే ఘాజీపూరులో దిగమన్నాడు. అక్కడ గులాబిపూలనుంచి అత్తరు తీస్తారుట. "నేనుండేదీ అక్కడే," అన్నాడు చక్రవర్తి.

రమేశుడు కమలకేసిచూస్తే ఆమె సరేనన్నట్టు తల ఆడించింది.

రోజులు గడుస్తున్నాయి. ప్రతిరోజూ ఉమేశుడు ఒడ్డుకువెళ్ళి బుట్టతో కూరలు తెస్తూనే ఉన్నాడు. వాడు కూరలు దొంగిలిస్తున్నాడని రమేశుడికి అనుమానం.

"అదేమిటి? నేను వాడికి డబ్బులిచ్చి కూరలు తెప్పిస్తున్నాను." అని కమల వాణ్ణి వెనకవేసుకొచ్చింది.

"వాడు కూరలదొంగ, డబ్బుల దొంగకూడా అవుతున్నాడన్న మాట. ఏదీ డబ్బుకు లెక్కచెప్పరా!" అన్నాడు రమేశుడు.

ఉమేశుడు తడవకొక రకంగా లెక్కచెప్పాడు. వాడి లెక్క ప్రకారం చేతిలో ఉండిన డబ్బుకంటె ఖర్చెక్కువయినట్టు తేలింది!

"నాకు రెక్కలేవస్తే ఎక్కడో ఒక గుమాస్తాపని సంపాదించుకోకపోయానా?" అన్నాడు వాడు.

రమేశుడికి కుర్రాడిమీద అనుమానం జాస్తి అయినకొద్దీ కమలకు వాడిపై అభిమానం జాస్తి అయింది. ఆ విధంగా ఆమె మనోభావంలో స్వాతంత్ర్య లక్షణం ఏర్పడింది. చక్రవర్తికూడా వాణ్ణి మెచ్చుకుంటూ, "ఈ యీడువాళ్ళలో కూరలు తీసుకురాగలవాళ్ళెందరుంటారు?" అన్నాడు.

ఒకనాడు తెల్లవారుజామునే ఆకాశమంతా నల్లటి మబ్బులు కమ్మి, తీవ్రంగా గాలి వీచసాగింది. మధ్యమధ్య ధారాపాతంగా వర్షం కురుస్తున్నది. గంగపైన ఒక్క పడవకూడాలేదు. స్టీమరుమాత్రం నడుస్తున్నది.

ఆరోజు సూర్యాస్తమయం ఎప్పుడైనదీ తెలియకుండానే చీకటి పడింది. చీకటి పడకముందే స్టీమరుకు లంగరుదించారు. పగటి కన్నకూడా రాత్రి మరింత భయంకరంగా కనిపించింది. గాలికి, వానకూ మెరుపులు తోడయాయి. ఒకసారి నదిలో మునిగి బతికి బయటపడిన కమల ఈ వాతావరణంచూసి అదురుకున్నది.

ఆమె భయం గ్రహించి రమేశుడు, "వానా, తుపానూ స్టీమరునేమీ చెయ్యలేవు. నువు పడుకుని నిద్రపో. నేను పక్కగదిలోనే ఉంటాను గద," అన్నాడు.

చక్రవర్తి గదివెలుపలనుంచి, "అమ్మాయీ, నిన్నీ గాలిదేముడేమీ చెయ్యలేడు, విచారించకు," అన్నాడు.

"చక్రవర్తిగారూ, కాస్సేపు లోపలికివచ్చి కూర్చోండి," అని కమల పిలిచింది.



"మీరు పడుకునేవేళ అయిందిగద," అంటూ చక్రవర్తి గదిలోకి అడుగుపెట్టి, అటూ ఇటూ చూసి, ఆశ్చర్యంతో," రమేశ బాబు లేడే! ఈ వానలో ఎక్కడికి వెళ్ళాడూ?' అన్నాడు.

"నే నీ పక్కగదిలో ఉన్నానండీ, చక్రవర్తిగారూ!"

చక్రవర్తి రమేశుడి గదిలోకి తొంగిచూశాడు. రమేశుడు తలవైపున దీపంపెట్టుకుని పడుకుని, ఏదో పుస్తకం చదువుతున్నాడు,

"కమల భయపడుతున్నది. పుస్తకానికేం భయం? దాన్ని అవతలపెట్టి ఈ గదిలోకిరండి," అన్నాడు చక్రవర్తి.

కమల చప్పున చక్రవర్తి దగ్గిరికివచ్చి, "ఊరుకోండి. నాకేమీ భయంలేదు." అన్నది. వానమోతలో ఈ మాటలు రమేశుడికి వినిపించలేదు. అతను పుస్తకం అవతలపెట్టి కమలగదిలోకి వచ్చి, "కమల మీతో ఏమన్నా—" అని ప్రారంభించాడు.

"ఏమీలేదు. నే నింకేదో మాట్లాడాలని ఆయనని పిలిచాను," అన్నది కమల. కొంచెంసేపుండి ఆమె, "చాలా పొద్దుపోయింది. మీరువెళ్ళి పడుకోండి. ఉమేశు దేమయాడో చూడండి చాలు. వాడు భయపడతాడేమో," అన్నది.

"నాకేం భయంలేదు," అని తలుపు అవతలినుంచి సమాధానం వచ్చింది. ఉమేశుడు తన మోకాళ్ళమధ్య తలపెట్టుకుని గదిబయట కూర్చుని ఉన్నాడు. కమల బయటికివచ్చి వాణ్ణిచూసి, "ఇక్కడ వానకు తడుస్తున్నావా? వెళ్ళి చక్రవర్తిగారి గదిలోపడుకో" అన్నది.

ఆమె తనను "వెధవా!" అని తిట్టటంతో ఉమేశుడి కెక్కడ లేని ఆనందమూ కలిగింది. వాడు చక్రవర్తి వెంట వెళ్ళిపోయాక రమేశుడు, ''కమలా, కావాలంటే నీకు నిద్రవచ్చేదాకా కథ చెబుతాను,'' అన్నాడు.

''వద్దు. నాకు నిద్రవస్తున్నది,'' అన్నది కమల.

ఆమెమనస్సు అర్థంచేసుకునికూడా రమేశు డేమీచెయ్యలేక ఆమె దీనవదనంకేసి ఒక్కసారిచూసి, మెల్లిగా తనగదికి వెళ్ళిపోయాడు. కమల చాలా సేపు మనఃక్షోభంపొంది తరవాత నిద్రపోయింది.

తెల్లవారినాక రమేశుడింకా పక్కమీదినుంచి లేవకమునుపే చక్రవర్తి అతని గదిలోకివచ్చి, "రాత్రంతా మీ రీ గదిలోనే పడుకున్నారా?''అని అడిగాడు.

రమేశుడు లేచికూర్చుని, "తెల్లవార్లూ ఎంత భయంకరంగా ఉంది! నాలాగే మీరుకూడా నిద్రపోయి ఉండరు," అంటూ మాట మార్చ యత్నించాడు.

"రమేశ్‌బాబూ, నేను వెర్రివాడిలాగా మాట్లాడతానేమో గాని, వెర్రివాణ్ణికాను. చాలా జీవితం చూశాను. చాలా ఇరుకుల్లో చిక్కి, వాటినుంచి బయటపడే ఉపాయా లాలోచించాను. అంతుచిక్కని మనస్తత్వం గలవాళ్ళ నెందరినో చూశాను. కాని వారందరిలో మీదే అగ్రస్థానం. మీ మనసు అర్థంచేసుకోవటం చాలా కష్టం," అన్నాడు చక్రవర్తి.

"అర్థంకానంత మాత్రాన గొప్పతనం ఏముందిలెండి. తెలుగు బాలశిక్ష తీసుకుంటే మనకేమీ అర్థంకాదు. కాని తెలుగుదేశంలో పసిపిల్లవాడైనా దాన్ని అర్థం చేసుకోగలడు,'' అన్నాడు రమేశుడు.

"నామీద కోపంవద్దు. నేనన్నమాట కాస్త ఆలోచించుకోండి," అన్నాడు చక్రవర్తి.

"నాకేమీ కోపంలేదు. మీకు నచ్చినా, నచ్చకపోయినా నేను అర్థంకాకుండా ఉండక తప్పదు," అంటూ రమేశుడు నిట్టూర్చాడు.

ఘాజీపూరులో దిగటం ఇప్పు డతనికంత బాగా కనబడలేదు. చక్రవర్తితో పరిచయం పెంచుకోవటంవల్ల తన కష్టాలు పెరగవచ్చు. కమలపైన తనకు అసహ్యంకూడా పుట్టుకురావచ్చు. అతను చక్రవర్తితో, "ప్లీడరీకి ఘాజీపూరు అంతమంచిది కాదేమో నని పిస్తున్నది. కాశీకి పోదామనుకుంటున్నాను," అన్నాడు.

చక్రవర్తినవ్వి, "అంతలో స్థిరం చేసుకోవటం, మళ్ళా అంతలోనే స్థిరం చేసుకోవటం బాగాలేదు. కాశీ వెళ్ళటం గురించైనా స్థిరం చేసుకున్నారా?" అన్నాడు. చేసుకున్నా నన్నాడు రమేశుడు.

చక్రవర్తి, ఇంకేమీ అనక తనసామాను సర్దుకోసాగాడు. ఘాజీపూరు రాబోతున్నది.

కమల ఆయనతో, ''చక్రవర్తిగా రీపూట నాపైన శీతకన్ను వేశారు?" అన్నది.

''మొగుడూపెళ్లాలు నన్ను వెలిపెట్టింది చాలక నన్నే తప్పు పట్టుతున్నారా?" అన్నాడు చక్రవర్తి. కమల కామాట ఏమాత్రమూ అర్థంకాలేదు. ఆమె తెల్లబోయి చూస్తుండటం గమనించి. ''రమేశబాబు కాశీకే పోతాట్ట, నీకింకా చెప్పలేదా?" అన్నా డాయన.

కమల దాని కేమీ అనక, "మీ సామానంతా నేను సర్దిపెడతానుండండి.'' అన్నది.

కాశీకి వెళుతున్నట్టు వినగానే ఆమెముఖం ముడుచుకుపోయింది. అదిచూసి చక్రవర్తి బాధపడ్డాడు.

రమేశుడు కమలదగ్గిరికి వచ్చి. ''మనం ఘాజీపూరులో దిగటానికిలేదు. పాపం, చక్రవర్తిగారు దూరమవుతారు. కాని తప్పదు. నేను కాశీలోనే ప్రాక్టీసుపెట్టాలని నిర్ణయించాను,'' అన్నాడు.

''నేను ఘాజీపూరులోనే దిగుతున్నాను. సామానుకూడా సర్దేసుకున్నాను," అన్నది కమల.

''ఒక్కర్తెవే దిగిపోతావా?" అన్నాడు రమేశు డాశ్చర్యపడి.

"ఏం? చక్రవర్తిగా రున్నారుగా?" అన్నది కమల.

''అమ్మాయీ, బొత్తిగా నా పక్షమయావంటే రమేశబాబుకు కోపం వస్తుంది," అన్నాడు చక్రవర్తి, లోపల ఆందోళనపడుతూ.

"నేను మాత్రం ఘాజీపూరులోనే దిగుతున్నాను.'' అన్నది కమల స్పష్టంగా, తనకెవరి అనుమతీ అవసరం లేనట్టు.

"సరే, చక్రవర్తిగారూ! ఘాజీపూర్‌లో దిగటమే ఖాయం, అన్నాడు రమేశుడు.

ఆ రాత్రి అతను నిర్మలాకాశం కింద, తనగదిబయట కుర్చీలో కూర్చుని, ''ఇలా ఎంతోకాలం సాగదు. కమల ఎదురు తిరుగుతున్నది. ఆమెపట్ల నా ప్రవర్తన మార్చుకోవలిసిందే. శాస్త్రోక్తంగా పెళ్లాడలేదని సంకోచించటం పొరపాటు. ఆమె తనకు దేవుడిచ్చిన భార్య. దేవుణ్ణి మించిన పురోహితు డుంటాడా?" అనుకున్నాడు.

అతనికీ, హేమనళినికీ మధ్య కీకారణ్యంలాంటిది పెరిగిపోయింది అపోహలూ, అవమానాలూ, అవిశ్వాసాలూ ఏర్పడ్డాయి. వీటన్నిటినీ నిర్మూలించటం తేలికపనా? హేమకు తనపై ఏర్పడిన అపోహలు ఒకంతట తొలగేవా? ఒకవేళ కష్టపడి తొలగించినా, కమల పరిస్థితి భయంకరమైపోదా? అనవసరంగా తల పగలగొట్టుకోవటం కంటె హేమనళినిపై ఆశ తెంచేసుకుని కమలను భార్యగా భావించటమే మంచిది.

ఉమేశుడికి కాశీలో బంధువులున్నారని వాడికి రమేశుడు కాశీదాకా టిక్కెట్టుకొన్నాడు. కాని వాడు "అమ్మ"తో ఘాజీపూర్‌లో దిగుతానన్నాడు, కమలకూడా, ''నావెంట తీసుకుపోకపోతే, పాపం, వాడేమవుతాడు, వాడు ఎప్పటికీ మనతోనే ఉండిపోతాట్ట...

సువు చక్రవర్తిగారి వెంటనే ఉండరా. జనంలో తప్పిపోయ్యేవు!''
అన్నది ఉమేశుడితో.

ఈ విషయంలోకూడా ఆమె రమేశుడి అభిప్రాయం ఉల్లంఘించి స్వతంత్రించింది. జాస్తిగా చర్చ జరగకుండానే, ఉమేశుడు ఒక చిన్నమూట తీసుకుని కమల వెనకగా నడిచాడు.

ఘాజీపూర్‌కూ, సాహెబ్‌గంజికీ మధ్యలో చక్రవర్తికి చిన్న ఇల్లున్నది. దాని వెనక ఒకతోటా, ముందొక బావీ ఉన్నాయి. రమేశుడు కమలతో ఆ ఇంట దిగాడు.

చక్రవర్తి భార్య హరిభామినిలో ఆయన చెప్పే వ్యాధి లక్షణాలేవీ లేవు. నడివయసు మనిషి. ఆమెకు ఏనాడో విషజ్వరం వచ్చి నయమై, పూర్తిగా కోలుకోకపోతే, మంచి గాలితగిలేచోట ఉంచటంతప్ప మరో మందేమీ లేదని వైద్యులన్నారు. అందుకని చక్రవర్తి ఘాజీపూరులో ఉపాధ్యాయుడుగా కుదిరి, ఇళ్ళులేని బయలులో ఇల్లు కట్టించి, అందులో కాపురం ఉంటున్నాడు. ఆయన భార్య ఆరోగ్యం ఏనాడో చక్కబడింది. కాని ఆయన ఉద్దేశం ఆమె ఇంకా కోలుకుంటూనే ఉన్నదని!

చక్రవర్తి రమేశుణ్ణీ, కమలనూ, ఉమేశుణ్ణీ ముందువసారాలో కూర్చోబెట్టి, లోపలికి వెళ్ళి భార్యతో, "బంధువులొచ్చారు, వాళ్ళ సదుపాయాలు చూడు," అన్నాడు.

"సదుపాయాలు చెయ్యటానికి ఇల్లేదీ ?" అన్నది హరిభామిని.

"అదంతా తరవాత చూసుకోవచ్చు. ముందు వచ్చినవాళ్ళను పరిచయం చేసుకో." అన్నాడు చక్రవర్తి. ఆయన కమలను లోపలికి తీసుకువచ్చాడు. కమల నమస్కరించగా హరిభామిని ఆమె నాశీర్వదించి, "ఈ అమ్మాయి మొహం అచ్చు మన శశికళ లాగాలేదూ ?" అన్నది.

శశికళ వారి పెద్దకూతురు. కాన్పూరులో అత్తవారింట కాపురం చేస్తున్నది. శశికళకూ, కమలకూ ఏకోశానా పోలికలేదు. కాని తన కూతురుకన్న మరెవరు అందంగా ఉన్నారన్నా ఆవిడ ఒప్పుకోదు. ఆమె రెండో కూతురు అన్నపూర్ణ పుట్టింటనే ఉంటున్నది. అన్నపూర్ణ అందం గురించి అతిశయోక్తులాడితే వెంటనే నిజం బయటపడుతుంది గనక, హరిభామిని అందమైనవాళ్ళను దూరంగా ఉన్న తన పెద్దకూతురితో పోలుస్తూ ఉండేది.

"వీళ్ళు మనింటికి రావటం చాలా సంతోషం. కాని మనకే ఇరుకుగా ఉన్న ఇల్లు, పాపం, వీళ్ళకి కష్టంగానే ఉంటుంది. మన కొత్త ఇల్లింకా బాగుచెయ్యక పోతిమి,'' అన్నది హరిభామిని.

ఇది చిన్న అబద్ధం. చక్రవర్తి బజారులో దుకాణాల కోసమని మరొక ఇల్లు కట్టిస్తున్నాడు. అది నివాసంగా పనికి రాదు.

''మన ఇంట కష్టాలు పడటానికి అభ్యంతరం ఉంచే కోడలిని ఎందుకు తెస్తానూ ?" అన్నాడు చక్రవర్తి. ఆయన రమేశుడి దగ్గరికి వెళ్ళినాక హరిభామిని కమలను దగ్గిర కూర్చోబెట్టుకుని,



ఆమె భర్తను గురించీ, అత్తవారిని గురించీ ప్రశ్నలవర్షం కురిపించి, కమలకు ఏమీ తెలియనందు కాశ్చర్యపడింది. అలా భర్తను గురించి తెలియకుండా ఉండటం తప్పని హరిభామిని మాటలను బట్టి కమల గ్రహించింది. తన పెద్దకూతురికి అల్లుడు తన జీతమంతా ఎలా ఇస్తాడో, రెండు నెల్లకొక నగ చొప్పున ఎలా చేయిస్తాడో చెప్పింది.

వాళ్ళు మాట్లాడుతుండగానే హరిభామిని రెండో కూతురు అన్నపూర్ణ, తన రెండేళ్ళ కూతురికి నీళ్ళుపోసి, చెయ్యి పట్టుకుని నడిపించుకుంటూ అక్కడికి వచ్చింది. అన్నపూర్ణది చామనచాయ. అయినా కనుముక్కు తీరుగలది.

ఆమె కూతురు ఉమ కమలకెదురుగా నిలబడి, "పెద్దమ్మ" అన్నది. ఆ పిల్ల కమలను చూసి శశికళ అనుకుని అలా పిలవలేదు; ఇష్టమైన ముఖంగలవాళ్ళ నందరినీ అలాగే పిలుస్తుంది. కమల ఆ పిల్లను దగ్గిరికి తీసుకుని, తొడపైన కూర్చోబెట్టుకున్నది.

హరిభామిని కమలను అన్నపూర్ణకు పరిచయం చేసి, ''వీళ్ళు మీ నాన్నగారికి స్టీమరులో పరిచయమయారట. వెంట తీసుకొచ్చారు,'' అన్నది.

కమలా, అన్నపూర్ణా ఒకరి నొకరు చూసుకుంటూనే స్నేహితురాళ్ళయిపోయారు. అన్నపూర్ణ కమలను చెయ్యిపట్టుకుని తన గదికి తీసుకుపోయి కబుర్లు చెప్పింది. అన్నపూర్ణ తన భర్తను గురించీ, దాంపత్యం గురించి చెబుతుంటే, తన జీవితం ఎంత మాన్యంగా ఉన్నదీ కమల తెలుసుకోగలిగింది.

అన్నపూర్ణ భర్త బిపిన్ ఘాజీపూరులోనే ఒక నల్లమందు దుకాణంలో ఉద్యోగం చేస్తున్నాడు. చక్రవర్తి పెద్దకూతురిని పంపినట్టు రెండోదాన్నికూడా కాపరానికి పంపి ఎడబాయటం ఇష్టంలేక, ఆమెనొక బీదవాడి కిచ్చి చేసి, అల్లుణ్ణి ఇల్లరికం ఉంచుకున్నాడు.

మాట్లాడుతూనే అన్నపూర్ణ చప్పునలేచి, "నువ్విక్కడే ఉండు ఆయన స్నానంచేసి వచ్చారు. భోంచేసి ఆఫీసుకు పోతారు. నే నిప్పుడే వస్తాను " అన్నది.

"మీ ఆయన వచ్చాడని నీ కెలా తెలిసిందీ ?" అన్నది కమల నిర్ఘాంతపోయి.

"మీ ఆయన అడుగులచప్పుడు నీకు తెలియదా ఏం?" అంటూ అన్నపూర్ణ కమలగడ్డం పట్టుకుని కుదిపి, ఉమను చంకనెత్తుకుని వెళ్ళిపోయింది.

## *11*

ఘాజీపూర్‌లో ప్రాక్టీసు పెట్టాలంటే పట్టా తీసుకోవడానికీ, ఇతరపనులకూ కలకత్తా వెళ్ళాలి. కాని కలకత్తా వెళ్ళటమంటే రమేశుడికి భయమయింది. ఒకానొక హేమనళినిపై ప్రేమతెగక పోవటమూ, మరొకవైపు సాధ్యమైనంత త్వరగా కమలను తన భార్యను చేసుకోవటం మంచిదన్న యోచనా — ఈ రెంటిమధ్యా చిక్కి అతను కలకత్తా ప్రయాణం వాయిదావేశాడు.

కమల లోపలి గదులలో ఎక్కడో ఉంటున్నది. చోటు చాల నందున రమేశుడు వసారాలోనే ఉంటున్నాడు. కమల అతనికి ఎప్పుడోతప్ప కనిపించటంలేదు. ఈ పరిస్థితిచూసి అన్నపూర్ణ చాలా నొచ్చుకుని, కమలతోనే అనేసింది.

''ఇందులో ఏముందీ ? దీనికింత విచారం దేనికీ?'' అన్నది కమల.

"నీ కల్లబొల్లిమాటలు కట్టిపెట్టు. మనసులో నీకుగల బాధ నేను తెలుసుకోలే ననుకున్నావా?" అన్నది అన్నపూర్ణ.

"అదేమిటి? మీ బిపిన్ బాబు రెండురోజులు దూరమైతే నువు-''

"అదెప్పుడూ జరగదు. ఆయన రెండురోజులు నా కెన్నడూ దూరంకారు." అని అన్నపూర్ణ తనపెళ్ళిఅయిన కొత్తల్లో తనను చూడటానికి తనభర్త ఎన్నెన్ని దొంగవేషాలు వేసినదీ, ఎన్నిపాట్లు పడినదీ, ఎలా నవ్వులపాలయినదీ చెప్పింది. ఆమెమాటలు వింటుంటే కమల శరీరం గగుర్పొడిచింది. బిపిన్ ఉద్యోగమైన కొత్తలో ఉన్నట్టుండి, ఎవరికీ చెప్పకుండా, ఆఫీసునుంచి ఇంటికి వచ్చేవాట్ట. ఒకసారి అతనేదో పనిమీద కొన్నిరోజులపాటు పాట్నా వెళ్ళవలసి వచ్చింది. ఆఖరుక్షణంలో అతను జబ్బొచ్చి నట్టు నటించి ప్రయాణం ఎగ్గొట్టేశాడు.

ఇదంతా వింటుంటే కమలకు ఏవో కట్టుకథలాగుంది. రమేశుడు కొన్నిరోజులు కనిపించకపోతే తాను అతనికోసం తహతహ లాడుతున్నదా? తనను ఎలాగైనా చూడాలని రమేశుడు తబ్బిబ్బవు తున్నాడా? ఏమీలేదు.

బిపిన్ మామూలురోజుల్లో ఆఫీసుకు పోతాడుగనక అన్నపూర్ణ పగలంతా కమలతో కబుర్లాడుతుంది. కాని ఆదివారంనాడతనుఇంట్లోనే ఉంటాడు గనక, కమలను విడిచి చాలాసేపు ఉండవలసి రావటం అన్నపూర్ణకు బాధగా ఉంటున్నది, కాని తప్పటంలేదు. ఏదోవిధంగా కమలా రమేశులను సంధానపరచాలని ఆమె అనుకున్నది.

వారిద్దరి విషయం చక్రవర్తికి పూర్తిగా తెలుసు. ఆయన తన కుమార్తెతో సహకరించాడు. ఆయన సాయంకాలందాకా రానని అందరితోటీ చెప్పి ఎటో వెళ్ళిపోయాడు.

స్నానాలయాక అన్నపూర్ణ కమలకు జడవేసింది. కొత్తచీరె కట్టించింది. ఇదంతా ఏమిటో కమల కర్థం కాలేదు. కాని అన్నపూర్ణ మాట తోసెయ్యలేకపోయింది. మధ్యాహ్నం భోజనా లయాక అన్నపూర్ణ కమలను సావిట్లోకి వెళ్ళమన్నది. కమల ఎదురుతిరిగింది రమేశుడి దగ్గిరికి వెళ్ళటానికి కమల ఏనాడూ సిగ్గుపడి ఎరుగదు కాని అన్నపూర్ణ చెప్పినట్టుగా వెళ్ళటం ఆమెకు అసాధ్యమయింది.

కమల తనభర్తపై అలిగి ఉంటుందని అన్నపూర్ణ అనుకున్నది, అలుగుతుందంటే అలగదా? వాళ్ళు వచ్చి ఇన్నాళ్ళయింది, కాని రమేశుడు కమలను చూడాలని కోరికఉన్నట్టు ఒక్కసారికూడా బయటపడలేదు.

హరిభామిని తన గదితలుపులు బిడాయించుకుని నిద్రపోతున్నది. అన్నపూర్ణ తనభర్తతో, "కమల పిలుస్తున్నదని ఆ రమేశుబాబును లోపలికి పిలుచుకురండి." అన్నది.

బిపిన్ రమేశుడి దగ్గిరికి వెళ్ళి, "మిమ్మల్ని రమ్మంటున్నారు." అన్నాడు.

"ఎవరు ? కమలా ?" అని ఆశ్చర్యపడుతూ అతను లోపలికి వచ్చాడు. కమలను తన భార్యలాగా చూసుకోవాలని అతను ఏనాడో తీర్మానించుకున్నప్పటికీ, తమ మధ్య ఉంటూ ఉన్న కృత్రిమ సంబంధాన్ని అకస్మాత్తుగా మార్చడ మెలాగో అతనికీ తెలియలేదు. అందుకని అతను గంగాతీరాన ఒక ఇల్లు అద్దెకు తీసుకుందామని కూడా అత ననుకుంటున్నాడు.

బిపిన్ అతనికి కమల ఉన్న గదిచూపి వెళ్ళిపోయాడు. అన్నపూర్ణ తన భర్తవద్దకు వెళ్ళిపోయి ఉంటుం దని ఊహించి, కమల గదివాకిలి దగ్గిర కూర్చుని తోటలోకి చూస్తున్నది. అన్నపూర్ణ రేకెత్తించిన భావా లామెను కలచివేస్తున్నాయి.

ఆ సమయంలో రమేశు డా గదిలోకి వచ్చాడు. అడుగుల చప్పుడుకు ఉలిక్కిపడి అతని కేసి చూసింది. ఆమె రక్తం అతి వేగంగా ప్రవహించ సాగింది, ఎన్నడూ అతనంటే సిగ్గుపడని కమల ఇప్పు డతనికేసి చూడలేకపోయింది.

రమేశుకి కివాళ కమల కొత్తగా కనిపించింది. ఆమె సౌందర్యం అతన్ని ముగ్ధుణ్ణి చేసింది. అతను కమలకు దగ్గిరిగా వెళ్ళి, "కమలా, నన్ను పిలిచావా ?" అని అడిగాడు.

కమల భయాశ్చర్యాలతో, "లేదు. నేను పిలవలేదు. ఎందుకు పిలుస్తానూ ?" అన్నది.

"పిలిస్తే తప్పేం ?" అన్నా డతను.

"పిలిచిఉంటే పిలిచా నని చెప్పనా ?"

"సరే, నువు పిలవలేదు. నే నే వచ్చాను. ఎందుకు తిరిగి పోవటం ?"

"మీరు ఆడవాళ్ళ గదుల్లోకి వచ్చారంటే పెద్దవాళ్ళు కోప్పడ తారు. వెళ్ళండి. నేను మిమ్మల్ని పిలవలేదు."

"అలా అయితే, బయటికి వెళదాం రా. తోటలో ఎవరూ లేరు, ఎవరూ రారు," అంటూ అత నామె చెయ్యి పట్టుకున్నాడు.

కమల తన చెయ్యి విడిపించుకుని, తలుపులు మూసేసింది.

ఇదంతా ఇంట్లో ఆడవాళ్ళెవరో చేసినపని అయిఉంటుందని రమేశుడు గ్రహించి, తిరిగి తన సోఫామీదికి వెళ్ళి, తాను చదువుతూ ఉండిన పత్రిక తీసి చూడసాగాడు. కాని అతని కేమీ అర్థం కాలేదు.

అన్నపూర్ణ వచ్చి గదితలుపు తట్టి, కమల తీయకపోయే సరికి తలుపుల సందుగా చెయ్యి పెట్టి గడియతీసి లోపలికి వచ్చింది. కమల చాపపైన పడుకుని, ముఖానికి చేతు లడ్డం పెట్టుకుని ఏడుస్తున్నది.

"ఏమిటి, కమలా? ఏమయింది? ఎందు కేడుస్తున్నావు" అని ఆమె ఆశ్చర్యంగా అడిగింది.

"ఆయ నెందుకు పిలిపించావు? ఎంత తప్పు !"

"రమేశబాబుకు కోపం వచ్చిందా ? తప్పు నా మీద పెట్ట లేక పోయావా ?"

"ఆయన ఏమీ అనలేదు, కానీ ఆయనెందుకు పిలిపించావు ?


"నా వల్ల తప్పే అయింది, కమలా, క్షమించు."

"వెళ్ళు, లేకపోతే బిపిన్ బాబుకు నీమీద కోపం వస్తుందేమో!" అన్నది కమల.

"రేపే కలకత్తాపోయి వ్యవహారాలు చూసుకోవాలి. కమలను వెంటనే భార్యను చేసుకోకపోతే ఇంకా అన్యాయమైపోతుంది." అనుకున్నాడు రమేశుడు.

అతను కలకత్తాలో తన పరిచితుల నెవ్వరినీ చూడరాదనీ, తన పని పూర్తి చేసుకుని వెళ్ళిపోవాలనీ అనుకున్నాడు. అయితే కలకత్తా చేరగానే అతని మనస్థితి మారిపోయింది. కమల అతనికి మరొకలా కనపడింది. ఆమె ఇక్కడినుంచి చూస్తే చదువు సంస్కారాలులేని మనిషిగా మాత్రమే కనబడింది. హేమనళినిపై ఆశ ఏ మాత్రమూ సడలలేదు.

అతను కలకత్తాలో తన పను లన్నీ పూర్తిచేశాడు. రేపు అలహాబాదుకు వెళ్ళి, అక్కడినుంచి ఘాజీపూరు పోదామను కున్నాడు. అతను హేమనళినికి వాస్తవమంతా తెలుపుతూ ఒక ఉత్తరం రాశాడు. గత్యంతరం లేని కారణంచేత కమలతో దాంపత్య జీవితం ప్రారంభించబోతున్నా నని కూడా అందులో తెలిపాడు చివరకు వీడ్కోలుచెప్పి ఉత్తరం ముగించాడు. ఉత్తరం ఆరంభంలో



''గాలిపటంతో ఊరుమీద పడ్డావు, నీకు నాన్నా గీన్నా లేడా ?"

''లేకేం...బజార్లో గాలిపటాలు చేసి దుకాణంమీదమ్ముతుంటాడే_ మా నాయినే! ఊరుమీద తిప్పితే మీలాంటి అబ్బాయిగోర్లు కొంటా రని యివి యిచ్చిండు..."

అతను హేమను సంబోధించలేదు, ఉత్తరం పూర్తి అయినాక తన చేవ్రాలు చెయ్యలేదు, ఉత్తరం అతికించాక, పైన చిరునామా రాయలేదు.

దాన్ని తీసుకుని అన్నదబాబుగా రింటికేసి వెళ్ళి, వారి నౌకర్లలో ఎవరికో ఒకరికి ఆ ఉత్తర మిచ్చి, హేమనళినికి అందజెయ్య మని కోరుదా మని అతని ఉద్దేశం.

దీపాలవేళ దాటాక అతను వెళ్ళిచూస్తే అన్నదబాబు ఇంటి వాకిలి మూసి ఉన్నది. మేడమీది కిటికీలుకూడా మూసే ఉన్నాయి. ఇల్లంతా అంధకారమయంగానూ, శూన్యంగానూ ఉన్నది.

అతను మూడు నాలుగుసార్లు తలుపు తట్టినమీదట ఎవరో వచ్చి తలుపు తెరిచారు.

"ఎవ రది ? రామ్ధన్ ?''

''నేనే, బాబూ !''

''బాబుగా రెక్కడి కెళ్ళారు ?''

''ఆరోగ్యం కోసమని పడమ రెళ్ళారు, బాబూ."

''ఏ ఊరికీ ?"

''తెలీదు, బాబూ."

"వెంట ఇంకెవరన్నా ఉన్నారా ?"

"కమలనయన బాబుగా రున్నారు.''

"కమలనయన బాబా ? ఆ దెవరు ?"

"ఏమో, బాబూ ?"

ఈ కమలనయనబా బొక యువకు డనీ, అన్నదబాబుగా రింటికి తరుచు వచ్చిపోతున్నా డనీ రామ్ధన్ చెప్పాడు. తాను హేమ నళినితో తెగతెంపులు చేసుకుంటున్నప్పటికీ ఈ కొత్తవాడిపైన రమేశుడికి చాలా మంట పుట్టుకొచ్చింది. అతను ఒకసారి మేడ మీదికిపోయి, గదులన్నీ తిరిగి చూసి వచ్చేశాడు.

మర్నాడతను అలహాబాదు ప్రయాణం మాని తిన్నగా ఘాజీపూరుకే బయలుదేరాడు. అతను కలకత్తాలో దాదాపు ఒక మాసం గడిపాడు

## 12

అన్నపూర్ణ సూచనపైన చక్రవర్తి గంగాతీరాన రమేశుడికీ కమలకూ ఒక ఇల్లు అద్దెకుతీసుకుని, ఆ ఇల్లు బాగుచేయించటానికి మనుషులను పెట్టాడు. చాలా కాలంగా పాడుపడివున్న ఆ ఇంటికి మరమ్మతు జాస్తిగా అవసరమయింది. తోటలోకూడా అన్నీ పిచ్చి మొక్కలు మొలిచాయి. తనకు సొంత ఇల్లంటూ ఏర్పడుతున్న ఆనందంలో, ఆ పాడుపడిన ఇల్లూ, దొడ్డీకూడా కమల కెంతో ఆనందంగా కనబడ్డాయి. ఇంట్లో ఏ గది ఎందుకు కేటాయించాలో, దొడ్లో ఏ మూల ఏ యే మొక్కలు నాటించాలో ఆమె నిర్ణయంచేసుకున్నది. ఆమె దగ్గిరే ఉండి వంట ఇంట్లో పొయ్యి వేయించింది. గోడలు మెత్తించింది, ఇల్లంతా కడిగించి అలికించింది. భోజనాలగదిలో కావలసిన ఏర్పాట్లన్నీ చేయించింది. చక్రవర్తి గారితో చెప్పి, దొడ్డి అంతా దున్నే ఏర్పాటు చేయించింది.

ఆమె ఈ పనులలో మునిగితేలుతూండగా రమేశుడు తిరిగి వచ్చాడు. ఆమె ఆసక్తికి ఎంతో ముచ్చటపడ్డాడు. ఆమెలో ఇంటియజమానురాలి దర్పం ఇప్పుడే అతనికి కానవచ్చింది. అతను ఆమెపట్ల తన ప్రేమను వ్యక్తంచేయటం కోసం పని పెట్టుకుని ఏ వేవో సంభాషణలు పెట్టుకున్నాడు. పని జాస్తి చేస్తే అలసిపోతానన్నాడు. తానుకూడా సహాయం చేస్తానన్నాడు. "ఇది మీ వల్ల అయే పని కాదు", అని ఆమెచేత అనిపించుకున్నాడు. కాని తీరా ఆమె అలుకు గుడ్డ తీసుకుని అలుకుతుంటే అతను బెదిరిపోయి, "అదేం పని, కమలా?" అన్నాడు.

అప్పుడే దొడ్డి నుంచి లోపలికి వచ్చిన చక్రవర్తి, అలుకు గుడ్డ పట్టుకున్న ఆడదానిలో సాత్వికగుణం పెరుగుతుందని చెప్పాడు, దొడ్డి అంతా దున్నటమయిందని, ఎక్కడ ఏ యే మొక్కలు పెట్టాలో కమల చెబితే, పెట్టించేస్తానని చెప్పటాని కాయన వచ్చాడు. ఆమె వంట ఇంటిమరమ్మతు పూర్తిచేసి, చీర చెంగు నెత్తిమీదికి లాక్కుని దొడ్లోకి వచ్చి, తనకు కావలిసిన మొక్కలు కోరినచోట నాటింపించింది.

సూర్యాస్తమయ మయింది, ఇంకా ఒకటి రెండు గదుల మరమ్మతు దిగబడిపోయింది. ఆ ఇంట ప్రవేశించటానికి మరి మూడు, నాలుగు రోజులైనా ఆగాలి, ఆ రాత్రి చక్రవర్తిగారి ఇంటికే వెళ్ళారు. కమలను తన భార్యగా చేసుకోవటానికి తొందరపడుతున్న రమేశుడికి ఆశాభంగమయింది. అతనికి చక్రవర్తిగారింట ఇంక ఒక్క పూటకూడా ఉండాలని లేదు. అతను అలహాబాదు వెళ్ళిపోయాడు,

మర్నాడు కమల తన కొత్త ఇంట వంటపెట్టి అన్నపూర్ణనూ చక్రవర్తినీ భోజనానికి పిలిచింది. తన భర్త భోజనం చేసి ఆఫీసుకు పోగానే అన్నపూర్ణ కమలఇంటికి వచ్చేసింది. అశోక వృక్షం కింద పొయ్యి పెట్టి కమల వంట ప్రారంభించింది. ఆమెకు వంటపనిలో చక్రవర్తి, ఉమేశుడు కూడా సహాయం చేశారు.

భోజనాలు పూర్తి అయాక చక్రవర్తి లోపలికి వెళ్ళి పడుకున్నాడు. కమల, అన్నపూర్ణా అశోకవృక్షం నీడనే కూర్చుని కబుర్లు చెప్పుకున్నారు. మూడు గంటలయే సరికి అన్నపూర్ణ తన భర్త ఇంటికి వచ్చే వేళ అయిందంటూ లేచింది.

" ఈ ఒక్క రోజుకు నియమం తప్పరాదు గామాలు? " అన్నది కమల. అన్నపూర్ణ కమలగడ్డం పట్టుకుని ఆడించి, లోపలికి వెళ్ళి తండ్రిని లేపి, "నాన్నా నే నింటికి పోతున్నాను," అన్నది.

చక్రవర్తి కమలను కూడా బయలుదేరమన్నాడు.

"ఇక్కడ ఇంకా పని ఉంది. దీపాలు పెట్టే వేళకు వస్తాను," అన్నది కమల.

"సరే నేను అమ్మాయిని దిగబెట్టి మళ్ళీ వస్తాను."

సూర్యాస్తమయం కాకముందే కమల పను లన్నీ పూర్తిచేసుకుని, కాళ్ళూ చేతులూ కడుక్కొని, గంగా ప్రవాహంలో అటూ ఇటూ ప్రయాణించే పడవలను చూస్తూ, అశోక వృక్షం కింద కూర్చున్నది.

ఉమేశు డామె దగ్గిరికి వచ్చి ఒక కాగితం పొట్లం ఇస్తూ, "అమ్మా, చక్రవర్తిగా రింటినుంచి తెచ్చిన తాంబూలం నా దగ్గిరే ఉండి పోయింది," అన్నాడు. చక్రవర్తిగారు బండి పంపించారని కూడా వాడు చెప్పాడు.

అప్పుడే చీకట్లు కమ్ముకుంటున్నాయి. కమల బయలుదేరే ముందు ఇల్లంతా ఒకసారి చూసుకుందా మని లోపలికి వెళ్ళింది. ఆమె వంటఇంట్లో దీపస్తంభం పక్కన ఉమేశు డిచ్చిన కాగితం పొట్లం ఉంచి, ఏదన్నా పుస్తకం తీసుకుని బయలుదేరుదా మనుకుంటుండగా, దీపం వెలుతురులో పొట్లం కాగితం మీది అక్షరాలు ఆమె కంట పడ్డాయి. అది రమేశుడి దస్తూరి. ఆ అక్షరాలలో తన పేరున్నది.

ఈ కాగితం నీ కెక్కడ దొరికింది ?" అని ఆమె ఉమేశుణ్ణి అడిగింది.

"బాబుగారి వస్తువుల్లో దొరికింది," అన్నాడు ఉమేశుడు.

కమల ఆ కాగితాన్ని మడతవిప్పి చదవసాగింది. అది రమేశుడు హేమనళినికి రాసి యివ్వలేకపోయిన ఉత్తరం. రమేశుడు దాన్ని ఎప్పుడో పోగొట్టుకున్నాడు.

"మీరు కదలరేం? చీకటి పడుతున్నది,'' అన్నాడు ఉమేశుడు. ఆమె జవాబు చెప్పలేదు, కొయ్యబొమ్మలాగా నిలబడి ఉన్నది.

"అమ్మా, బండి వచ్చి చాలా సేపయింది. బయలుదేరండి!" అని చక్రవర్తిగారి నౌకరు కేకపెట్టాడు.

## 13

కమలను చూసి అన్నపూర్ణ, "కమలా, అలా ఉన్నావేం? ఒంట్లో బాగాలేదా? కాకపోయినా ఒళ్ళు హూనామయేటంతపని చేస్తున్నావు. భోజనానికి లే," అన్నది.

కమల తన బాధను అన్నపూర్ణకు చెప్పుకో గలిగితే కొంత మనశ్శాంతి చేకూరి ఉండేదే. కాని రమేశుడు తన భర్త కాడన్న విషయంమ రెవరికైనా చెప్పవచ్చునుగాని, అన్నపూర్ణతో చెప్పటం కమలకు అసాధ్య మనిపించింది.

చక్రవర్తిగారు కనబడలేదు. చలి రోజుల్లో తన అత్తగారెలా ఉన్నదో చూసి రమ్మని ఆయనకు ఆయన భార్య అలహాబాదుకు పంపిం దిట. ఆయన తిరిగి రావటానికి వారమైనా పట్టుతుంది.

కమల తన గదికి వెళ్ళి తలుపులు బిగించి, ఉత్తరం మళ్ళీ చదువుకున్నది. రమేశుడు దాన్ని ఎవరికి రాశాడో తెలియలేదు. కాని ఆ మనిషి ఆడది. రమేశు డామెను ప్రేమించాడు, పెళ్ళికూడా చేసుకునే వాడే–తన మూలంగానే ఆ పెళ్ళి పడలేదు. తాను దిక్కుమాలిన స్థితిలో ఉండటంచేత అతడు తన ప్రేమపాశాన్ని కూడా తెంచేసుకున్నాడు.

గతం స్మరించుకుంటే కమల కంతా స్పష్టంగా అర్థమయింది. తనను ఏమీ చెయ్యలేక రమేశుడు అహోరాత్రాలు సతమతమయాడు. తాను అతనే తన భర్త అనుకుని సంచరించినందు కామెకు ఎంతో బాధా, సిగ్గూ కలిగాయి. ఆమెకు ఏం చెయ్యాలో తెలియలేదు. చీకటిలో తోటలోకి వెళ్ళి అక్కడ రాతి బొమ్మలాగా ఎంతోసేపు కూర్చుంది. చంద్రోదయమై చలిపుట్టినాక లోపలికి వచ్చి పడుకున్నది. ఆమె కళ్ళుతెరిచి చూసేసరికి అన్నపూర్ణ ఆమె మంచందగ్గిర నిలబడి ఉన్నది; ఎండెక్కింది. కమల చప్పున మంచంమీద లేచి కూర్చున్నది.

"కాస్సేపు పడుకో. అప్పుడే లేవకు. నీ మొహం వాడిపోయి, చాలా కాలంగా మంచాన పడి తీసుకుంటున్నట్టుగా ఉంది. నీ కొచ్చిన బాధేమిటో నాతో చెప్పరాదా?" అంటూ అన్నపూర్ణ మంచం మీద కూర్చుని కమలను దగ్గిరికి తీసుకున్నది.

కమల అన్నపూర్ణ భుజంమీద తలపెట్టి కన్నీరు వరద లయేటట్టు ఏడవసాగింది. అన్నపూర్ణ ఆమెను ఓదార్చ యత్నించింది. అంతలోనే కమల అన్నపూర్ణకు ఎడంగా జరిగి, కళ్ళు తుడుచుకుంటూ, పకపకా నవ్వ నారంభించింది.

"నీ మనసులో మాట నాకు తెలియ దనుకుంటున్నావా, కమలా? నా కంతా తెలుసులే. అలహాబాదు వెళ్ళినవాడు ఒక్క ఉత్తరంముక్క అయినా రాయలే దని నీ బాధ. నీ కాయన మీద



క్షమించరాదన్నంత కోపం వచ్చింది కాదూ?" అన్నది అన్నపూర్ణ.

కమల అవు నన్నది.

"ఛీ, అంతకోపం తగదు, లేచి వెళ్ళి మొగం కడుక్కో."

అన్నపూర్ణ అలహాబాదులో ఉన్న తన తండ్రికి ఉత్తరం రాస్తూ, "రమేశ్‌బాబు ఉత్తరంముక్క రాయలేదనీ కమల చాలా బాధపడుతున్నది. అసలే కొత్తచోటు. దానికి తగ్గట్టు రమేశబాబు ఆమెను ఒంటరిగా విడిచి రోజుల తరబడి ఎక్కడెక్కడికో

వెళుతూంటారు. పనులుంటే ఉంటాయిగాక, అయిన వాళ్ళకు రెండక్షరాలు రాసుకోరా ?" అన్నది.

అలహాబాదులో చక్రవర్తిగారు రమేశుణ్ణి కలుసుకుని, తన కూతురు రాసిన విషయాలు చెప్పి, మెత్తగా మందలించాడు.

కమల తనకోసం తహతహలాడుతున్నదనీ, తానే రాయటానికి సిగ్గుపడిందనీ రమేశు డనుకున్నాడు. ఇంత కాలమూ అతని మనస్సులో, కమల తనను ప్రేమిస్తున్నదా, లేదా అన్న సంశయం ఏ మూలనో ఉండి పోయింది. అది కాస్తా ఇప్పుడు తీరిపోయేసరికి అతని మనసు స్థిమితాన పడింది. అతను వెంటనే కమలకొక ప్రేమ లేఖ రాశాడు.

"ప్రియతమా !

"ఈమాట లాంఛనప్రాయంగా అన్నది కాదు. ఈనాడు నాకీ లోకంలో నీకన్న ప్రియతమమైన దేదీ లేదు. మనస్ఫూర్తిగా నిన్ను 'ప్రియతమా' అని సంబోధిస్తున్నాను. నీ మనసులో ఉన్న అనుమానాలన్నిటినీ కష్టాలన్నిటినీ మరిచిపో. నీ మనసును బాధ పెట్టే పనులెన్నో చేసి ఉంటాను. అందుకు నీవు నన్ను తిట్టుకుని ఉంటే ఆశ్చర్యంలేదు. నా పాపాలన్నీ పోగొట్టుకోవటానికి నిన్ను 'ప్రియతమా' అని సంబోధిస్తున్నాను. ఇందువల్ల అవి పోకపోతే, మరొక విధంగా పోవు.

"ఇంత జరిగినాక, నీకు నాపైన ప్రేమ ఉన్నదా అని అడగ టానికి నాకు ధైర్యంలేదు. ఆ విషయం ఎప్పటికైనా, ఏదోవిధంగా నాకు తెలియక పోదు. నీ ప్రేమకోసం నేను అంతఃకరణ శుద్ధిగా ప్రయత్నిస్తాను. నా ప్రయత్నం ఫలించకపోతుందా ? ఏనాడు నీ మనసు నాకు తెలుస్తుందో ఆనాడు నీకు నచ్చే ఉత్తరం రాస్తాను. ఈ ఉత్తరం నీకు కృత్రిమంగా తోచవచ్చు.

"ఇది నీ కందిన మర్నాటి కల్లా నేను ఘాజీపూరులో ఉంటాను. అప్పటికి నీవు కొత్త ఇంట ప్రవేశించి ఉంటా వను కుంటాను. కొత్తయింట నా ప్రియురాలి నెప్పుడు చూస్తానా అని ఎదురు చూస్తున్నాను

నీ ప్రేమాభిలాషి రమేశుడు."

అన్నపూర్ణ కమల దగ్గిరికి వచ్చి, ఆమె దైన్యాన్ని పోగొట్ట టానికి, "ఇవాళేనా కొత్త ఇంటికి వెళ్ళటం ?" అని అడిగింది.

"అక్కడికి వెళ్ళవలసిన అవసరం లేదు," అన్నది కమల.

"గృహాలంకరణ మంతా అయిందా ?"

"ఆ, అయింది."

"నీకొక వస్తువిస్తే నాకేం బహుమాన మిస్తావు ?"

"నా దగ్గిర ఏముంది ఇవ్వటానికి ?"

అన్నపూర్ణ కమల చెంపమీద కొట్టి, "ఔనులే ! నీ కున్నదంతా ఎవరికో ఇచ్చేసుకున్నావు కదూ ?" అంటూ పమిట కొంగులో దాచిన ఉత్తరం పైకి తీసింది. కమల ఉత్తరంమీద రమేశుడి దస్తూరి గుర్తించి ముఖం తిప్పేసుకున్నది.

"చాల్లే, నంగనాచి వేషాలు. ఈ ఉత్తరం నా చేతినుంచి లాగేసు కుని చదవాలని నీ కున్నది. పైకి ఏమీ లేనట్టు నటిస్తున్నావు," అన్నది అన్నపూర్ణ.

అంతలో ఉమ బొమ్మబండికి దారంకట్టి ఈడ్చుకుంటూ అక్కడికి వచ్చింది. కమల చప్పు నాపిల్ల నెత్తుకుని, దాని మొహమంతా ముద్దులు పెట్టేసుకుంటూ తన పడకగదికి పోయింది. తన ఆట పాడయిందని ఉమ ఏడుస్తూంటే, కమల దాన్ని మంచిమాటలతో ఊరడించ యత్నించింది.?

అన్నపూర్ణ చూసి చూసి, గదిలోకివచ్చి, "నువ్వేగెలిచావులే. నీ అంత రాయిలా ఉండటం నాకు చాతకాదమ్మా! నీవంటిదాన్ని నే నెక్కడా చూడలేదు. ఇదుగో నీ ఉత్తరం." అంటూ ఉత్తరాన్ని కమలదగ్గిర పడేసి, ఉమ నెత్తుకుని వెళ్ళిపోయింది.

కమల చాలా సేపా ఉత్తరాన్ని విప్పనుకూడా లేదు. చివరకు విప్పి రెండు మూడు వాక్యాలు చదవగానే ఆమె ముఖం జేవు రించింది. కోపంతోనూ సిగ్గుతోనూ ఆమె ఉత్తరాన్ని నేల కేసి కొట్టింది. ఉద్రేకం కొంత శాంతించాక ఉత్తరం తీసుకుని, చివర దాకా చదివి, నలిపి దూరంగా విసిరేసింది. ఆమెకు దుఃఖం పొంగి వచ్చింది; పరాయివాడు తనను భార్యగా ఉంచుకుంటాడా? ఇందుకేనా తనని ఇక్కడికి తెచ్చాడు ? ఇంత కాలానికి తనపై కోరిక పుట్టు కొచ్చినట్టుంది; అందుకే ఈ ప్రేమలేఖ రాశాడు ! తాను అతనిపై ప్రేమ కనబరిచి ఉండటం కూడా ఆమెకు బాధాకరంగా ఉన్నది. ఆ గతాన్ని కడిగేసుకోవట మెలా ?

రమేశు డంటే ఆమె కిప్పుడు గొప్ప భయం పట్టుకున్నది.

ఉమేశుడు వచ్చి, "అమ్మా, శ్రీపతిబాబుగారి కూతురి పెళ్ళికి కలకత్తా నుంచి నాటకంవాళ్ళొచ్చారు," అన్నాడు.

"సరే, వెళ్ళి నాటకం చూసిరా ."

"రే పొద్దున వచ్చే టప్పుడు పూలు తీసుకునురానా ?"


"వద్దు. నాకు పూ లవసరం లేదు."

ఉమేశుడు పోబోతుంటే కమల వాణ్ణి వెనక్కు పిలిచి, వాడి చేతిలో అయిదు రూపాయలు పెట్టింది.

"బజారునుంచి ఏమన్నా తీసుకు రావాలా ?" అని వా డడిగాడు.

"నాకేమీ అక్కర్లేదు. ఆ రూపాయలు నీ దగ్గిరే ఉంచుకుని ఖర్చు పెట్టుకో ... నాటకం చూడటానికి అలాటి బట్టలతో పోతావురా?"

తన బట్టల కేమొచ్చిందో తెలీక ఉమేశుడు నవ్వాడు. కమల వాడికి రెండు పట్టంచుబట్టలిచ్చి, ఒకటి కట్టుకోమనీ, రెండోది పైన వేసుకోమనీ అన్నది. వాడామె కాళ్ళు తగిలేటట్టు తలవంచి, తన సంతోషాన్ని అణుచుకుంటూ, వెళ్ళిపోయాడు.




కమల లేచివెళ్ళి, కిటికీలోనుంచి బయటికిచూస్తూ నిలబడింది. కొంతసేపటికి అన్నపూర్ణ వచ్చి, "రమేశబాబు రాసిన ఉత్తరం నాకు చూపించవా?" అని అడిగింది. కమల ఆమెకు నలిపిపారేసిన కాగితం చూపింది.

"ఏం మనిషి! అంత కోపమా? ఎప్పుడో భలే దెబ్బతింటుంది!" అనుకుంటూ అన్నపూర్ణ ఉత్తరం తీసుకుని చదివింది. ఆ ప్రణయ లేఖలోని భావా లామె కర్థంకూడా కాలేదు. భర్తలు భార్యల కలాటి ఉత్తరాలు రాస్తారని ఆమె ఊహించనుకూడా లేకపోయింది.

"మీ ఆయన కాదంబరి రాయటం మొదలుపెట్ట లేదుగద?" అన్నది అన్నపూర్ణ.

"నాకు తెలియదు," అన్నది కమల. 'మీ ఆయన' అన్నమాట కామెముఖం వికృతమయింది.

"ఇవాళ మీ కొత్తయింటికి పోతావా ఏం? వెళ్ళమని రమేశబాబంటున్నాడేం?"

"పోతాను.''

"నీతోకూడా వద్దునుగాని, నరిసింహబాబుగారి భార్య వస్తున్నది, నీకు తెలుసుగా! మా అమ్మను వెంట తీసుకుపో."

"వద్దు, వద్దు. ఎందుకొచ్చిన ప్రయాస? పనివాళ్ళు తోడున్నారుగా?'' అన్నది అన్నపూర్ణ.

ఉమ ఒకచోట కూర్చుని పలకమీద బలపంతో గీతలు గీస్తూ చదువుఆట ఆడుకుంటున్నది. అన్నపూర్ణ ఆపిల్ల చేతిలోనుంచి పలకా బలపం లాగేసింది. ఉమ ఏడుపు లంకించుకున్నది. కమల ఆ పిల్లను తనగది కెత్తుకుపోయి, "నీకు భలేవి ఇస్తాను చూడు!" అని, తన పెట్టెలోనుంచీ బంగారు గాజులుతీసి ఆపిల్లచేతికి పెట్టింది.

ఉమ వాటిని తీసుకుపోయి తల్లికి చూపించింది. అన్నపూర్ణ ఆశ్చర్యపడి, వాటిని తీసుకొచ్చి కమలకిస్తూ ''చిన్నపిల్ల కిలాటి వస్తువులిస్తారా?'' అన్నది.

"నేను వాటిని ఉమ కిచ్చేశాను," అన్నది కమల.


''నీ కేమైనా మతిపోయిందా ఏమిటి?"

"నిజంగానే చెబుతున్నాను. అవి ఉమవి. నేనుతిరిగి తీసుకోను. కావలిస్తే కరిగించి గొలుసుచేయించి పిల్లమెడలో వెయ్యి.'' అన్నది కమల.

''కమలా, నీవంటి మనసుగల మనిషిని నే నెన్నడూ చూడలేదు," అంటూ అన్నపూర్ణ కమలను కౌగలించుకున్నది.

కమల కన్నీరు రాలుస్తూ, "అన్నపూర్ణా, నేను వెళ్ళిపోతున్నాను. మీ ఇంట్లోఉన్న ఇన్ని రోజులలో నేనుపొందినసుఖం జీవితంలో ఎన్నడూ ఎరగను." అన్నది.

"ఎక్కడికో దూరదేశానికి పోయేదానిలా మాట్లాడతావేమిటి? నువ్విక్కడ పొందినసుఖ మేమిటో నాకు తెలీదా ? ఇకముందు నీకు




సొంత ఇల్లూ, స్వరాజ్యమునూ. హాయిగా ఉంటావు. ఎప్పుడన్నా మేం చూడవస్తే, వీళ్లెక్కడ దాపరించార్రా అనుకుంటావు."

కమల అన్నపూర్ణకాళ్ళకు వంగి నమస్కారంచేసి బయలుదేరింది.

''రేపు మధ్యాన్నం రెండు జాములవేళ వస్తాను,'' అన్నది అన్నపూర్ణ.

కమల జవాబు చెప్పకుండా కొత్త ఇంటికి వచ్చేసింది. ఉమేశుడు అక్కడే ఉన్నాడు.

''ఏం రా ? నాటకం చూడటానికి వెళ్ళలా ?" అని ఆమె అడిగింది.

''మీరు ఒంటరిగా ఉంటా రని— "

"ఆ గొడవ నీ కెందుకురా ? నువు వెళ్ళి నాటకం చూడు. ఇక్కడ నాకు తోడు మోహను డున్నాడులే."

''ఆట అప్పుడే ఆరంభం కాదు."

''ఆట కాకపోతే ఇం కెన్నో వేడుక లుంటాయి. వెళ్ళి చూడు."

ఉమేశుడు బయలు దేరాడు.

''ఒరే, నీ కేదైనా కావలిస్తే చక్రవర్తిగారి నడుగు. ఆయనకు నా నమస్కారాలు చెప్పు,'' అన్నది కమల.

ఈ మాటల వెనక ఉన్న భావం అర్థంకాక ఉమేశుడు, "సరే నమ్మా !'' అని వెళ్ళిపోయాడు.

అపరాహ్ణం వేళ కమల బయలుదేరటం చూసి మోహనుడు, ''ఎక్కడికి పోతున్నా రమ్మగారూ ?" అని అడిగాడు.

''గంగా స్నానానికి."

''నేనుకూడా రానామ్మా ?''

''వద్దు. ఇల్లు కనిపెట్టుకుని ఉండు."

కమల వాడిచేతిలో ఒకరూపాయిపెట్టి బయలుదేరింది.

## 14

హేమనళిని పొందే మనః క్లేశం అర్థం చేసుకుని అన్నదబాబు చాలా బాధపడ్డాడు. కాని ఆమె మనః క్లేశాన్ని ఎలా పోగొట్టాలో ఆయనకు తెలియలేదు. తన భార్యే జీవించి ఉన్నట్టయితే, ఆమె వల్ల ఆ పని సాధ్యమై ఉండేదనుకున్నా డాయన. కూతురి ఆరోగ్యం భంగ మవుతుందేమో నన్న చింతలో ఆయన తన అనారోగ్య స్థితిని కూడా మరిచిపోయాడు.

హేమనళిని అన్న జోగేంద్రుడు మరొక విధంగా బాధపడుతున్నాడు. ఇంట్లో కూర్చుంటే తన చెల్లెలి విషాదవదనం కనబడుతుంది; బయటికి పోదామనుకుంటే ఆమె పెళ్ళిగురించి అడ్డమైన వాళ్ళూ అనేక ప్రశ్న లడుగుతారు. ఏం చెప్పాలో అతనికి తెలీదు.

ఆడవాళ్ళు ఇంగ్లీషు నవలలు చదివీ, నాటకాలు చూసీ ప్రేమ పిచ్చిలో పడి తమ జీవితాలను మంట కలిపేసుకుంటున్నారని అతనికి తోచింది. ప్రేమపిశాచం వాళ్ళమీద ఎక్కి తాండవం చేస్తోంది. రమేశుడు తనని వదిలేశా డని హేమ ఇంతగా బాధపడాలా ? అతను తన మనస్సులో కలిగే భావాలను స్వేచ్ఛగా పైకి అనేస్తున్నాడు. ఆ మాటలు విని అన్నదబాబు దడుచుకుంటున్నాడు. ఆయన భయం ముఖ్యంగా కూతురి హృదయం గాయపడుతుందనే.

ఒకనాటి సాయంకాలం టీ వేళకు అతను ఇంటికి వచ్చి చూస్తే, కింద టీతాగే ప్రయత్నాలేమీ లేవు. పైన తండ్రీ కూతురూ కూర్చుని హేమతల్లి బతికున్నప్పటి విషయాలు మాట్లాడు కుంటున్నారు.

"హేమ ఇవాళ మీటిం గిక్కడ జరుగుతున్నదా ?" అన్నాడతను టీ ప్రయత్నం లేనందుకు తప్పు పట్టాడు.

''నాకు రాత్రివేళ నిద్రపట్టకుండా ఉంది. అందుచేత టీ మానేశాను,'' అన్నాడు అన్నదబాబు. కాని మరుక్షణం హేమనళిని టీ తాగుదాం పద మనగానే ఆయన సంతోషంతో కిందకి వచ్చాడు.

వాళ్ళు కిందికి వెళ్ళేసరికి అక్షయుడు టీ బల్ల ముందు నుంచి లేచి, "నేను పోతాను,'' అన్నాడు.


హేమనళిని, ''అదేమి టక్షయ బాబూ ? టీ తాగి వెళ్ళండి ! ఏమంత తొందర ? '' అన్నది.

"మీరు రాక పూర్వము రెండు కప్పులు తాగాను. ఎవరైనా తాగమంటే ఇంకో రెండు కప్పులు తాగటాని కేమీ అభ్యంతరం లేదు," అన్నా డక్షయుడు.

చాలా రోజుల అనంతరం ఆ ఇంట హాస్య సంభాషణలు సాగాయి.

తరవాత జోగేంద్రుడు తండ్రితో, నాన్నా, ఇంక తాత్సారం చెయ్యటం మంచిది కాదు. హేమకు పెళ్ళి చెయ్యాలి," అన్నాడు. "రమేశుడి కిచ్చి పెళ్ళి చేస్తామన్నారు. చెయ్యలేదేమని అడిగే వాళ్ళకేం చెప్పను ? ఎవరి నోరు ముయ్యగలం ? కొందరు నోటికి వచ్చినట్టు పేలేస్తున్నారు.''

''ఎవరి కిచ్చి చేస్తాం ? '' అన్నాడు అన్నదబాబు.



"పెద్ద పెద్ద హీరో పాత్రలు వేసి వేసి సినిమా ల్నుండి ఎప్పుడో విరమించుకొని ఇలాగ జీవిస్తూంటే మళ్ళీ నా బతుకుమీదకు యిలాగ విరుచుకుపడ్డా రేమయ్యా ?!"

"అదే ఇప్పుడు మా పిక్చరుకి ఒక పెద్ద ఆకర్షణ గెస్టు; ఆర్టిస్టుగా మిమ్మల్ని కొద్ది సెకెన్లు చూపించబోతున్నాం! పాత్ర కూడా సరిగ్గా మీకు సరిపడ్డదే" (జాలరివాని పాత్ర !...)

---

"ఏంచెయ్యమన్నా నోరు మూసుకుని చేసేవాడు అక్షయుడున్నాడు గద ?"

"నీ కేమన్నా పిచ్చా ? హేమ అక్షయుణ్ణి చేసుకుంటుందా ?''

"మీరు సరేనంటే, మిగిలింది నేను చూస్తాను."

''వద్దు. అనవసరంగా దాని మనసు పాడుచెయ్యకు. పెళ్ళి కేమి తొందర ?"

జోగేంద్రుడు తరవాత హేమనళినితో, లౌక్యంగా తండ్రి ఆరోగ్యం గురించి ప్రస్తావించి, ఆయన ఆరోగ్యం బాగుపడాలంటే నువు నీపట్టు విడవాలి." అన్నాడు. ఆమెను గురించి నలుగురూ అనుకునే మాటలే ఆయన ఆరోగ్యాన్ని పాడుచేస్తున్నాయనీ, దానికి విరుగుడు ఆమె ఎవరినన్నా మంచివాణ్ణి చూసి పెళ్ళాడటమేననీ అన్నాడు.

"నేను పెళ్ళి చేసుకోకుండా సన్యాసం పుచ్చుకుందా మనుకుంటున్నాననా నీ ఉద్దేశం?" అని హేమనళిని అడిగి

''అయితే ఆపెళ్ళి వెంటనే ఎందుకాడవు? ఉన్నంతలో మనస్సు తృప్తి'పరచుకోవాలి గాని, స్వర్గంనుంచి దేవేంద్రుడే దిగిరావాలంటే సాధ్యమా? అలా అనుకునేకన్న సన్యాసమే మేలు."

"ఫలానివాడైతేనేగాని పెళ్ళాడనని నేను నీతో ఎన్నడైనా అన్నావా? ఏమి టీ మాటలు?"

"వేరే అనాలా? నేను చూస్తూనే ఉన్నాను. నీ మేలు కోరేవారిని నువు తృణీకరించి అవమానిస్తావు. నీకు తెలిసినవారిలో ఒకడు నువ్వుతిట్టినా, దీవించినా పడుతూ. నీ సుఖమే తన సుఖంగా భావించేవాడు – నీకు తెలుసు. అలాటి భర్తతో నువు తృప్తిపడితే అందుబాటులోనే ఉన్నాడు. కాదు నాకు ప్రబంధ నాయకుడే కావాలంటే—"

"ఏమి టా మాటలు? నాన్నగారెవర్ని పెళ్ళాడమన్నా నేను సిద్ధంగానే ఉన్నాను. లేదని నిరూపించి ఆ తరవాత ప్రబంధ నాయకుల సంగతి ఎత్తు." అంటూ హేమనళిని లేచింది.

జోగేంద్రుడు తండ్రి గదిలోకి వెళ్ళి "హేమ పెళ్ళాడటానికి ఒప్పుకున్నది. మీరు ఒక్కసారి వెళ్ళి అక్షయుణ్ణి పెళ్ళాడమని అంటే చాలు. ఒప్పుకుంటుంది," అన్నాడు.

"నేను చెప్పాలా!" అన్నాడు తండ్రి.

"లేకపోతే నన్ను చెప్పమన్నా చెబుతాను."

"వద్దు, చెప్పవలిసిందేదో నేనే చెబుతాను. కాని నామాట విను. పెళ్ళికోసం హేమను తొందరపెట్టవద్దు. కొద్దిరోజులు లాగు."

"ఆగటంవల్ల విఘ్నాలు కలగడమేగాని ప్రయోజనమేముంది?"

జోగేంద్రుడు చాలా మొండిఘటం. అతననుకున్నది జరిగి తీరాలిసిందే

''హేమతో వెళ్ళి మాట్లాడదాం పదండి,'' అని అతను తండ్రిని తొందరపెట్టాడు.

''ను వ్విక్కడే ఉండు. నేను మాట్లాడతానులే," అంటూ అన్నదబాబు తన కుమార్తెవద్దకు వెళ్ళాడు. ఆమె చీకటిలో కూర్చుని ఉన్నది. ఆమె దీపంతెస్తానంటే తండ్రి వద్దన్నాడు.

తండ్రీ కూతుళ్ళు మాట్లాడుకున్నారు, కాని ఆమె పెళ్ళిగురించి కాదు తండ్రి తిరిగిరాగానే జోగేంద్రుడు, ''మాట్లాడారా ?'' అని అడిగాడు.

''ఆ, మాట్లాడాను,'' అన్నాడు అన్నదబాబు.

''ఒప్పుకున్నదా?"

"ఒకవిధంగా ఒప్పుకున్నది."

''అయితే ఈమాట అక్షయుడికి చెప్పివస్తాను."

"అప్పుడేవద్దు. పడమర వెళ్ళివచ్చాక అంతా నిశ్చయంచేద్దాం"

అయినా జోగేంద్రుడు పైబట్ట వేసుకుని అక్షయుడింటికి వెళ్ళి, అతని చేతుల్లోఉన్న పుస్తకం లాగేసి, ''నీ పెళ్ళికి ముహూర్తం పెట్టుకో." అన్నాడు

అక్షయు డాశ్చర్యపోతూ, "ఏమన్నావ్?" అన్నాడు.

మర్నా డుదయం టీకి వేళకాకుండానే హేమనళిని టీ తాగుదామని తండ్రిని తొందర చేసింది. అక్షయుడు రాకముందే ఆ పని ముగించా లన్న ఉద్దేశంతో ఆమె తొందర పడుతున్నట్టు అన్నదబాబు గ్రహించాడు. ఇద్దరూ కిందికి దిగివచ్చేసరికి టీ ఇంకా సిద్ధంకాలేదు. అన్నదబాబు నౌకర్లపైన మండిపడ్డాడు, ''పనివాళ్ళంతా నవాబులై




"ఊరికే దేవుణ్ణెందుకలా తిట్టి పోస్తువురా పిచ్చికుంకా ?!"

"నీకు చెవుల్లేనేలేవురా వెర్రికుట్టే! దేముడు నన్ను ఎన్నెన్ని కారుకూతలు కూస్తున్నాడో నీకు వినపడవు, మరి నా కళ్ళు రెండూ కళ్ళద్దాల కంటుకొని పెట్లో ఉండిపోయాయ్, అంచాత వాడు నాక్కనిపించకుండా ఉన్నాడు — కనిపిస్తేనా — హం హం! ........................"

---

కూర్చున్నారు. వాళ్ళపనులు వాళ్ళకు జ్ఞాపకం చెయ్యటానికొక పని మనిషిని పెట్టాలిలాగుంది.'' అన్నాడు.

నౌకరు టీ సిద్ధంచేసి తెచ్చాడు. మామూలుగా కబుర్లు చెబుతూ టీ తాగే అన్నదబాబారోజు మాటాపలుకూ లేకుండా తన టీనీ ఒక్క గుక్కలో తాగేశాడు.

హేమనళిని. ''ఏమిటి నాన్నా? ఎక్కడికన్నా వెళుతున్నారా?'' అని అడిగింది ఆశ్చర్యంతో.

"లేదు. టీ ఒక్కసారిగా తాగేస్తే కాస్త చెమట పడుతుందని!'' అన్నాడు అన్నదబాబు.

ఇంతలో జోగేంద్రుడూ, అక్షయుడూ రానే వచ్చారు. అక్షయుడు దాబుగా ముస్తాబయాడు. మంచిదుస్తులు వేసుకుని, వెండి బెత్తం పట్టుకుని, బంగారు గొలుసుగల జేబుగడియారం ధరించి, ఎడమచేతిలో మెత్తని కాగితంలో చుట్టిన వస్తువేదో పట్టుకుని ఉన్నాడు. అతను మామూలుగా కూర్చునే చోటు విడిచిపెట్టి, హేమనళిని పక్కన ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. ఆమె తల ఎత్తి అతని కేసి చూడలేదు.

"ఇవాళ మీ గడియారం కొంచెం వేగంగా నడుస్తున్నట్టున్నది." అని అత నంటే జవాబు చెప్పలేదు.

అన్నదబాబు, "హేమా, పైకి వెళ్ళి, నా బట్టలు ఎండలో వెయ్యి,'' అన్నాడు.

జోగేంద్రుడు, "ఎండ ఎక్కడికి పోతుంది, నాన్నా? ... హేమా, అక్షయబాబుకు టీ పోయ్యి. నాక్కూడా కావాలి," అన్నాడు.

"ఎండ జాస్తి అవుతుందేమో. వెంటనే వెళ్ళి నా బట్టలు ఎండలో ఆరవెయ్యి." అన్నాడు అన్నదబాబు కూతురితో మళ్ళీ.

''అక్షయబాబు వచ్చాడు. ఇవాళ బట్టలు ఎండలోవేసే పని మానండి,'' అన్నాడు జోగేంద్రుడు.

అన్నదబాబుకు చాల కోపం వచ్చింది. ఆయన తన కొడుకుతో, ''ప్రతిదానికీ ఎందు కలా మొండి పట్టు పడతావ్? ఇతరుల కేం బాధ కలిగినా సరే నీ మాట నెగ్గటమే నీకు! అదో గొప్ప అనుకుంటున్నావు లాగుంది. ఎంతో ఓర్చుకు చూశాను. హేమా, పద. రేపటి నుంచీ మనం కిందికే రావద్దు. పైకే టీ తెప్పించుకు తాగుదాం," అన్నాడు.

"కొంచెం ఉండండి, నాన్నా! మీరు మామూలుగా టీ తాగినట్టు తాగనేలే దివాళ. అక్షయబాబూ, చేతిలో దేమిటో తెలుసుకోవచ్చునా?" అన్నది హేమనళిని.

అక్షయుడు కాగితంచుట్టిఉన్న వస్తువు నామె కిచ్చాడు.

హేమనళిని పైకాగితం విప్పి, లోపల ఒక ప్రణయపత్రం ఉండటం గమనించింది. "శ్రీమతి హేమనళినీదేవికి అక్షయకుమారుడి ప్రేమకానుక'' అని రాసిఉన్నది. అది చూడగానే ఆమె



"కాఫీపొడి పొట్లాం ఖరీదు రెండు రూపాయల నలభై పైసలు,
ఫేస్‌పౌడరు డబ్బా ఖరీదు ఒక రూపాయి అరవై పైసలు.
రెండూ కలిపితే ఎంత ?''
"అంతా నష్టం నాన్నా.''

---

భయపడి, దాన్ని నేలపై జారవిడిచి, "నాన్నా, పోదాం పదండి," అన్నది.

ఇద్దరూ పైకి వెళ్ళిపోయారు.

జోగేంద్రుడికళ్ళు చింతనిప్పుల్లా అయాయి. ''నే నీ ఇంట్లో ఒకక్షణం ఉండను. ఎక్కడన్నా బడిపంతులుపని చూసుకుని వెళ్ళిపోతాను.'' అన్నాడతను.

అక్షయు డతనితో, ''ఎందు కనవసరంగా హైరానపడతావు? నువు పొరపడి ఉంటావని నిన్నరాత్రే నే నన్నాను. హేమ నన్ను ఒక్కనాటికి చేసుకోదు. అసాధ్యమైనదాని కోసం వెర్రిగా ప్రయత్నించక ఆమె రమేశుణ్ణి మరచిపోయే మార్గం చూడు. అందమైన యువకుడు దొరికితే హేమ బట్టలు ఎండలో వేసే మాట మరచిపోతుంది," అన్నాడు.

"అందగాడైన యువకుడంటే అంగడిలో దొరికే వస్తువా?'' అన్నాడు జోగేంద్రుడు.

"అలాటివాణ్ణి నేనే చూపుతాను. కాని పెళ్ళిగురించి తొందర పడగూడదు. ముందు పరిచయం ఏర్పడి, అది స్నేహంగా పరిణమించాలి. ఆ తరవాత ముహూర్తం దానంతట అదే వస్తుంది.'' అన్నా డక్షయుడు.

అతని దృష్టిలో ఉన్నవాడు కమలనయను డనే డాక్టరు. మర్నాడే కమలనయనుడు ఉపన్యాసం ఇస్తున్నాడు దానికి హేమనళినిని వెంటబెట్టుకుని వెళ్ళమని జోగేంద్రుడి కతను సలహా ఇచ్చాడు. కమలనయనుడికి సంబంధించిన విషయాలుకూడా అక్షయుడు అతనికి చెప్పాడు.

కమలనయనుడి తండ్రి రాజవల్లభుడు ఒక చిన్న జమిందారు ఆయన తన ముప్ఫయ్యోయేట బ్రహ్మసమాజం పుచ్చుకున్నాడు. ఆయన భార్య సనాతన ధర్మం విడిచిపెట్ట నిరాకరించింది. కమలనయనుడుకూడా మంచివక్తగా బ్రహ్మసమాజంలో ఖ్యాతి గడించాడు. వైద్య వృత్తిలో దిగి అందులోకూడా పైకివచ్చాడు.

ఇలా ఉండగా వార్ధక్యంలో రాజవల్లభు డొక వయసులో ఉన్న వితంతువును పెళ్ళాడాడు. ఆయన మొదటి భార్య కాశీకి వెళ్ళాలని నిశ్చయించింది. రంగపూరులో వైద్యం చేసుకుంటున్న కమలనయను డింటికి వచ్చి, తల్లివెంట తానుకూడా కాశీ వస్తానన్నాడు. అతను తన తల్లిని సుఖపెట్టగోరి, తన బ్రహ్మసమాజాన్ని కూడా వదులుకున్నాడు.

ఇద్దరూ కాశీలో ఉంటుండగా తల్లి కమలనయుణ్ణి పెళ్ళి చేసుకోమన్నది. ''నా కోసం బ్రహ్మచారిగా ఉండకు నాయనా. నీ యిష్టం వచ్చిన పిల్లనే పెళ్ళాడు," అన్న దామె.

''నీ కిష్టమైన పిల్లనే పెళ్ళాడి, నీ సేవకు నియోగిస్తా నమ్మా.'' అన్నాడు కమలనయనుడు.

తరవాత అతను తన దేశానికి వెళ్ళాడు. అక్కడ ఏం జరిగిందీ అక్షయుడికి స్పష్టంగా తెలియదు. కమలనయనుడు రహస్యంగా ఒక అనాథస్త్రీని పెళ్ళాడా డనీ, తరవాత భార్యా భర్తలకు ఎడబాటయిందనీ కొంద రన్నారు.

## 15

''మీ రెక్కడికీ వెళ్ళరు. ఒక మీటింగు లేదు, ఉపన్యాసాలు వినటంలేదు. అందుకే మీ ఆరోగ్యం చెడిపోతున్నది.'' అని ఉపన్యాసంకొట్టి జోగేంద్రుడు మర్నాడు కమలనయనుడి ఉపన్యాసం వినటానికి తండ్రినీ, చెల్లెలినీ ఒప్పించాడు. కమలనయనుడి పేరు వినగానే అన్నదబాబు, ''అతన్ని గురించి ఏదో రకరకాలుగా చెప్పుకుంటున్నారే !'' అన్నాడు.

''లోకులు మూర్ఖులు. మంచివాళ్ళను గురించి చెడ్డగా చెప్పుకోవటం తప్ప వారికి వేరే పనిలేదు. అతను తన తల్లిని సుఖపెట్టటానికి ఎంత త్యాగం చేశాడు !'' అన్నాడు జోగేంద్రుడు. అతను మలనయ నుణ్ణి హేమనళినితో పోల్చాడు, ఎందుకంటే హేమనళిని కూడా తండ్రి సుఖంకోసం ఎంత త్యాగమైనా చెయ్యగలది.

ముగ్గురూ కలిసి ఉపన్యాసం వినటానికి వెళ్ళారు. కమలనయనుడు చాలా చిన్నవాడు గానూ, నాజూకుగానూ కనిపించాడు. అతని ఉపన్యాస ధోరణి అపూర్వమైనదీనూ, అలా ఉపన్యసించగలవారు చాలా కొద్దిమంది ఉంటారు.

కమలనయనబాబు "త్యాగం'' గురించి ఉపన్యసించాడు. త్యాగం చెయ్యలేని వా రేదీ పొందలేరనీ, స్వార్థత్యాగమే నిజమైన పురుషార్థమనీ, స్వార్థత్యాగంతో చేసినదే సాత్వికదానమనీ అతను ఉపన్యసించాడు.

అతని ఉపన్యాసం హేమనళినికీ, అన్నదబాబుకూ కూడా నచ్చింది. జోగేంద్రుడికి మాత్రం ఉపన్యాసం అర్థంకాకపోవటం



"అయ్యా ప్రొఫెసర్ గారు, ఇక ముందు మీరు ఏంకనిపెట్టినా, నన్నే మీ లేబరేటరీకి పిలిచి ప్రయోగం చేసి చూపించండి, ఇక్కడికి మాత్రం తీసుకురావద్దు"

అటుంచి కమలనయనుడిపై దురభిప్రాయం కూడా ఏర్పడింది. అయితే అక్షయకుమారుడు వ్యతిరేకించాడు; హేమనళిని దేవుణ్ణి తెచ్చి ఎదురుగా ఉంచినా, రమేశుడితో పోల్చిచూస్తుం దనీ, అలా పోల్చే అవకాశం ఇవ్వని వాడు కమలనయనుడే ననీ గట్టిగా నచ్చజెప్పాడు.

ఒకరోజు జోగేంద్రుడు కమలనయనుణ్ణి తమ ఇంటికి తీసుకు వచ్చాడు. అన్నదదాబు ఆతనికి ఎంతో ఆదరంతో స్వాగతం చెప్పి, ఆతని ఉపన్యాసాన్ని అమితంగా మెచ్చుకున్నాడు. హేమనళిని కూడా ఆ ఉపన్యాసం విని ఎంతో సంతోషించిం దన్నాడు. తరుచు వచ్చి తమ ఇల్లు పావనం చేస్తూండ మనీ, ఏ వేళప్పుడు వచ్చినా తానూ తన కుమార్తే ఇంట్లోనే ఉంటామనీ, చెప్పాడు.

కమలనయనుడు చాలా నమ్రతగా మాట్లాడాడు. సంభాషణ మధ్యలోనే జోగేంద్రుడు లేచి వెళ్ళిపోయాడు. తరవాత అన్నదబాబు కమలనయనుణ్ని, "మీరుండే దెక్కడ ?" అని అడిగాడు.

"నాకు చాలామంది స్నేహితు లున్నారు. ఎవరు తీసుకుపోతే వారింటికి పోతున్నాను. కాని ఒంటరిగా ఉండాలంటే వేరే ఇల్లు తీసుకోవాలి. మీ పక్క ఇల్లు ఖాళీగా ఉన్నదనీ, తీసుకో వచ్చు ననీ జోగేంద్రబాబుగా రన్నారు," అన్నాడు కమలనయనుడు.

పక్క ఇ ల్లనగానే హేమనళిని ముఖం వివర్ణ మయింది. ఆమెకు పాతసంగతులు జ్ఞాపకం వచ్చాయి.

ఇంతలో టీ సిద్ధమైవచ్చింది. అన్నదబాబు తమ అతిధికి టీ ఇయ్యమని హేమనళితో అన్నాడు. కాని కమలనయనుడు తాను టీ తాగననేశాడు. టీ తాగే అలవాటు లేకపోతే ఫలహార మన్నా తీసుకోమన్నాడు అన్నదబాబు, కమలనయను డందుకు కూడా సమ్మతించక పోయేసరికి అన్నదబాబు, "కాస్త వేడినీరు తాగితే తిన్న భోజనం అరుగుతుందా ! మీరు డాక్టరు. నేను మీకు చెప్పాలా ?" అన్నాడు.

"మీ మనస్సులో ఉన్న అనుమానం నిజంకాదు. మీ ఇంట టీ తాగటానికి నేను పస్తాయించటంలేదు. నాకు టీ అలవాటులేక కూడా కాదు, ఒకప్పుడు తెగ తాగేవాణ్ని, ఇప్పుడు కూడా టీ వాసన తగిలితే తాగా లనిపిస్తుంది. కాని మా అమ్మగారి ఆచారానికి విరుద్ధంగా వెళ్ళటం ఇష్టంలేక టీ తాగటం మానేశాను.'' అన్నాడు కమనలనయనుడు.

అంతదాకా హేమనళిని అతను కపటి అనుకుంటూ వచ్చింది. కాని ఈ మాట వినగానే ఆమె కతనిపై సదభిప్రాయం కలిగింది.

"ఈ సంగతి తెలిస్తే టీ తాగమని మిమ్మలి నిర్బంధించకనే పోదునే," అన్నాడు అన్నదబాబు.

"నేను తాగలేదని మీ రన్యధా భావించ రనుకుంటాను," అన్నాడు కమలనయనుడు.

ఆరోజు కారోజు అన్నదబాబుకూ, కమలనయడికీ మధ్య స్నేహం పెరిగిపోయింది. "మీరు కమలనయనబాబుకు శిష్యులయారని అందరూ అనుకుంటున్నారు," అని జోగేంద్రుడు తండ్రితో అన్నాడు.

"కొందరు గురువులూ, కొందరు శిష్యులూ ఉండటంలో తప్పేముంది ? అందరూ గురువైతే కష్టంగాని !" అన్నాడు అన్నదబాబు.


కమలనయనుడికి అన్నపానాల విషయంలో అనేక నియమాలున్నాయనీ, అతను ప్రాణాయామం చేస్తాడనీ, ఉదయాన సూర్యుడికేసి చూస్తూ నిలబడతా డనీ హేమనళిని తెలుసుకున్నది. ఆమె తమ మేడ మీదినుంచి పక్క మేడపైన అతను ఇలాటివి చెయ్యటం గమనించింది.

హేమనళిని తానుకూడా కొన్ని నియమాలు అవలంబించటంవల్ల తన మనస్సుకు మంచిదని నిశ్చయించుకుని, ప్రాణాయామమూ, ఉదయంపూట ఈశ్వరార్చనా సాగించింది. అన్నదబాబు కిది పూర్తిగా సమ్మతం కాకపోయినా, ఆమె ముఖంలో కలిగిన వికాసం చూసి తృప్తిపడ్డాడు. జోగేంద్రుడు మాత్రం, "ఇల్లంతా కంపు చేసేస్తున్నావు. ఇలాటి కొంపలో ఎలా ఉండటం ?" అని చీదరించుకున్నాడు.

ఒకరోజు చాలా పెందలాడే కమలనయనబాబు వచ్చి, "కాశీనుంచి మా అమ్మగారు ఉత్తరం రాశారు. ఆమెకు ఒంట్లో సరిగా లేదట. ఇవాళ సాయంకాలం బయలుదేరి పోతున్నాను. మిత్రులందరికీ చెబుదామని బయలుదేరాను." అన్నాడు.

కాస్సేపు మాట్లాడి అతను వెళ్లిపోయేటప్పుడు, "అమ్మగారి ఆరోగ్యం గురించి రాస్తూ ఉండండి." అన్నది. ఆమె అతనికి సాష్టాంగ ప్రమాణం చేసింది.

కొంత కాలంగా అయిపులేకుండా ఉండిపోయిన అక్షయుడు కమలనయనుడు కాశీకి బయలుదేరివెళ్ళిన మర్నాడే టీ తాగటానికి




"ఇప్పుడు కళ్ళజోడు, మీసాలతో పేద్దవాడిలా కనిపిస్తున్నానా? ఈ సారి ఆటంబాంబులు అవీ ఎందుకు ఇవ్వరో చూస్తాను"

వచ్చాడు. హేమనళిని టీ తాగటం మానేసినందుకు జోగేంద్రుడు ఆమెను ఎద్దేవా చేశాడు. అన్నదబాబుకు కోపం వచ్చింది. ఆయన ఏమీ తినకుండా ఉత్త టీ మాత్రం తాగాడు.

ఆ రాత్రి ఆయనకు కడుపులో బాధ పుట్టుకొచ్చింది. డాక్టరు వచ్చి చూసి, "పైత్యకోశం చెడింది. పెద్ద జబ్బేమీలేదు. పడమర వెళ్లి కొన్నాళ్లుండటం మంచిది," అన్నాడు.

"మనం కొంతకాలం కాశీలో ఉందివద్దాం," అన్నాడు అన్నదబాబు. ఈ ఆలోచన హేమనళినికి కూడా నచ్చింది. కమలనయనుడు వెళ్ళినప్పటినుంచీ ఆమెకు ఏదో లోటు కనబడుతున్నది.

జోగేంద్రుడు వచ్చి, ''ఎక్కడికో ప్రయాణమల్లే ఉందే?'' అన్నాడు.

''ఊళ్ళు తిరుగుతాం. ఎక్కడ సౌకర్యంగా ఉంటే అక్కడ ఉండమని డాక్టరన్నాడు," అన్నాడు అన్నదబాబు. తాము కాశీ వెళుతున్నట్టాయన కొడుకుతో చెప్పలేదు.

"నేను రాలేను. హెడ్మాస్టరు పనికి దరఖాస్తు వేశాను. జవాబు కోసం ఎదురు చూస్తున్నాను,'' అన్నాడు జోగేంద్రుడు.

## 16

కమలకు ఉత్తరం రాసిన మర్నాడే రమేశుడు అలహాబాదు నుంచి ఘాజీపూరుకు తిరిగి వచ్చాడు. అతను తమ కొత్త ఇంటికి బండిలో వచ్చాడు. కమలకోసం కొన్న చంద్రహారం తీసి చేత బట్టుకుని అతను వాకిలిదగ్గిర బండిదిగాడు. బండి చప్పుడు విని కమల బయటికి వస్తుం దనుకున్నాడు, కాని ఆమె రాలేదు.

వాకిలిదగ్గిర గాఢ నిద్రలో ఉన్న మోహనుణ్ణి లేపి, ''అమ్మగారెక్కడరా?" అని అడిగితే, వాడు నిద్రమత్తుతోనే, ''ఇంట్లో ఉన్నారు,'' అనేసి మళ్ళీ నిద్రపోయాడు.

వాకిలి తలుపు దగ్గిరిగా వేసిఉన్నది. లోపలికి వెళ్ళిచూస్తే కమల ఎక్కడా లేదు. అతను బయటికి వచ్చేసరికి పట్టంచుబట్టలు ధరించి ఉమేశుడు వచ్చాడు.

''మీ అమ్మ ఎక్కడరా?" అని రమేశు డడిగాడు.

"నిన్న ఇక్కడే ఉంది," అన్నాడు ఉమేశుడు.

"నువ్వెక్కడి వెళ్లావ్?"

"శ్రీపతి బాబుగారింట్లో నాటకమైతే చూడమని అమ్మ పంపింది.''

బండివాడు డబ్బులిచ్చి పంపెయ్యమని తొందర చేస్తున్నాడు. రమేశు డా బండిలోనే ఎక్కి చక్రవర్తిగారింటికి వెళ్లాడు. అక్కడ గందరగోళంగా ఉంది. కిందటి రాత్రి ఉమకు అకస్మికంగా జబ్బు చేసింది. రాత్రల్లా ఎవరికీ నిద్రలేదు. కమల ఉమ దగ్గిరే ఉండి ఉంటుందనుకున్నాడు రమేశుడు.

రమేశుడు అక్కడే కొంత సేపు కూర్చున్నాడు. ఉమకు కాస్త బాధ తగ్గి నిద్ర పట్టింది. అప్పుడు కమల ఆ ఇంటలేదన్న సంగతి బయటపడింది. నిన్న సాయంకాలమే కమల కొత్త ఇంటికి వెళ్లిపోయింది. ఆమె ఏమైనట్టు?

అన్నపూర్ణ భర్త బిపిన్‌ను బండిలో ఎక్కించుకుని రమేశుడు కొత్త ఇంటికి వచ్చాడు. విచారించాగా, ఆమెను ఆఖరున చూసిన వాడు మోహనుడేనని తేలింది.

''నిన్న సాయంకాలం అమ్మగారు గంగా స్నానానికి బయలుదేరారు. నేను వెంటవస్తానంటే, వద్దనీ, ఇల్లు చూస్తుండమనీ చెప్పి, నా చేతిలో రూపాయి పెట్టారు. తరవాత ఇటుగా కల్లుకడవ తెస్తుంటే వాడి దగ్గిర కొంచెం కల్లుకొని తాగాను. ఆ తరవాత ఏం జరిగిందీ నాకు తెలీదు," అన్నాడు మోహనుడు.

కమల స్నానానికి ఎటుగా వెళ్ళినదీ వాడు చూపాడు. రమేశుడూ, బిపినుడూ, వాళ్ళతోబాటు ఆవును పోగొట్టుకున్న లేగలాగా ఉమేశుడూ బయలుదేరారు. ఉమేశుడు అన్ని పక్కలా చూస్తూ. "అమ్మా, ఎక్కడున్నావ్? పలకవేం?" అంటూ గొంతెత్తి కేకలు పెట్టాడు.

వాడికి అంతదూరాన తళతళలాడుతూ నేలమీద ఏదో కనిపించింది — పట్టుచేతిరుమాలుకు కట్టి ఉన్న తాళపుచెవులగుత్తి. ఆ తాళపు చెవులను వాడు గుర్తుపట్టాడు ఆవి కమలవే. అవి పడి ఉన్న చోటికి దగ్గిరలోనే తడి ఇసుకలో చిన్న పాదాల గుర్తులున్నాయి. లోతులేని నీటిలో మెరుస్తూ బంగారు గొలుసు కనబడింది. అది ఒకప్పుడు రమేశుడు కమల కిచ్చినదే.

లక్షణా లన్నిటిని బట్టి కమల గంగాప్రవేశం చేసినట్టు స్పష్టమవుతున్నది.

ఉమేశుడు, "అమ్మా! అమ్మా!" అంటూ నీటిలో చేతులుపెట్టి వెతుకుతున్నాడు.

"అదేం పనిరా? రా ఇవతలికి!" అని బిపిను డన్నాడు.

"నే నెట్లా వచ్చేది? ఇందులోనేక్కపడిచస్తా! అమ్మా, అమ్మా! ఎక్కడి వెళ్ళావ్? న న్నెందుకు తీసుకుపోలేదు?'' అంటూ ఉమేశుడు మతిచెడి ఏడవసాగాడు. వాడికి ఈతవచ్చు. అందు



"చేతులు విరగ్గొడితే విరగ్గొట్టింది కానీ నేను ఓ నెల రోజులు వంట చెయ్యక్కర లేదోచ్; ఆ తరువాత దీపావళికి ఏ కాకరపువ్వొత్తుతోనో చెయ్యి కాల్చుకుంటే ఇంకో నెలరోజులు చెయ్యక్కర్లేదు"

---

చేత నీటిలోపడి చావటం వాడికి సాధ్యంకాలేదు. వాడు ఇవతలికి వచ్చి, ఇసుకలో పొర్లుతూ ఏడ్చాడు.

"రమేశబాబూ, పదండి, ఇక్కడ చేసేటందు కేముందీ? పోలీసు వాళ్ళకి చెప్పాలి, వాళ్లు వెతకాలి." అన్నాడు బిపినుడు.

ఆరోజు చక్రవర్తిగారిల్లు శోకసముద్రం లాగుంది. బేస్తలు చాలా మేర వలలు పన్ని వెతికారు. పోలీసులు కమలలాంటి మనిషి కోసం ఆరాతీశారు.

రమేశుడికి గుండె చెదిరిపోయింది. అతని జీవితంలో ఒకభాగం పడిపోయినట్టయింది. సూర్యాస్తమయంవేళ అతను గంగాతీరానికి వచ్చి, తాళపుచెవులు దొరికినచోట నిలబడి, చంద్రహారాన్ని ప్రవాహంలోకి విసిరివేశాడు. ఆ తరవాత అతను చక్రవర్తిగారింట ఎవరికీ చెప్పకుండా ఘాజీపూరు వదిలేసి వెళ్ళిపోయాడు.

అతను దేశదిమ్మరిలాగా చాలా ఊళ్ళు తిరిగాడు. చివర కతను కలకత్తాచేరి, అన్నదబాబు ఇంటివద్దకువెళ్ళి, జోగేంద్రుడు విష్ణుపురంలో ఒక జమీందారుగారి స్కూలుకు హెడ్‌మాష్టరుగా పని చేస్తున్నట్టు రామ్‌ధన్‌ద్వారా తెలుసుకున్నాడు. అతను విష్ణుపురం వెళ్ళి, ఒక దుకాణంలో కూర్చుని, తన నొకసారి కలుసుకోవలిసిందిగా జోగేంద్రుడికి చీటీ పంపాడు.

జోగేంద్రు డొకప్పుడు తిట్టినా, రమేశుడు వచ్చాడనగానే అతనికి ప్రాణం లేచినట్టయింది. అతను చీటీ తెచ్చిన మనిషివెంట దుకాణానికివెళ్ళి, రమేశుడి చేతులు పట్టుకుని, "ఇంతకాలం ఎక్కడ ఉన్నావు? కనిపించనే లేదేం? ఈ దుకాణంలో దేనికి? ఇంటికిపోదాం పద!" అని, అతన్ని తన ఇంటికి తీసుకుపోయాడు.

అతను రమేశుడికి తన కష్టాలన్నీ చెప్పుకున్నాడు, జమీందారుకూ, అతనికీ పడటంలేదు. రోజూ తనచేత పేపరు చదివించుకుంటాడు. అక్కడి మేస్ట్రీటు తనకు స్నేహితుడు కావటంవల్ల ఏమీ చెయ్యలేకుండా ఉన్నాడుగానీ. మేస్ట్రీటు బదిలీ అయిన మరుక్షణం తనని ఉద్యోగంలోంచి లాగేస్తాడు.

ఆ సాయంకాలం భోజనాలయాక రమేశుడు తాను వచ్చినపని నిర్వర్తించాడు. అతను జోగేంద్రుడితో తన సంగతంతా చెప్పేశాడు. "ఆనాడు నువ్వడిగినప్పుడీ విషయాలే చెప్ప నిరాకరించాను," అన్నాడతను.

"ఆనాడు చెప్పినా నేను నమ్మివుండేవాణ్ని కాను." అన్నాడు జోగేంద్రుడు. అతను తన ప్రవర్తనకు రమేశుణ్ణి క్షమాపణ వేడుకున్నాడు.

ఇద్దరూ ఆనందంతో కౌగలించుకున్నారు.

"ఇలాటి విషమస్థితిలో ఎందుకు పడ్డానో తెలీదు, కమల ఎందుకు ఆత్మహత్య చేసుకున్నదో తెలీదు. మృత్యుదేవత మాకు ఎడబాటు కలిగించకపోతో నేను తప్పక పాపకూపంలో పడే ఉందును. అది తలచుకుంటే ఒళ్ళంతా కంపర మెత్తుతుంది." అన్నాడు రమేశుడు.

"ఎవరు చూశారు? కమల బతికే ఉండవచ్చు. మీరిద్దరూ బయటపడ్డారు, అదే చాలు," అన్నాడు జోగేంద్రుడు.

అతని కిప్పుడు పట్టుకున్నది హేమనళినిని కమలనయనుడి నుంచి కాపాడే సమస్య.

"హేమకూ, నీకూ పెళ్ళి కాకుండా నేనే పడగొట్టాను. నా చేతి మీదుగానే మీకు పెళ్ళి జరగాలి," అన్నా డతను.

## 17

అన్నదబాబు వాళ్ళు లేని సమయంలో అక్షయు డప్పుడప్పుడూ అటుకేసి వెళ్ళి ఇల్లు చూస్తుండేవాడు. రమేశుడు వచ్చాడనీ, అతను ఘాజీపూరులో వకీలుపని చేస్తున్నాడనీ రామ్‌ధన్ చెప్పగానే అతను కలవరపడ్డాడు. అతను ఘాజీపూరులో వకీలుగా ఉంటున్న సంగతి ఇంతకాలం ఎందుకు రహస్యంగా ఉన్నదో, ఆ పని మానేసి అతను అన్నదబాబుగారింటికెందుకు వచ్చాడో అక్షయుడికి అంతు చిక్కలేదు. అన్నదబాబూ, హేమనళినీ కాశీలో ఉంటున్నట్టు రమేశుడికి తెలిసితీరుతుంది. అతను వారి దగ్గిరికి వెళ్ళి తీరుతాడు. అందుచేత అక్షయుడు ఘాజీపూరు వెళ్ళి, రమేశుడి రహస్యాలన్నీ సమగ్రంగా తెలుసుకుని, కాశీకివెళ్ళి అన్నదబాబుకు చెప్పాలని నిశ్చయించుకున్నాడు.

అతనికి ఘాజీపూరులో రమేశబాబనే వకీలు గురించి చెప్పిన వారే లేకపోయారు, చివర కొక ప్లీడరు, "రమేశబాబనే బెంగాలీ అతను చక్రవర్తిగారింటో ఉండేవాడు. ఇప్పు డెక్కడున్నాడో తెలీదు. కొన్నాళ్ళక్రితం అతని భార్య ఎటో వెళ్ళిపోయింది — ఒకవేళ గంగలో పడి చచ్చిపోయిందేమో కూడా," అన్నాడు.

అక్షయుడు చక్రవర్తిగారింటికి వెళ్ళాడు. అతను కమలా రమేశుల పేరు ఉచ్చరించటమే తడవుగా ఇంటిల్లిపాదీ కంట తడి పెట్టుకున్నారు. "కమలను నా కూతురులాగా చూసుకుంటున్నాను.



"ఈ ఆపరేషన్ చెయ్యటానికి 400 రూపాయిలౌతాయ్"
"200 రూపాయిలకి చెయ్యలేరా?"
"చెయ్యగలననుకోండి, కానీ అట్టే పదునైన కత్తులు వాడం."

రెండు రోజులు మాలో అనురక్తి కలిగించి ఆమె కాస్తా వెళ్ళిపోయింది," అన్నాడు చక్రవర్తి.

"ఎందుకంటారు? రమేశుడామెను సరిగా చూడలేదేమో?" అన్నాడు అక్షయుడు.

"అయ్యో, ఏం చెప్పమంటారు. మీ రమేశుడు పైకి ఎంతో సజ్జనుడు, కాని అతనికి మనస్సు ఏ మాత్రమూ అంతు చిక్కలేదు. కమలలాటి భార్యను అతనెందుకు అనాదరణతో చూస్తూ వచ్చాడో ఇప్పటికి కూడా నాకు అంతుచిక్కలేదు. మా అన్నపూర్ణతో కమల ఎంతో స్నేహంగా ఉండేది, కాని దానితో కూడా తన కష్టం ఒక్కటీ చెప్పుకుని ఎరగదు. పాపం, బాధ భరించరాక ఆత్మహత్య చేసుకుని ఉంటుంది. నేను అలహాబాదు వెళ్ళకపోతే ఇలా జరిగి ఉండునా?" అన్నాడు.

"చక్రవర్తిబాబూ, కమల ఆత్మహత్య చేసుకున్న దనుకోను. ఇక్కడికి కాశీ దగ్గిరేగద. అక్కడ మాకు తెలిసిన వాళ్ళున్నారు. అక్కడి కేమైనా వెళ్ళిందేమో!" అన్నాడు అక్షయుడు.

"రమేశుడీ సంగతి ఎన్నడూ చెప్పలేదే! చెబితే ఇలా చేతులు కట్టుకు కూర్చుంటానా?"

"మనం కాశీకి పోదాం పదండి. అక్కడ కమలజాడ తెలియవచ్చు."

చక్రవర్తి సంతోషంతో అక్షయుడివెంట కాశీకి బయలుదేరాడు.

అన్నదబాబు కాశీనగరం వెలపల ఒక బంగళా అద్దెకు తీసుకుని అందులో ఉంటున్నాడు. హేమనళిని రోజూ స్నానం చేసి శుచిగా కమలనయనుడితల్లి ఇంటికివెళ్ళి ఆమెకు పరిచర్యలుచేస్తూ ఉండేది.

కమలనయనుడి తల్లికి కల్యాణీబాయి సనాతనాచారాలతోబాటు శౌచమంటే చాలా పట్టుదల. తానెన్నడూ అశౌచంగా ఉండదు, ఇతరులుంటే సహించదు. జ్వరం ఉండి కూడా గంగాస్నానాలు చెయ్యటంచేతనే ఆమెకు రోగంవచ్చింది. అన్నదబాబు కాశీచేరేనాటికది ఇంకా నయంకాలేదు. హేమనళిని శుశ్రూషలవల్ల కల్యాణీబాయికి కొంచెం స్వస్థత చేకూరసాగింది. అన్నదబాబు వచ్చి ఆమెకు పథ్యపు వంటచేసిపెతూండేవాడు. హేమనళిని ఆమె పక్కను అతిశుభ్రంగాఉంచి, దానిపక్కనే పూలు అమర్చుతూండేది. ఇలాటి పనులన్నీ చెయటానికి ఒక పనిమనిషిని పెడదామని కమలనయను డనుకున్నాడు గాని, పనివాళ్ళు ఏ పనీ శుభ్రంగా చెయ్యరనీ, డబ్బు దండుగనీ తల్లి పడగొట్టేసింది.

కల్యాణీబాయికి హేమనళినిపైన ఆరోజు కారోజు అభిమానం జాస్తి కాసాగింది. తన కొడుకు ప్రభావంచేత ఆమె యోగినిలాగా కఠిన వ్రతాల నవలంబిస్తున్నట్టు తెలిసి, "జీవితం సుఖంగా గడపవలిసిన ఈడులో నీకీ కఠినాచారాలెందుకమ్మా? నాకోసం నా కొడుకు మారిపోయి సన్యాసిలాగా అయితే వద్దన్నాను. విన్నాడుకాడు," అన్నదామె.

ఆమె హేమకు స్వయంగా మంచిమంచి చీరెలు కట్టేది. అందంగా తలదువ్వేది, తనకొక అందమైన కోడలు రావాలని ఆమె ఎప్పుడూ కలలుకంటూ ఉండేది.

తనతల్లి కాస్త స్వస్థత కలగాలనే మళ్ళీ కఠినవ్రతాలు ప్రారంభించి తిరిగి జ్వరం తెచ్చుకునేసరికి, కమలనయనుడు, "అమ్మా నీ శరీరంలో శక్తిలేదు. ఈ కఠిన నియమాలు మాని కొంతకాలం పాటు రోగం ఉన్నట్టుగానే ఉండాలి," అన్నాడు.

"నేనిక నీమాట వినబోవటంలేదు. త్వరగా పెళ్ళాడి నాకు కోడలిని తెచ్చిపెట్టు," అన్నది తల్లి. కమలనయనుడు మాట్లాడలేదు. "ఇంక నే నెంతోకాలం బతకను. నా కోరికలన్నీ తీరాయిగాని, కోడలిని తెచ్చుకుని, తరిఫీదిచ్చి, మీ రిద్దరూ కాపరంచేస్తుంటే చూసి ఆనందించాలన్న కోరిక తీరేటట్టులేదు," అన్నదామె.

"నీకూ, నాకూ నచ్చేపిల్ల దొరకవద్దా, అమ్మా?" అన్నాడు.

"అదంతా నాకు వదిలెయ్యి," అన్నది తల్లి.

అన్నదబాబు వచ్చినప్పుడు కల్యాణీబాయి ఆయనతో, "మీ పిల్ల చాలా మంచిది. అదంటే నాకెంతో ఇష్టం. మావాడు చాలా బుద్ధిమంతుడు. డాక్టరుగా కూడా పేరు తెచ్చుకున్నవాడు, ఇంతకన్న మంచి అల్లుడు మీకు దొరకడు," అన్నది.

"అంతకంటె నాకు కావలిసిందేమిటి? కాని కమలనయనుడి అభిప్రాయం—" అన్నాడు అన్నదబాబు సంతోషంతో పొంగిపోతూ.

"వాడు సరేనంటాడు. నే చెప్పిననట్టు వింటాడు. మీ అమ్మాయి నచ్చనివా డుంటాడా? వాళ్ళిద్దరి పెళ్ళి సాధ్యమైనంత త్వరగా జరిగితే బాగుండును. నా సంగతి రేపేమో అన్నట్టుంది."

అన్నదబాబింటికి వెళ్ళి ఈ శుభవార్త హేమనళిని చెవిన వేశాడు. ఆయన అనుకున్నట్టుగా ఆమె ఎగిరి గంతువెయ్యకపోగా, "ఛీ, ఛీ! అతను పెళ్ళిచెసుకోను," అని అక్కడినుంచి లేచి



పోయింది. హేమ ఇంకా రమేశుణ్ణి మరవలేదా అని ఆయన ఆశ్చర్య పడ్డాడు. ఆయన నయించకుండా భోజనం చేసి పడుకున్నాడు.

ఒకసారి రమేశుణ్ణి ప్రేమించిన హేమ తన ప్రేమను అతి భద్రంగా తన హృదయంలో పెట్టుకుని కాపాడుతూ వస్తున్నది. దాన్ని ఎవరు ఏ మాత్రం అవమానించినా ఆమె భరించలేదు. కమలనయనుణ్ణి ఆమె గురువుగా స్వీకరించింది. కాని అతన్ని పెళ్ళాడమంటే తన ప్రేమను తెంపేసుకో మన్నట్టే అయింది. ఆమె బాధపడింది.

"నీకు పెళ్ళి ఏర్పాట్లు చేసేశాడు," అని కమలనయనుడితో తల్లి అన్నది.

"ఇంతలోనే?" అన్నాడు కొడుకు.

"హేమనళిని నాకు నచ్చింది."

"ఆమెను పెళ్ళాడటం అసంభవం."

"ఏం?...ఈసారి నీ అభ్యంతరాలు వినదలచలేదు. నీ యౌవనం సన్యాసంతో గడవటానికి నే నొప్పుకోను."

తప్పనిసరి అయి కమలనయనుడు తల్లికి తన కథ చెప్పేశాడు. తొమ్మిది నెలల కిందటి సంగతి. అతను రంగపురంనుంచి బయలు దేరి, బోటులో కలకత్తాకు ప్రయాణమయాడు. ఒకనాడు బోటు ఒడ్డుకు పట్టించి, స్నానం చెయ్యటానికి దిగేసరికి, అతని స్నేహితుడు భూపేంద్రుడు తుపాకీతోసహా ప్రత్యక్షమయాడు. అతను మేజిస్ట్రేటుగా ఉంటూ టూర్ చేస్తున్నాడు; కమలనయనుణ్ణి కూడా తన వెంట తిప్పసాగాడు. ఒక సమయంలో వాళ్ళు ధర్మ పుష్కరం దగ్గిర కాంపు వేశారు. అదొక చిన్న ఊరు. అక్కడి పాఠశాల చూడబోయారు. ఆ పాఠశాల తారిణీచరణబాబనే ఆయన ఇంట్లో ఉన్నది. తారిణీచరణుడు పరమలోభి అనీ, కమల అనే తన మేనగోడలి చేత గొడ్డుచాకిరి చేయించుకుంటూ, దిక్కులేని ఆ పిల్లను ఖర్చులేకుండా పెళ్ళి చేయచూస్తున్నా డనీ, కమల పేరుకు తగ్గట్టే అందంగా ఉంటుందనీ, ఊళ్ళోకి వచ్చిన ప్రతి బ్రాహ్మణ యువకుణ్ణీ, "మా కమలను పెళ్ళాడు." అని తారిణీచరణు ప్రాధేయ పడుతున్నా డనీ, ఇప్పు డా లోభిదృష్టి తనపైన పడిందనీ కమల నయనుడు తన మిత్రుడి ద్వారా విని కమలను పెళ్ళాడటానికి ఒప్పు కున్నాడు. అతను పిల్లను చూడనుకూడా లేదు. పెళ్ళి జరిగి పోయింది. తరవాత అతను పెళ్ళికూతురుతోసహా పడవ ఎక్కి వచ్చేస్తుండగా తుపాను వచ్చి పడవ మునిగింది. అతనికి తెలివి వచ్చేసరికి పడవా లేదు, పెళ్ళి కూతురూ లేదు. పోలీసులతో చెబితే వారు కూడా సహాయం చెయ్యలేకపోయారు.

మొట్టమొదటిసారిగా ఈ కథ వింటున్న కల్యాణీబాయి చాలా బాధపడింది. "ఇలా అయిందని మళ్ళీ పెళ్ళాడవా?" అన్నదామె.

"నా భార్య బతికేఉంటే?"

"ఉంటే దొరక్కుంటుందా?"

"నా సంగతి ఆమె కేం తెలుసు? నే నెవరో, ఏ ఊరి వాణ్ణో కూడా ఆమెకు తెలీదు. నా మొహం కూడా చూసి ఉంటుం దనుకోను."

"ఇంతకూ ఏం చేద్దామనుకుంటున్నావు?"

"ఒక్క సంవత్సరం చూసి, ఆమె జాడ తెలియకపోతే మళ్ళీ పెళ్ళిమాట ఆలోచిద్దామనుకుంటున్నాను. ఇంకెంత? మూడు నెల్లేగా!"


## 18

ఆనాడు కమల గంగానదికి వెళ్ళి, అస్తమించే సూర్యుడికి నమ స్కరించి, గంగాజలం నెత్తిన చల్లుకుని, మోకాలులోతు నీటిలో నిలబడి గంగకు పుష్పమాల అర్పించింది; తాళపుచెవులు ఒడ్డున పారేసింది. రమేశుడిచ్చిన బంగారుగొలుసు నీటిలో విడిచింది. తరవాత ఆమె పడమటిదిక్కుపట్టి గంగవెంబడే నడవసాగింది.

రమేశుడు హేమనళినికి రాసిన ఉత్తరం వల్ల ఆమెకు తన భర్తను గురించి రెండు విషయాలు తెలిశాయి. తన భర్తపేరు కమలనయనుడు; అతను రంగపూరులో డాక్టరుగా ఉంటూండేవాడు.

అమావాస్యకు ముందు రోజులు, కటికచీకటి. ఆమెకు ఇసుక తెలుపుతప్ప ఇంకేమీ కనిపించటం లేదు. ఒక రాత్రివేళ ఆమె ఒక ఊరును దాటివెళ్ళి, అలసిపోయి ఒక చెట్టుకింద పడుకుని నిద్రపోయింది. అరుణోదయం వేళ ఆమె నిద్రలేచేసరికి ఆమె దగ్గిర ఒకస్త్రీ నిలబడి ఉన్నది. ఆమె కమలను ఎన్నో ప్రశ్నలు వేసి, ఆమె దిక్కులేనిదనీ, పని పాటలు చాతయినదనీ తెలుసు కుని కమలను తనవెంట రమ్మన్నది.

ఆమె శ్రీపతిబాబు బంధువురాలు. నివాసం కాశీ, ఆమెపేరు మహామాయ, భర్తపేరు ముకుందదత్తు. ఘాజీపూరులో పెళ్ళికి వచ్చి పడవలో తిరిగి కాశీకి వెళుతున్నది. ఇంటికి చేరుతూనే




ఆమె వంటచేసే కుర్రవాణ్ణి మాన్పించి, కమలను వంటకు నియోగించింది.

కమల చెయ్యిజారిపోతుందేమో నని మహామాయ, "ఈ కాశీ చాలా పాపిష్టి ఊరు. అందరూ తాగుబోతులూ, దొంగలూ, జారులూ, హంతకులూనూ. గడపదాటి వెళ్లేవు! గంగా స్నానానికీ, దేవాలయానికీ వెళ్ళాలంటే నా వెంట తీసుకుపోతాలే," అన్నది. ఆమె కమలచేత పగలంతా వెట్టిచాకిరి చేయించుకుని, రాత్రిపూట పోచుకోలు కబుర్లు చెప్పేది.

ఆ ఇంట్లో ఖైదీలాగా ఉండటం కమలకు దుర్భరమై, బయట పడా లనిపించింది. ఒకనాడు ముకుందబాబుకు జబ్బుచేసింది. తన యజమానురాలు నౌకరును పిలిచి, "ఒరేయ్, డాక్టరు కమలనయనబాబుగారిని ఒక్కసారి పిలుచుకు రారా!" అనటం కమల చెవుల పడింది. నౌకరు బయటికి వెళ్ళేటప్పుడు కమల వాణ్ణి ఆపి, "ఎక్కడికి పోతున్నావు? ఎవరా డాక్టరు? వారిల్లెక్కడ?" అని అడిగి, కమలనయనుడి ఇల్లు ఒకమైలుదూరంలో ఉన్నట్టు తెలుసుకున్నది.

నౌకరు డాక్టరును వెంటపెటుకు రా లే దు. డాక్టరు తల్లికి జబ్బుగా ఉన్నదనీ, ఆమెను కనిపెట్టి ఉండేటందుకు కోడలు కూడా లేదనీ, డాక్టరుకింకా పెళ్ళి కాలేదనీ కమలతో నౌకరు చెప్పాడు.

తనభర్త సమీపంలోనే ఉన్నట్టు తెలిశాక కమల ఆ ఇంట ఒక్క క్షణం ఉండలేకపోయింది. బయటికి పోతానంటే మహామాయ ఒప్పుకోకపోగా నానామాటలూ అన్నది. పంపించెయ్యమంటే అదీ చెయ్యలేదు.

ఒకనాడు ముకుందబాబు మంచిగాలికి బండెక్కి వెళ్తూఉన్న సమయంలో ఎవరో వచ్చి, "ముకుందబాబుగారున్నారా?" అని కేక పెట్టారు.

"డాక్టరు కమలనయనబాబల్లే ఉంది, వెళ్ళి, బాబుగారు బయటికెళ్ళారని చెప్పు," అన్నది మహామాయ కమలతో.

కమల దీపంతీసుకుని కిందికి దిగివచ్చి, తలుపు తెరిచి, తలుపు చాటున నిలబడి, "బాబుగారు లేరు. ఇప్పుడే వస్తారు, లోపలికి దయచెయ్యండి," అన్నది. కమలనయనుడు లోపలికివచ్చి కూర్చున్నాడు. కమల చీకటిమాటున కూర్చుండి అతన్నే చూస్తున్నది. ఎంత అందంగా ఉన్నాడు! తనవంటి దౌర్భాగ్యురాలికి అలాటి భర్త! ఆమె హృదయం ఆనందంతో నిండిపోయింది. శరీరంలో ఒక రకమైన కంపనం పుట్టుకొచ్చింది.

కొంచెంసేపటికి ముకుందబాబు వచ్చాడు. అతనూ, కమలనయనుడూ కాస్సేపు మాట్లాడుకున్నారు. కమలనయనుడు వెళ్ళేటప్పుడు కమల దారిపక్కనే చీకటిలో నిలబడింది. అత నామెను చూడలేదు.

ముకుందబాబు భోజనానికి వెళ్ళాక కమల చావడిలోకివెళ్ళి తన భర్త కూర్చుండినచోట ధూళితీసి నెత్తికి రాచుకున్నది.

ముకుందబాబును ఆరోగ్యం నిమిత్తం ఎక్కడికైనా వెళ్ళమని కమలనయనుడు సలహా ఇచ్చాడు. మహామాయా, ముకుందబాబూ మర్నాడే ప్రయాణమవుతున్నారు. ఈ సంగతితెలిసి కమల, తనను కాశీలోనే ఉండనిమ్మని వేడుకొన్నది.

"కాశీ మరిగావా? ఎలా ఉంటావో చూస్తాను," అని మహామాయ అన్నది. ఆ రాత్రి ఆమె కమలను తన గదిలోనే పడుకోబెట్టుకున్నది. సామానంతా కమలచేతనే సర్దించింది. స్టేషనుకు పొయ్యేటప్పుడు తనతోనే బండిలో కూర్చోబెట్టుకున్నది.


ముకుందబాబు స్థలం మార్పుకోసం మీరట్ వెళుతున్నాడు. ఒక రాత్రివేళ తనకు పెద్దరోగం రావటమో, తను చచ్చిపోవటమో మరో ఉపద్రవమో వచ్చి ఈ ప్రయాణం వాయిదాపడాలని కమల ఎంతగానో ఆశించింది. కాని ఆ ఆశ ఫలించలేదు. అందరూ రైలులో ఎక్కి కూర్చున్నారు. కమల కిటికీవద్ద కూర్చుని బయటికి చూస్తుంటే, మహామాయ, "ఎగిరిపోదామనుకుంటున్నావు గామాలు పక్షిలాగా, నీకు రెక్కలులేవు," అన్నది.

రైలు మొగల్సరాయ్ స్టేషను చేరేసరికి జనసమ్మర్దంలో నుంచి ఉమేశుడు, "అమ్మా!" అని పిలవటం కమల చెవుల పడింది. కమల విప్పారిన ముఖంతో, సంతోషంగా, "ఉమేశ్!" అన్నది. ఉమేశుడు వచ్చి బండితలుపు తెరిచాడు. కమల కిందికి దిగింది. ఉమేశు డామెకాళ్లకు నమస్కారం చేశాడు. ఇంతలో పోర్టరువచ్చి, తెరిచి ఉన్న తలుపు మూసేశాడు.

"ఒసే, కమలా! త్వరగా ఎక్కు, బండి కదులుతున్నది," అని మహామాయ కేకలు పెట్టింది. కమలకు వినిపించలేదు. రైలు కదిలి వెళ్ళిపోనేపోయింది.

"ఎక్కడి నుంచి వస్తున్నావు?" అని కమల ఉమేశుణ్ణి అడిగింది.

"మాణీపూరు నుంచి."




"అక్కడంతా బాగున్నారా ? అన్నపూర్ణ ఎలాఉంది ?"

"నీకోసం అన్నమానం ఏడుస్తున్నది."

కమల తడికళ్లతో, "ఉమ నన్ను మరిచిపోయిందా?" అన్నది.

"నువ్విచ్చిన గాజులు చేతికిపెడితేగాని పాలు తాగదు."

"ఇక్కడి కెందు కొచ్చావు. ఎక్కడికి పోతావు."

"నువ్వెక్కడికి పోతే నేను అక్కడికే."

"నాదగ్గిర బోలెడుంది. నువ్విచ్చిన అయిదు రూపాయల్లో ఇది మిగిలింది," అంటూ తన దగ్గిర ఉన్న డబ్బులు తీసి ఉమేశుడు కమలకిచ్చాడు.

"మనం కాశీకి పోదాం, రెండు టిక్కెట్లు కొనుక్కురా."

ఇద్దరూ కాశీ స్టేషను చేరాక కమల, "ఎక్కడికి పోదాం ?" అన్నది.

"నేను భలే చోటికి తీసుకుపోతాను," అంటూ ఉమేశుడు కమలను బండిలో ఎక్కించి చక్రవర్తి ఉంటున్న ఇంటికి తీసుకుపోయాడు. కమల తన కాళ్లకు దణ్ణం పెడుతుంటే చక్రవర్తి నోట మాటరాలేదు. చివర కాయన, "కమలా, వచ్చావా నువ్వు? పూర్ణా, ఎవరొచ్చారో చూడు," అన్నాడు.

అన్నపూర్ణ వచ్చి కమలను ఆలింగనం చేసుకుంది. ఉమ వచ్చి కమల చంకనెక్కింది. మాసిన కమల బట్టలూ, తలా చూసి జాలి పడి అన్నపూర్ణ ఆమెచేత స్నానం చేయించి కట్టుకోవటానికి మంచి బట్ట లిచ్చింది.

చక్రవర్తి అక్షయుడివెంట కాశీకి ప్రయాణమయేటప్పుడు అన్నపూర్ణ, ఉమేశుడూ కూడా వెంటపడ్డారు. ఉమేశుణ్ణి ఆయన ఘాజీపూరుకు తిప్పి పంపేశాడు, కాని వాడక్కడ ఉండలేక మళ్లీ వచ్చేశాడు.

## 19

తన కొడుక్కు హేమనళినిని చేసుకుంటానని కల్యాణీబాయి అడిగినరోజు రాత్రి అన్నదబాబుకు కడుపులో శూల తీవ్రంగా వచ్చి బాధపడ్డాడు. తాను కమలనయనుణ్ణి పెళ్లాడటానికి అంగీకరించక పోవటమే అందుకు కారణమై ఉంటుందని హేమనళిని ఊహించింది.

మర్నా డాయన తన ఇంటిముందున్న పూలతోటలో కుర్చీవేసుకుని కూర్చుని ఉన్నాడు. హేమనళిని అతనికి టీ ఇస్తున్నది. ఆ సమయంలో అక్షయుడు చక్రవర్తిని వెంటబెట్టుకుని వచ్చాడు. లోపలికి వెళ్లిపోతున్న హేమనళినిని ఆగమని చెప్పి, అక్షయుడు చక్రవర్తిని అన్నదబాబుకు పరిచయం చేసి, "వీరు మీతో మాట్లాడాలని వచ్చారు," అన్నాడు.

"రమేశబాబు మీకు బాగా తెలుసు నని విన్నాను. అందుచేత అతని భార్య జాడ మీకేమన్నా తెలుసునేమో కనుక్కుందామని వచ్చాను." అన్నాడు చక్రవర్తి.

"ఏమిటి మీరనేది ? అతని భార్యా ?" అన్నాడు అన్నదబాబు.

హేమనళిని తలవంచి నేలకేసి చూస్తూ నిలబడింది.

చక్రవర్తి, తాను స్టీమరులో ఏవిధంగా రమేశుడితోనూ అతని భార్య కమలతోనూ పరిచయం పొందినదీ, వారు ఘాజీపూరు వచ్చి తన ఇంట కొంతకాలం ఉండటమూ, పిడుగు పడ్డట్టుగా ఒకనాడు కమల మాయంకావటమూ మొదలైనవి చెప్పి, కంట నీరుపెట్టుకున్నాడు.

"ఈసంగతులేవీ మాకు తెలీదు. కలకత్తా నుంచి వెళ్లాక రమేశబాబు మాకు ఉత్తరం కూడా రాయలేదు," అన్నాడు అన్నదబాబు.

"రమేశబాబుకు కమల అనే భార్య ఉన్నదని కూడా మే మెరగం," అన్నాడు అక్షయుడు, "ఒక వేళ కమల ఆత్మహత్య చేసుకోక కాశీకి వచ్చిందేమోనన్న ఉద్దేశంతో ఆయనను ఇక్కడికి తెచ్చాను."

అక్షయుడూ, చక్రవర్తీ వెళ్లిపోయాక అన్నదబాబు తన కూతురికేసి చూశాడు. చక్రవర్తి చెప్పిన విషయాలు విని కూతురెంత బాధ పడుతున్నదో నని ఆయన భయం. నిజానికి చాలా బాధపడింది. కాని మనసును నిగ్రహించుకుని పైకి రాయిలాగా కూర్చున్నది.

"మీరు డాక్టరుచేత పరీక్షించుకుని చికిత్స పొందాలి. మీ ఆరోగ్యం కొత్తిగా చెడుతున్నది." అన్న దామె, తనకు మరో విచారం లేనట్టు.

"సరే, కమలనయనుణ్ణి పిలిపిద్దాం," అన్నా డాయన.

"నిరభ్యంతరంగా పిలిపిద్దాం."

కమలనయనబాబు వచ్చి, అన్నదబాబును పరీక్షించి, "వీరి కేదైనా మానసికబాధ లేదుకద ? మాతల్లి జబ్బు కూడా ఇలాటిదే. మనస్సుకు శాంతిలేనంత కాలమూ మందులిచ్చి లాభంలేదు." అన్నాడు.

"మీ అమ్మగారిని కనిపెట్టి ఉండటానికి పనిదాన్ని పెట్టరాదా?" అన్నది హేమనళిని.

"ఆమె ఒప్పుకోదు, ఏ స్త్రీ పనివాళ్ళకు ఆచార వ్యవహారాల మాట తెలియదంటుంది.''

అతను వెళ్ళిపోయాక అన్నదబాబు తన కుమార్తెను కదిలించి చూశాడు.

''ఇవాళ వచ్చిన వృద్ధుడు చాలా మంచివాడు లాగున్నాడు. రమేశుణ్ణి గురించి ఆదివర కెవరేమన్నా నేను నమ్మలేదుగాని ఇవాళ_" అన్నాడాయన.

"ఆ విషయం వదిలెయ్యండి,'' అన్నది హేమనళిని.

"చర్చించాలని కాదు. ఒక మనిషి కష్టసుఖాలతో లంకె పెట్టుకున్నాక ఆ మనిషి మంచి చెడ్డల విషయంలో ఎలా నిర్లిప్తంగా ఉంటాం?"

"నాగురించి అనవసరంగా బాధపడకండి."

"తల్లీ, నా ప్రయాణం పూర్తి కావచ్చింది. నువ్విలా సన్యాసినిగా ఉండగానే నేను వెళ్లిపోవాలేమో ననే నా బెంగ. నీకు సౌఖ్యం సమకూరే మార్గం నాకు తెలుసు, నామాట వింటావా?"

"చెప్పండి నాన్నా. మీరేం చెయ్యమంటే అది చేస్తాను."

మర్నాడు తండ్రీకూతుళ్లు చెట్టు కింద కూర్చుని టీ తాగుతూండగా అక్షయుడు వచ్చి, "రమేశబాబు సామానంత చక్రవర్తిగారింట ఉన్నది. ఎక్కడికి పంపాలా అని ఆలోచిస్తున్నాడాయన. రమేశుడెప్పటికైనా ఇక్కడికి వచ్చితీరుతాడు గనక ఆ సామానంతా మీ దగ్గిరికి పంపితే_" అన్నాడు.

అన్నదబాబు కోపంగా, "నీకు కొంచెమైనా లోకజ్ఞానం లేదు, రమేశబా బిక్కడి కెందుకొస్తాడు? అతని సామాను నేనెందుకుంచుకుంటాను?" అన్నాడు.

"అదేమిటి? అతను బాధపడుతూ సానుభూతికోసం వచ్చేట్టయితే వెళ్లగొట్టుతారా? అతను మిత్రుల దగ్గిరికి రాకేంచేస్తాడు?" అన్నా డక్షయుడు.

"మమ్మల్ని బాధించటానికే ఇలా అంటున్నావు, నీ కో నమస్కారం. ఈ విషయం ఇంక తీసుకురాకు."

"క్షమించండి. మీ కింత కోపంవస్తుం దనుకోలేదు." అంటూ అక్షయుడు వెళ్లిపోయాడు.

అక్షయుడు రమేశుడి మిత్రుడు కాడని గ్రహించి చక్రవర్తి, అతను కనిపించినప్పుడు కమల చేరిందని చెప్పలేదు. ఈ లోపుగా కమల తన రహస్యమంతా అన్నపూర్ణకు చెప్పేసింది. రమేశుడు కమల అసలు భర్త కాడని తెలియగానే అన్నపూర్ణ, "ఎంత దారుణం! ఇంకా నయం, రమేశుడు పెద్దమనిషి కనక సరిపోయింది!" అన్నది.


*When in Hyderabad Stay at*

**TAJ MAHAL** Group of Hotels

for

Comfortable Accommodation with Modern Conveniences -
Excellent Vegetarian Food to suit all tastes
Clean & Courteous Service

HEAD OFFICE

## TAJ MAHAL HOTEL

88 - Sarojini Devi Road, Secunderabad A. P.

Telegrams: 'COURTESY'

Telephones Office: 73171
Connecting all Rooms: 72561

BRANCHES

TAJ MAHAL HOTEL
King Kothi Road (Abid Road)
HYDERABAD A. P.

Tele Grams. 'COURTESY'
Tele Phone. 35591-Office
33401-3 lines
(Connecting all rooms)

TAJ MAHAL CAFE
Narayanguda (Himayatnagar)
HYDERABAD A. P.

Tele Grams. 'TAJ CAFE'
Tele Phone. 33466-Office
32136 3 lines
(Connecting all rooms)

చక్రవర్తికి కూడా సంగతంతా తెలిసింది. అన్నపూర్ణ సూచించిన మీదట ఉమకు వైద్యం చేయించటానికి చక్రవర్తి కమలనయనుణ్ణి తీసుకు వచ్చాడు. అతను రోజూ వచ్చి ఉమను చూసిపోసాగాడు. ఈ విధంగా కమల తన భర్తను రోజూ చూడగలిగింది.

ఒకనాడు చక్రవర్తి కమలనయనుడికోసం వెళితే అతను ఇంట్లోలేడు.

"డాక్టరుగారు లేకపోతేనేంలే, ఒక ముసలి బ్రాహ్మడు తమ దర్శనం కోసం వచ్చాడని వారి తల్లిగారితో చెప్పు," అన్నాడు చక్రవర్తి నౌకరుతో.

"మీ అబ్బాయిగారు నా మనమరాలికి వైద్యం చేస్తున్నారు. వారు లేరంటే తమ దర్శనమైనా చేసుకుందా మనుకున్నాను," అన్నాడాయన కల్యాణీబాయితో.

కూర్చోండి. కాస్త ఫలహారం తెప్పిస్తాను. భోజనమే పెడుదును గాని ఇవాళ ప్రత్యేకంగా వంట ఏమీ లేదు," అన్నది కల్యాణీబాయి.

''నన్ను చూడగానే భోజన ప్రియుణ్ణని అందరూ ఇట్టే గ్రహిస్తారు. ఇవాళ కాకపోతే మరోరోజు వచ్చి భోజనం చేస్తాను. మీ మనిషిని పంపారంటే మా ఇల్లు చూపిస్తాను."

అది మొదలు చక్రవర్తి వస్తూ పోతూ కల్యాణీబాయితో బాగా పరిచయం కలిపాడు. ఒకనా డాయన కమలను దశాశ్వమేధ ఘట్టానికి తీసుకుపోయి, స్నానం చేయించి, మరొకదారిన తిరిగి వస్తూంటే కల్యాణీబాయి స్నానంచేసి గంగాజలం తెస్తూ కనిపించింది.

"అమ్మా, వారికి నమస్కారం చెయ్యి. డాక్టరుబాబుగారి తల్లిగారు," అన్నాడు చక్రవర్తి కమలతో.

తన కాళ్ళకు నమస్కారం చేసిన కమలతో, ''ఎవరివమ్మా ? ఏదీ నీ మొహం చూడనీ !'' అంటూ ముసుగుతీసి చూసి, ''ఆహాహా ! సాక్షాత్తూ లక్ష్మీదేవి ! నీ పేరేమమ్మా ?" అన్నది.

"దీని పేరు సతి. నాకు దూరపు బంధువు. దీని తండ్రి నాకు వరసకు అన్న అవుతాడు. తల్లిదండ్రు లిద్దరూ లేరు. దీని పోషణ భారం నాపైనబడింది," అన్నాడు చక్రవర్తి.

"ముందు మన ఇంటికి పోదాం పదండి," అన్నది కల్యాణీబాయి.

సమయానికి కమలనయను డింట్లోలేడు. కమలను గురించి చక్రవర్తిగారు ఇంకా ఇలా చెప్పారు. "పాపం, ఇది నష్టజాతకురాలు. పెళ్ళి అవుతూనే మొగుడు సన్యాసిఅయి ఎటో వెళ్ళిపోయాడు. తన భర్త మొహం కూడా దానికి తెలీదు. తీర్థాలు సేవిస్తానంటుంది. నే నా, ఉద్యోగపు రాళ్ళతో పొట్టపోసుకునే దరిద్రుణ్ణి. కాశీలో నివాసం పెట్టటం నా తరమా ? కనక నా మనవి ఏమంటే, దీన్ని మీ దగ్గరే ఉంచుకోండి. అదీ సుఖపడుతుంది, నేనూ సంతోషిస్తాను. అది ఎటువంటి మనిషో రెండు మూడు రోజుల్లో మీకే తెలుస్తుంది."

Grams: PRESUNDRY

Phone: 23019, 23526

*With the Best Compliments of*

**K. ORR & COMPANY**

16, Stringers Street

MADRAS - 1

కల్యాణీబాయి కమలను తన వద్ద శాశ్వతంగా ఉంచుకోవటానికి వెంటనే ఒప్పుకున్నది.

"మా ఇంట్లో నేనూ, మావాడూ తప్ప మరెవరూ లేరు. వాడు చాలా సజ్జనుడు," అన్నదామె.

"నాకు చెప్పాలా ? పాపం, అతని భార్య పెళ్ళవుతూనే నదిలో మునిగిపోయిందిట. అది మొదలు అతను బ్రహ్మచర్యం అవలంబించి ఉంటున్నాట్ట," అన్నాడు చక్రవర్తి.

"అదంతా జ్ఞాపకం చెయ్యకండి. నాకు కంపరమెత్తుతుంది."

కమలను అక్కడే దిగవిడచి చక్రవర్తి వెళ్ళిపోయాడు.

ఆమెకు తన ఇంట ఎలా సుఖంగా జరుగుతుందా, ఆమెకు వ్యాపకాలేమి కల్పించాలా అని కల్యాణీబాయి ఆలోచించింది. తాను ఇంటిపనులన్నీ చేస్తాననీ, వంట చెయ్యగలననీ కమల చెప్పింది. తల్లికి అస్వస్థత కలిగినప్పటినుంచీ కమలనయనుడే వంటచేస్తున్నాడు. ఇప్పుడా పనిని కల్యాణీబాయి కమలకు అప్పగించింది.

కమలనయనుడు వచ్చి, వంట ఇంట్లో అలికిడి విని, తన తల్లి వంటచేస్తున్నదనుకుని లోపలికి వచ్చి కమలనుచూసి ఆశ్చర్యపోయి, అవతలికి వెళ్ళాడు.

కల్యాణీబాయి తన పూజ ముగించుకుని వచ్చి వంటఇంట్లో చూసేసరికి వంట సిద్ధంగా ఉన్నది. వంటఇల్లు పరిశుద్ధంగా ఉన్నది.

ఆమె తన కొడుక్కు వడ్డిస్తూ భోజనం పెట్టింది.



"వంట ఎలా ఉంది ?" అని ఆమె కొడుకు నడిగింది. అతను ఏం పెట్టినా మాట్లాడకుండా తినేస్తాడు. అందుచేత తల్లి మామూ


అన్ని విధములైన అచ్చు పనులు

ఆఫ్‌సెట్ ప్రింటింగ్, వార్నిషింగ్ మరియు

కార్టన్ మేకింగ్ మొదలైన పనులు

అతి చక్కగా అనుకున్న గడువులో

అందజేయగలం

వెంకటేష్ ప్రెస్

గౌలిగూడ, హైదరాబాదు

ఫోన్: 44104

లుగా ఆ ప్రశ్న వెయ్యదు. కాని ఇవాళ తన వంట కాదుగనక అడిగింది. ఆ రోజు వంట కొత్తమనిషి చేసిన సంగతి అతనికి తెలియదని ఆమె ఉద్దేశం.

కమలనయనుడు ఉత్సాహంగా, ''చాలా రుచిగా ఉంది.'' అన్నాడు. చాటునుంచి వింటున్న కమల ఈ మాటలకు పారవశ్యం చెందింది.

సాయంకాలం కమలకు కల్యాణీబాయి స్వయంగా తలదువ్వి, బొట్టుపెట్టింది. అటువంటి కోడలు తనకు దొరికితే ఎంతబాగుండునని ఆమె కనిపించింది.

ఆ రాత్రే ఆమెకు మళ్ళీ జ్వరం తలిగింది. ఎక్కడికైనా వెళ్ళి కొన్ని రోజులుండి వస్తే మంచిదని కమలనయను డన్నాడుగాని ఆమె ఒప్పుకోలేదు. అతను వెళ్ళగానే కమల ఆమె పాదాలు వత్తుతూ కూర్చున్నది.

“చాల్లే అమ్మా, నా కొడుకు పక్కగదిలోనే పడుకుంటాడు. తెల్లవార్లూ నిద్రలేకుండా నాకు సేవచెయ్యటం వాడి కలవాటే. నువు వెళ్ళి పడుకో,” అన్నది కల్యాణీబాయి.

మర్నాడు ఇంటిపని అంతా తనపైనే వేసుకున్నది కమల. ఇంటి ముందుభాగంలో కమలనయనుడు ఉపాసన చేసేగది ఉన్నది. మధ్యాహ్నం వేళ అతనక్కడ విశ్రమిస్తాడు. ఇవాళ ఉదయం అతనక్కడికి వెళ్ళేసరికి గది అంతా శుభ్రంచేసి ఉన్నది, ఇత్తడిపాత్ర బంగారు పాత్రలాగా ధగధగలాడుతున్నది. పుస్తకాలన్నీ సర్దిపెట్టి ఉన్నాయి. అతనెంతో సంతోషించాడు.

తెల్లవారుతూండగానే కమల గంగాజలంతోసహా కల్యాణీబాయి వద్దకు వచ్చింది. తన పినతండ్రి ఇంటినుంచి పనివాడు వచ్చి తనకు తోడుగాఉండి గంగాస్నానానికి తీసుకుపోయాడని కమల చెప్పింది.

వాణ్ణి పిలిపించి కల్యాణీబాయి, “నీపేరేమిటి?” అని అడిగింది.

“ఉమేశుడు,” అంటూ వాడు విష్టారణంగా నవ్వాడు.

వాణ్ణి వెంటఉంచుకోమని కమలకు కల్యాణీబాయి చెప్పింది. ఇద్దరూ కలిసి ఇంటిపని అంతా క్షణంలో చేసేశారు.

ఒక బీరువాలో కమలకు కమలనయనుడి పాదుకలు కనిపించాయి. ఆమె వాటిని తన నెత్తిన పెట్టుకున్నది, వాటిని తన చీరె కొంగుతో తుడిచి ఎప్పటిచోట పెట్టేసింది.

సాయంకాలం మూడు గంటలకు హేమనళిని పూలు తీసుకుని వచ్చింది. కల్యాణీబాయి ఆమెను ఆదరంతో కూర్చోమని, కమలకు పరిచయం చేసి, “మీ నాన్నగారి ఆరోగ్యం ఎలా ఉంది?” అని అడిగింది.

“కాస్త బాగానే ఉంది,” అన్నది హేమనళిని. ఆమె కల్యాణీబాయి ఆరోగ్యం గురించి అడిగింది.

“నాదేముందిలే? ముసలిదాన్నయాను. అన్నట్టు మీ నాన్నగారు నీతో ఏమన్నా అన్నారా?”




"అన్నారు," అన్నది హేమనళిని సిగ్గుపడుతూ.

"ఒకవేళ నీ కామాట నచ్చలేదేమో? మా అబ్బాయి మునీశ్వరుడు లాగా పైకి కనిపిస్తాడు. కాని వాడి వైరాగ్యం పైకిమటుకే. తన మనసు అర్థం చేసుకున్న ఆడదాన్ని వాడు సుఖపెట్టగలడు. నువ్వంటే వాడికి గురి ఉన్నది. వాణ్ణి పెళ్ళిచేసుకో. ఏమంటావు?"

"నేను తగిన దాన్నని మీరనుకుంటే నేనే మభ్యంతరం చెబుతాను?" అన్నది హేమనళిని.

కల్యాణీబాయి ఆమెను ప్రేమగా దగ్గిరికి తీసుకుని, తల ముద్దు పెట్టుకున్నది.

ఈ సంభాషణ జరుగుతుండగానే కమల అక్కడినుంచి నిశ్శబ్దంగా అవతలికి వెళ్ళిపోయింది.

కల్యాణీబాయి కొడుకును పిలిచి, హేమనళినిని పెళ్ళాడటానికి సిద్ధం కమ్మన్నది.

"నీ ఆజ్ఞ ఎన్నడూ మీరను," అన్నాడు కమలనయనుడు.

కల్యాణీబాయి, "సతీ!" అని కమలను పిలిచి, "ఈ పూలు కడిగి దేవుడి మందిరంలో ఉంచు," అన్నది. కమల కొన్నిటిని పూజా మందిరంలో ఉంచి, మిగిలిన వాటిలో కొన్ని కమలనయనుడి పడకగదిలోని పీటమీద ఉంచి, మరి కొన్ని తీసుకుపోయి బీరువా లోని పాదుకలపై పెట్టి, తన శిరస్సు పాదుకలకు తాకించింది. ఆమెకా పాదుకలు తప్ప ఇంకేమీ మిగలలేదు.



ఇంతలో కమలనయనుడటుగా వచ్చాడు. ఆమె చప్పున బీరువా మూసి. మూల ఒదిగి నిలబడింది. ఆమెను చూసి కమలనయనుడు వెనక్కు వెళ్ళిపోయాడు కమల అక్కడినుంచి బయటికి వెళ్లాక అతను తిరిగి వచ్చి, బీరువా తలుపు తెరిచి, తన పాదుకలపైన ఉన్న పూలు చూశాడు.


Grams: CHEAPRATE

Phone: 72749

# MYSORE PAPER CORPORATION

General Bazar, Secunderabad.

***Dealers in all varieties of Indian and Foreign Papers***

*Agents:* Rainbow Printing Ink and Varnish Manufacturing Company Pvt. Ltd., Bombay.

*Distributors:* Purohit Paper and Pulp Mills Ltd., Bombay.

Contact for your packing material like polythene bags, Grease-proof bags, Coffee powder bags, Glazine Coffee powder bags, metal finish Craft paper bags, Plain craft paper bags, Green tape, Staple machine and Staple pins, drinking straws, etc.

**ANDHRA PAPER BAG COMPANY,**

**General Bazar, Secunderabad.**

## 20

కమలనయనుణ్ణి తాను పెళ్ళాడటం ఖాయమయినాక హేమనళినికి పాత బంధాలన్నీ తెగిపోయినట్టయింది. ఆమె మనస్సు వైరాగ్యంతో కూడిన ఆనందాన్ని పొందింది.

మర్నాడు అపరాహ్ణం అన్నదబాబు తనకుమార్తెతో సహా కమలనయనుడి తల్లిని చూసిపోదా మనుకుంటూండగా ఆమె బండిలో స్వయంగా వచ్చి. "మీ అమ్మాయిని దీవించటానికి వచ్చాను." అంటూ హేమనళిని చేతులకు సువర్ణకంకణాలు తొడిగి, ఆమెను మరో ముద్దుపెట్టుకుని, రేపు మీ రిద్దరూ మా యింటికి భోజనానికి రావాలి," అని చెప్పి వెళ్ళిపోయింది.

ఆ మర్నాడు ఉదయం ఎనిమిదిగంటలకే అన్నదబాబు సిద్ధమయాడు. హేమనళినికి మాత్రం ఇంకొంచెం ఆగి వెళ్ళవచ్చు ననిపించింది. "ఒక అరగంట ముందుపోతే నష్ట మేమిటి ?" అంటున్నాడు తండ్రి.

ఇంతలో ఒక బండివచ్చి ఇంటిముం దాగింది.

"జోగే నన్నయ్య వచ్చాడు," అన్నది హేమనళిని.

"బాగున్నావా, హేమా ?" అన్నా డతను.

"బండిలో ఇంకెవరన్నా ఉన్నారా ?" అని హేమనళిని అడిగింది.

"అవును. నాన్నగారికో బంధువును తెచ్చాను." అని జోగేంద్రుడంటూ ఉండగానే బండిలోనుంచి రమేశుడు దిగాడు. జోగేంద్రుడు ఆగమని కేకలువేస్తున్నా వినకుండా హేమ లోపలికి వెళ్ళిపోయింది.

కొయ్యబారి నిలబడిఉన్న రమేశుణ్ణి జోగేంద్రుడు చెయ్యి పట్టుకుని సావిట్లో తండ్రిదగ్గిరికి తీసుకొచ్చాడు.

రమేశుడు తనకు నమస్కారం చేస్తే ఆయన కూర్చోమన్నట్టుగా చేత్తో కుర్చీ చూపాడు.

ఆయన తన కొడుకుతో, "సరయిన సమయానికి వచ్చావు. నీకు టెలిగ్రాం ఇద్దామనుకుంటున్నాను." అన్నాడు.

"ఏమిటి విశేషం ?"

"కమలనయనుడికీ హేమకూ పెళ్ళి నిశ్చయమయింది. నిన్న ఆతనితల్లివచ్చి హేమ నాశీర్వదించి వెళ్ళింది."

"నాకు ముందుగా చెప్పి ఉండవలసింది. ఈ పెళ్ళి గురించి నేను కొన్ని విషయాలు ముందుగా చెప్పాలి. ఆ తరవాత మీ యిష్టం వచ్చినట్టు చేసుకోవచ్చు." అన్నాడు జోగేంద్రుడు.

"నీ మాటలు తరవాత వింటాను. ముందు మేం వెళ్ళాలి. కమలనయనుడితల్లి మాకు విందుచేస్తున్నది. మరి మీ భోజనం మాట ఏమిటి ?" అన్నాడు తండ్రి.


Phone : 42305
44404

దీపావళి శుభాకాంక్షలు

# నవయుగ హోటల్

బోర్డింగ్ & లాడ్జింగ్

**5-4-666,** నాంపల్లి స్టేషన్ రోడ్డు

హైదరాబాదు

రుచికరమైన మాంసాహార భోజన

సదుపాయములు - విశ్రాంతి గదులు

"ఏదో హోటల్లో తినేస్తాం. మధ్యాహ్నానికి తిరిగివస్తారుగదా. ఆ సమయానికి మేమూ వచ్చేస్తాం."

అన్నదబాబు రమేశబాబుతో ఏమీ మాట్లాడలేక పోయాడు. అతని ముఖం చూడటమే ఆయనకు కష్టయిమంది. వెళ్ళిపోతూ రమేశు డాయనకు నమస్కారం చేశాడు......

ఆ కిందటిరాత్రే కల్యాణీబాయి కమలతో, "రేపు హేమనళినీ. ఆమె తండ్రిగారూ భోజనానికి వస్తున్నారు. వంట ఎలాచేస్తావోమరి? ఈ యింట తన కూతురికి తిండిసుఖానికేమీ కొరత ఉండదని ఆయన కనిపించాలి! ... నీ మొహం అలా ఉందేమిటి? వంట్లో బాగా లేదా ?" అని అడిగింది.

తన కే జబ్బూ లేదని కమల అన్నది. ఆమె తన ఆప్తులకోసం బెంగపడుతున్నదేమో ననుకుని కల్యాణీబాయి, "కావలిస్తే చక్రవర్తిగారి ఇంటికి వెళ్ళి నాలుగు రోజు లుండిరా!" అన్నది.

"మీకు సేవచెయ్యటం తప్ప నా కింకేమీ అక్కర్లేదు. అందులో ఏదన్నా లోపం వస్తే శిక్షించండిగాని, నన్ను దూరంగా పంపెయ్యకండి," అన్నది కమల ఆదుర్దాగా.

తమ ఇద్దరికీ ఏదో పూర్వజన్మ సంబంధం ఉండి ఉంటుందనీ, లేకపోతే ఆ పిల్లకు తనపై ఈ రెండు రోజుల్లోనే ఇంత మమత కలగదనీ కల్యాణీబాయికి అనిపించింది.

ఆ రాత్రి కమల తన కిప్పుడున్నదానికన్న హెచ్చు ప్రాప్తం లేదనీ, తాను కోరనుకూడా రాదనీ, తన మనసును బాగా అదుపులో పెట్టుకుని పైకి తన వికారాలేవీ తెలియరాకుండా చూసుకోవాలనీ తీర్మానించుకున్నది.

మర్నాడు తెల్లవారుతూనే ఆమె ఉమేశుణ్ణి వెంటబెట్టుకుపోయి గంగాస్నానం చేసి కల్యాణీబాయి దగ్గిరికి వచ్చి, "ఇవాళ చాలా పని ఉంది. బజారునుంచి ఏమన్నా కావలిస్తే చెప్పండి. ఉమేశుణ్ణి పంపించి తెప్పిస్తాను." అన్నది.

ఇంతలో కమలనయను డటుగా వచ్చేసరికి కమల పైట సర్దుకుని అవతలికి వెళ్ళిపోయింది.

"ఎక్కడికో వెళుతున్నట్టున్నావు. త్వరగా తిరిగిరా. నిన్న నీతో చెప్పటం మరిచాను. ఈ పూట అన్నదబాబు నిన్నాశీర్వదించటానికి వస్తున్నారు," అన్నది తల్లి కొడుకుతో.

"నన్నాశీర్వదిస్తారా? వారికి నా మీద ఉన్నట్టుండి అంత దయ ఎందుకు కలిగిందీ ? రోజూ మేము కలుసుకుంటూనే ఉన్నామే," అన్నాడు కమలనయనుడు.

"ఈమాటల కేంలే. త్వరగా రా. ఆయన ఇక్కడే భోజనం చేస్తున్నారు," అంటూ కల్యాణీబాయి గంగాస్నానానికి బయలుదేరిపోయింది.


Phones : 33268
32384

Grams: Amoluck

అన్ని రకముల పేపర్ మరియు స్టేషనరీకి

కుషాల్‌చంద్ ప్రైవేట్ లిమిటెడ్

డిస్ట్రిబ్యూటర్లు:

★ సిరిపూర్ పేపర్ మిల్స్ లిమిటెడ్

★ స్వాన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్

★ మూన్‌లైట్ పెన్సిల్ ఫ్యాక్టరీ

సింగాపీ భవన్

తిలక్ రోడ్, హైదరాబాద్.

రమేశుణ్ణి చూడగానే లోపలికివెళ్ళిపోయిన హేమనళినికి తన దౌర్బల్యాన్ని గ్రహించింది. ఆ దౌర్బల్యమే లేకపోతే తాను రమేశుడిపట్ల నిర్లప్తత వహించి అతనితో మాట్లాడిఉండవలిసింది. ఆ దౌర్బల్యాన్ని నిగ్రహించుకోవాలన్న ఉద్దేశంతో ఆమె, కిందటి రోజు కల్యాణీబాయి ఇచ్చిన కంకణాలు చేతులకు తగిలించుకుని, చావడికుండా ఇంటిముందున్న తోటలోకి బయలుదేరింది.

అన్నదబా బామెను చూసి, "ఎక్కడికి బయలుదేరావు?" అన్నాడు.

"రమేశబాబుతోనూ, జోగే నన్నతోనూ మాట్లాడటానికి."

"వాళ్ళెక్కడికో బయలుదేరి వెళ్లారు. మళ్ళీ వస్తారులే. మనం బయలుదేరాలి. సిద్ధంగా ఉండు."

"ఇప్పుడే స్నానంచేసి వస్తాను." అంటూ హేమనళిని లేని ఉత్సాహాన్ని కృత్రిమంగా ప్రదర్శించింది. అందులోని కృతకత్వాన్ని అర్థం చేసుకుని, ఈ పెళ్ళి ఆమె కిష్టంలేదని గ్రహించిన అన్నదబాబుకు మళ్ళీ బాధకలిగింది.

వాళ్ళు బండిలో వెళ్ళేటప్పటి కింకా కమలనయనుడు తిరిగి రాలేదు. అతని తల్లే తండ్రికూతుళ్ళ కిద్దరికీ స్వాగతం చెప్పవలసి వచ్చింది. ఆమెకు హేమనళినిలోన ఏ మాత్రమూ ఉత్సాహం కనిపించలేదు. పైపెచ్చు ఆమె ముఖం విచారగ్రస్తంగా ఉన్నది. ఆమె తన మనస్సులో, "కమలనయనుణ్ణి ఏ పిల్ల అయినా ఎగిరి గంతేసి పెళ్లాడేస్తుంది, కాని ఇంగ్లీషు చదువుకున్న ఈ పిల్లకంటికి వాడాని నట్టు లేదు. వాడికి ఇలాటి పిల్లను చూడటం నాదే తప్పు. తొందర పడ్డాను," అనుకున్నది.

ఆమె అన్నదబాబుతో పెళ్ళిగురించి మాట్లాడుతూ, "పెళ్ళికి తొందర ఏమీలేదు. వధూవరు లిద్దరూ చదువుసంధ్య కలవాళ్ళే గద. వారు తమపెళ్ళి తామే నిశ్చయించుకుంటారు. కమలనయను డింకా ఒక నిశ్చయానికి వచ్చినట్లు కనబడటంలేదు,' అన్నది.

ఆమె వంటగదిలోకి వచ్చేసరికి కమలే వంటపని అంతా ముగించి ఒకమూల కూర్చునిఉన్నది. ముఖం మాడ్చుకుని ఉన్న హేమనళినిని చూసి కమలను చూసేసరికి ఆమెకు కమలమీద ప్రేమ రెట్టింపయింది.

"ఇక్కడ నీపని అయిపోతే అక్కడికివచ్చి కూర్చో. హేమనళిని వచ్చింది. మాట్లాడుకోవచ్చు." అన్నదామె కమలతో.

"నే నామెతో ఏం మాట్లాడగలను? ఆమె చదువుకున్నది. నేను తెలివితక్కువదాన్ని." అన్నది కమల.

'పిచ్చిగా మాట్లాడకు. చదువుకోగానే ప్రతివాళ్ళూ నీలాగా గృహలక్ష్మి కాగలరా? నావెంట రా!" అంటూ కల్యాణీబాయి కమలను తీసుకుపోయి ఆమెకు మంచిబట్టలు తానే కట్టి, జరీదైన నగలుపెట్టి, పరీక్షించి, "ఇంత అందగత్తె రాజాంతఃపురాల్లో కూడా ఉండదు," అన్నది.


*Pleas Visit :*

*Head Office* — Ashok DRESSES — Sultan Bazaar

HYDERABAD

*Branch Office* — Mandal APPARELS — Station Road

Manufacturers of:
QUALITY
FANCY
GARMENTS




Stockists :
WOOLLEN
HOSIERIES
HANDLOOM
&
BANIANS

Phone : 43077

Residence Phone : 35515

ఆమె కమలను వెంటబెట్టుకుని హేమనళిని తండ్రి కూర్చుని ఉన్న చావట్లోకి వెళ్ళింది. కమలనయను దప్పుదేవచ్చి అన్నద బాబుతో మాట్లాడుతున్నాడు అతన్ని చూడగానే కమల వెనక్కు తిరిగింది.

''ఏం సిగ్గుపడతావు? ఇక్కడ పరాయివాళ్ళెవరూ లేరు.'' అన్నది కల్యాణీబాయి.

కమలను చూసి అందరూ దిమ్మరపోయారు. హేమనళిని మరీ ముగ్ధురాలై లేచివచ్చి, ఆమెను తీసుకుపోయి తన పక్కనే కూర్చొ బెట్టుకున్నది. కల్యాణీబాయి కోరిక ఈడేరింది. ఆవిడ హేమనూ, కమలనూ మరొక గదికి పంపేస్తూ వడ్డనపని తానే చూస్తానన్నది.

## 21

కమలనయనుడి ఇంటినుంచి తిరిగి వస్తూనే హేమనళిని తన పడక గదికి వెళ్ళి, అక్కడ బల్లమీద పెట్టిఉన్న ఉత్తరం చూసుకుని, అది రమేశుడు రాసినట్టు గ్రహించి, గదితలుపులు గడియ పెట్టి ఉత్తరం చదువుకున్నది.

అందులో రమేశుడు కమల వృత్తాంతమంతా వివరించి, ఉత్తరాన్ని ఇలా ముగించాడు. ''మన ప్రేమ బంధాన్ని నీవే తెంచేశావు మరొకరిని ప్రేమించినందుకు నిన్ను తప్పుపట్టటం లేదు, నన్ను తప్పుపట్టవద్దని మాత్రమే కోరుకుంటున్నాను. నేను కమలను నా భార్యగా చేసుకోకపోయినప్పటికీ, నా హృదయం క్రమంగా ఆమె



క్షసి మళ్ళినమాట నిజం. ఇవాళ నా హృదయ స్థితి నాకే తెలియదు. నీవు నన్ను విడిచిపుచ్చకపోతే నా మనస్సు నీ నీడను శాంతిపొందిఉండేది. ఆ ఆశతో నే నేను నీదగ్గిరికి పరిగెత్తు కొచ్చాను. కాని నీవు నా ముఖంకూడా చూడకపోవడమూ, మరొకరిని పెళ్ళాడే ప్రయత్నంలో ఉండటమూ చూసి నా గుండె నీరు కారిపోయింది. నాకు సెలవియ్యి. నన్ను ద్వేషించకు. నీలో ద్వేషం రెచ్చగొట్టేపని ఏదీ నేను చెయ్యలేదు. నీకు శుభం కలుగుగాక!''


*** ఆంధ్ర రాజధానిలో

*** ఆంధ్ర ప్రజల ఆదరంతో

*** ప్రఖ్యాతిగాంచిన

# రవీంద్ర హోటల్

బోర్డింగ్ అండ్ లాడ్జింగ్

అబిడ్ రోడ్ — హైదరాబాద్

మాంసాహార శాఖాహార భోజనమునకు, చక్కటి విశ్రాంతికి, అన్ని ఆఫీసులకు వ్యాపార సంస్థలకు అందుబాటులో వున్నది

మర్యాదకు మన్ననలకు ప్రసిద్ధిగాంచిన హోటల్

హేమ నళిని ఆ ఉత్తరాన్ని తన తండ్రికిచ్చి చదవమన్నది. ఆయన అంతా చదువుకుని, "ఇదీ బాగానే ఉంది. రమేశుడు తనంతట తానే వెనక్కు తగ్గాడు. అతనికన్నా కమలనయనుడు ఎంతో ఉత్తముడు,'' అనుకున్నాడు.

ఆయన ఈమాట అనుకుంటూండగానే కమలనయనుడు వచ్చాడు తాను అతన్ని వదిలిపెట్టివచ్చి ఎంతో కాలం కాలేదు గనక, ఇంతలోనే అతను రావటం చూసి ఆశ్చర్యపడి. ''హేమతో మాట్లాడ వచ్చిఉంటాడు. అంతకన్న ఏముంటుందీ?" అనుకున్నాడు.

కమలనయను డాయనతో, ''నాకు మీ అమ్మాయినిచ్చి పెళ్ళి చేయ నిశ్చయించినట్టు తెలిసింది. కాని నా కిదివరకే పెళ్ళి అయిందని మీకు తెలిసే ఉంటుంది. నా భార్య చనిపోయిందని అందరూ అనుకుంటున్నారు. కాని ఆమె బతికేఉన్నదని నా నమ్మకం." అన్నాడు.

''దేవుడి దయవల్ల అలాగే జరగాలి!" అన్నాడు అన్నదబాబు.

అంతలో హేమనళిని అక్కడికి వచ్చి, "రమేశబాబు ఉత్తరం వారినికూడా చదవమనండి,'' అని తండ్రితో అన్నది.

ఉత్తరమంతా చదివి కమలనయను డాశ్చర్యపోయాడు. అతను కొద్దిసేపు మౌనంగా కూర్చుని, అన్నదబాబు వద్ద సెలవుపుచ్చుకుని వెళ్ళిపోయాడు.

తరవాత కొద్దిసేపటికి జోగేంద్రుడు ఒక్కడే వచ్చాడు. రమేశు డేడని తండ్రి అడిగితే, ''అత నే గంగలోనే ఈపాటికి కలిసే ఉంటాడు. అత నెటువెళ్లాడో నాకు తెలీదు," అన్నాడు.

"హేమ పెళ్ళిమాట?"

"మీ ఇష్టంవచ్చినట్టు చేసుకోండి. రేపు నేను వెళ్ళిపోతున్నాను," అన్నాడు జోగేంద్రుడు

అన్నపూర్ణ తండ్రివెంట కమలను చూడవచ్చింది. ఆమె కమలతో ఏకాంతంగా కూర్చుని, "ఇక్కడ పనిమనిషిలాగా ఎంత కాలం పడిఉంటావు. నీ కమలనయనుడు ఆ హేమనళినిని పెళ్ళాడుతుంటే చూస్తూ కూర్చుంటావా? అతనికి అంతా చెప్పెయ్యవలసిందే," అన్నది.

"నా సంగతంతా ఆయనకు చెప్పేస్తే నేను సిగ్గుపడి చచ్చిపోవలసిందే," అన్నది కమల. ఆమె తన ప్రస్తుత స్థితితో తృప్తిపడి ఉన్నట్టు చెప్పింది.

కల్యాణీబాయితో మాట్లాడుతూ ఉండిన చక్రవర్తిగారు వారున్నచోటికి వచ్చి, "కమలా, నీకేం భయంలేదు. కమలనయనబాబుకు హేమనళినితో పెళ్ళి జరగదు." అన్నాడు.

"అతవరకు మేలే. కాని కమల దాసీగాఉండటం మాని ఇంటి పెత్తనం సంపాదించే ఉపాయం చూడవద్దా?" అన్నది అన్నపూర్ణ


## అమర సాహితి

మా ప్రచురణలు: లిటరరీ పబ్లిషర్స్

అగ్ని శిఖలు.... మంచుజడలు కవిత : కమ్మిశెట్టి ... 2-00

రాత్రి వర్ధమాన యువకవుల వచన కవితా సంకలనమ్ ... 1-50

లంబాడి రామదాసు నాటం : సి. యస్. రావు ... 2-00

[ప్రొద్దుటూరు రాయల నాటక కళాపరిషత్తు పోటీలలో ఉత్తమ రచన, ప్రకటన, ప్రదర్శనకు బహుమతుల నందుకొన్నది]

వీడిన పాయలు నవల : సింగరాజు లింగమూర్తి ... 4-50

సంపెంగ పొదలు శ్రీమతి సి. ఆనందరామం ... 3-50

(ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ధారావాహినిగా వెలువడిన నవల)

తెగిన తీగలు డి. ప్రమీలాకుమారి ... 5-00

(ఆంధ్ర ప్రభ సచిత్రవారపత్రికలో క్రొధి ఉగాది నవలాపోటీలలో ప్రథమ బహుమతిపొందిన నవల)

పుస్తక విక్రేతలకు, గ్రంథాలయములకు మంచి కమీషన్ ఇవ్వబడును.
మూడు పుస్తకముల పై ఆర్డరు యిచ్చువారికి పోస్టేజి ఉచితము

"మీ కాళ్ళు పట్టుకుంటాను. నన్నిలాగే ఉండనివ్వండి." అన్నది కమల, కంటనీరు పెట్టుకుంటూ.

"ఏడవకమ్మా, నీ కోరికలన్నీ వాటంతట అవే సిద్ధిస్తాయి. ఎవరూ ఏమిచేయ్య నవసరం లేదు," అన్నాడు చక్రవర్తి.

అంతలో ఉమేశుడువచ్చి రమేశబాబు వచ్చాడని చక్రవర్తితో అన్నాడు. కమల తెల్లబోయింది. చక్రవర్తి ఆమెకు భయపడ వద్దనిచెప్పి బయటికివెళ్ళి రమేశుణ్ణి పలకరించి, "మీ రిలా వచ్చారేం ?" అన్నాడు.

"కమల బతికే ఉన్నదనిపిస్తున్నది. ఆమె సంగతంతా కమల నయనబాబుకు చేప్పేద్దామని వచ్చాను," అన్నాడు రమేశుడు.

"కమల జీవించే ఉన్నదనీ, ఆమె కమలనయనుణ్ణి కలుసుకున్న దనీ మీ రనుకోవచ్చు. అలాటప్పుడు మీ రామెనుగురించి అంతా చెప్పెయ్యటంవల్ల అతనికి మరింత ఆనందం చేకూరుతుందా ?" అని చక్రవర్తి అడిగాడు.

"ఆమెవల్ల తప్పులేదనీ, పతివ్రత అనీ అతనికి తెలియవద్దా?"

"అది తప్పనే నాకు తోస్తున్నది. ఏమైనా రేపు మా యింటికి రండి. అంతదాకా మీరు కమలనయనుణ్ణి చూడవద్దు."

అలాగేనని రమేశుడు వెళ్ళిపోయాడు. చక్రవర్తి కమలవద్దకు తిరిగివచ్చి, "రేపు రమేశబాబు మా యింటికి వస్తున్నాడు. నువు కూడావచ్చి, ఈ సంగతులేవీ కమలనయనుడితో చెప్పవద్దని అతన్ని అడుగు. నీ అధికారంకోసం నువే కృషిచెయ్యాలి," అని చెప్పాడు.



కమలనయను డక్కడికి వచ్చాడు. మామూలులాగా కమలను చూసి ముఖంతిప్పుకోకుండా చాలాసేపు ఆమెకేసి చూశాడు. అక్కడ అన్నపూర్ణకూడా ఉండటం గమనించి వెళ్ళిపోబోతుండే చక్రవర్తి ఆపి, "మా అమ్మాయి అన్నపూర్ణ. దీని బిడ్డకే మీరు వైద్యంచేశారు," అన్నాడు.

కమలను సొంతమనిషిలాగా చూసుకోమనీ, తాము వెళ్ళిపోతున్నామనీ చక్రవర్తి కమలనయనుడితో అన్నాడు.

*On this Happy Occasion of*

**DEEPAVALI**

We convey our greetings of Good Cheer and all good wishes for the NEW YEAR to all our patrons and Well-Wishers

## G. A. PARASHURAM & CO.,

TILAK ROAD, HYDERABAD

Sole Selling Agents for Andhra Pradesh

Bengal

THE NATION'S BEST

The Nations Best

The only lamp best for every home and industry

వచ్చినవాళ్ళు వెళ్ళిపోయాక కమలనయనుడు తన పడకగదికి వెళ్ళాడు. గదినిండా ఎఱ్ఱని సంధ్యకాంతులు గుబాళిస్తున్నాయి. మామూలుగా అతని ఆధీనంలో ఉండేమనస్సు ఈ పూట చంచలమై పోసాగింది. అరుణకాంతులు క్రమంగా క్షీణించాయి. అతను పడక గదినుంచి వెళ్ళిపోబోతూ, మంచానికి అవతలపక్క ఒక మూలగా కమల ముడుచుకుని కూర్చోవటం కనిపించింది. అతను రావటం చేత ఆమెగదిలో చిక్కుకుపోయింది.

అతను ఆమెనుచూసి వెళ్ళిపోబోయి మళ్ళీ వెనక్కువచ్చి, చూసి ఎందుకలా సిగ్గుపడతావు?" అని అడిగాడు.

## 22

మర్నాడు తెల్లవారుతూనే కమల చక్రవర్తిగారింటికివెళ్ళి, అన్నపూర్ణ కనిపించగానే ఆమెమెడ వాటేసుకున్నది.

"ఏమి టివాళ ఇంత ఉత్సాహంగా ఉన్నావు?" అని అనపూర్ణ అడిగింది.

"దేవుడికి నాపైన అనుగ్రహం కలిగినట్టు కనిపిస్తుంది. నా బాధలన్నీ పోతాయి."

ఇంతలో చక్రవర్తివచ్చి, "రమేశబాబు వచ్చాడు. ఒకసారి ఇలారా," అని కమలను పిలిచాడు. కమల ఆయనవెంట రమేశుడున్నచోటికివచ్చి, నేలకు తలతగిలేటట్టు ప్రణామం చేసింది.

"కమలా!" అన్నాడు రమేశుడు అత్యాశ్చర్యంతో.

"కమల చాలా కష్టాలు పడింది. ఆ సమయంలో మీ రామెను ఆదుకుని కాపాడారు. ఇప్పు డామెకు మంచిరోజులు రాబోతున్నాయి. మీ వద్ద సెలవుతీసుకోవటానికి వచ్చింది. దీవించండి," అన్నాడు చక్రవర్తి.

"సుఖీభవ. తెలిసిగాని, తెలీకగాని నా వల్ల ఏ వన్నా తప్పులు జరిగిఉంటే క్షమించు, కమలా!" అన్నాడు రమేశుడు. ఆమె మాట్లాడలేదు. "నావల్ల కావలసిన సహాయ మేమన్నా ఉంటే అడుగు, చేస్తాను,"

కమల నమస్కారం చేసి, "నా సంగతి ఎవరికీ చెప్పకండి. అదే నేను కోరేది," అన్నది.

"చాలా రోజులు దాచాను. బయటపెట్టటం వల్ల నష్టంలేదని తోచినమీదట అన్నదబాబు కొడుక్కూ, కూతురికీ మాత్రమే ఆ విషయాలు చెప్పాను," అన్నాడు రమేశుడు.

అతను వెళ్ళిపోయాడు.

కమల తిరిగి వచ్చేసరికి హేమనళిని కల్యాణీబాయితో మాట్లాడుతున్నది. కమలను చూడనే కల్యాణీబాయి లేచి, "మీ రిద్దరూ గదిలోకి వెళ్ళి మాట్లాడుకుంటూ ఉండండి. నేను అన్నదబాబుకు ఫలహారం తయారుచేస్తాను," అన్నది.


EYETEX
KATUKA

Prepared Scientifically as per
Ayurvedic methods -
good for cooling your eyes -
can be safely applied for tiny babies too!

EYETEX BINDI

available in very attractive
shades to suit individual tastes.

Manufactured by:
ARAVIND LABORATORIES
P. B. 1415 - Madras - 19




హేమనళిని గదిలో కమలను కౌగలించుకుని, "కమలా" ! '' అన్నది.

"నా పేరెలా తెలిసింది ?" అని కమల విభ్రాంతపోయి అడిగింది.

"నీ కథంతా ఒకరు చెప్పారు. అప్పటినుంచీ నువే ఆ కమలవని నాకు నమ్మకం. నీ సంగతంతా నీ భర్తదగ్గిర ఎంత కాలం దాస్తావు ? రహస్యం ఉంచే నీ ప్రయోజనం ఎట్లా సాగుతుంది ?"

"సిగ్గులేక నా కథ ఎలా చెప్పుకోను ?"

"దాచి లాభం లేదు."

"ఈ ఉన్న కాస్తసుఖంకూడా పోతే ? నువు చెబుతున్నది నా మంచికే ననుకో. నిజం ఎప్పటికైనా వారికి తెలీకపోదు. నేనే చెబుతాను. ఏదీ రహస్యంగా ఉంచను.'' అన్నది కమల.

''మంచిది. మేం పెళ్ళిపోతున్నాం. నీతో చెప్పిపోదా మనే వచ్చాను.

హేమనళిని తన దగ్గిర సెలవుపుచ్చుకుని వెళ్ళిపోయేటప్పుడు కల్యాణీబాయికి ఆమెమీద తిరిగి మంచి అభిప్రాయం ఏర్పడింది. ఆ సాయంకాలం ఆమె తన కొడుకుతో, "హేమనళినీ వాళ్ళు వెళ్ళిపోయారు. నీకు కనిపించారా ?" అన్నది.

''వాళ్ళని రైలెక్కించి వచ్చాను." అన్నాడు కమలనయనుడు.

"నువు వెయ్యి చెప్పు, అటువంటి పిల్ల మరొకతే ఉండదు." అన్నది తల్లి. కొడుకు నవ్వాడు. "పైగా నవ్వుతున్నావా? చక్కగా మీ ఇద్దరికీ పెళ్ళిచేద్దామనుకుంటే పడనిచ్చావు కావు."

కమలనయనుడూ, కమలా క్షణంపాటు ఒకరి నొకరు చూసుకున్నారు.

"ను వ్వనుకోగానే పెళ్ళికావటానికి నే నేం గొప్పవాణ్ణి ? నావంటి భ్రష్టు దెవరి క్కావాలి ?" అన్నా డతను. మళ్ళీ అతని చూపులూ, కమల చూపులూ కలిశాయి. కమల సిగ్గుపడింది.

"ఊరుకో, నీ మాటలు వింటే నాకు మండిపోతున్నది.'' అన్నది తల్లి.

కమల తాను కట్టుతున్న పూలమాల పూర్తిచేసి, దానిమీద నీరు చిలికి, కమలనయనుడి ఉపాసనా మందిరంలో ఉంచింది. తరవాత తన గదికెళ్ళి, ఇవాళ తనభర్త తనకేసి ప్రేమగా చూస్తుండటానికి కారణమేమిటా అనుకున్నది. ఆ రాత్రి నిద్రపోయే ముందామె "రేపు ఆయనతో అంతా చెప్పేస్తాను - ఏమైతే అవుతుంది." అనుకున్నది.



కొంచెం సేపటి కామె తలఎత్తి చూసేసరికి ద్వారంలో కమలనయనుడు నిలబడి ఉన్నాడు. కమల అతనికి నమస్కారంచేసి నిలబడి, నేను కమలను." అన్నది.

అతను ఆమెచెయ్యి పట్టుకుని, "నువు కమలవని తెలిసింది. నాగదికి పోదాంరా !" అన్నాడు. యిద్దరూ దేవుడిముందు ప్రమాణం చేశారు. తరవాత అతను ఆమె మెడలో పూలమాలవేసి, ఆమె నుదిటిపైన వెంట్రుకలు సరిచేసి వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళాక కమల అతని పడకగదిలోకివెళ్ళి, తనమెడలోని మాలతీసి, బీరువాలోని అతని పాదుకలపై పెట్టి, తిరిగివచ్చి ఇంటి పనులు ప్రారంభించింది.

ఆ సాయంకాలం మూడు జాములవేళ కమలనయనుడు కమల గదికివచ్చి, "ఈ కమలాలను తడిపి ఉంచు. సాయంకాలం అమ్మకిద్దరము ప్రణామం చేద్దాం." అన్నాడు.

కమల తలవంచుకుని, "నాసంగతంతా మీరు వినివుందరు," అన్నది.

"నువ్వేమీ చెప్పనవరంలేదు, నాకంతా తెలుసు," అన్నాడతను.

"కాని అమ్మగారు — ?"

"అమ్మ, నా పాపాలెన్నో క్షమించింది. నువుచెయ్యని పాపాన్ని క్షమించలేకపోతుందా ?'' అన్నాడతను.

సూర్యాస్తమయంవేళ ఇద్దరూ కలిసివెళ్ళి కల్యాణీబాయికి ప్రణామంచేశారు ఆమె వారిని దీవించింది.

Printed and Published by A. Sudhakar Rao from Yuva Press, 5-9-88, Public Garden Road, Hyderabad-1.
Controlling Editor Sri "CHAKRAPANI"